V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం 10-11-2024

సంపుటి : 01 | సంచిక : 188 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం

- హామీలు అమలు చేస్తున్నాం.. వివరాలు ఇవ్వడానికి సిద్ధం
- ముంబయిలో సీఎం రేవంత్‌రెడ్డి



**ముంబయి:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం రేవంత్‌రెడ్డి ముంబయి వెళ్లారు. అక్కడి పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.17,829 కోట్లు రుణమాఫీ చేశాం. ఇందుకు సంబంధించి వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధం. తెలంగాణలో 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మహారాష్ట్ర బీజేపీ నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెబుతున్నారు. ఆయన అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు.. మిగతా2లో...



# వచ్చే ఎన్నికల్లో 100 శాతం విజయం మనదే

## మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది

- ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది
- అధికారం ఇచ్చింది కూల్చడానికి కాదు..
- ప్రజలను కాపాడాల్సింది పోయి.. భయపెడతారా..?
- అరెస్టులకు భయపడేది లేదు
- పాలకుర్తి బీఆరెస్ నేతలతో కేసీఆర్

**విశ్వంభర, సిద్దిపేట :** రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 శాతం విజయం మనదే అని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ నేతలతో సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి లోని తన నివాసంలో కేసీఆర్ శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని అన్నారు.

ప్రభుత్వం అంటే అందర్నీ కాపాడాలని అన్నారు. సమాజాన్ని నిలబెట్టి నిర్మాణం చేయాలని.. అంతేతప్ప కూలగొడతామంటూ పిచ్చిగా మాట్లాడొద్దని సూచించారు. అధికారం ఇచ్చింది కూల్చడానికి కాదు.. నిర్మించడానికి అని తెలిపారు. మాకు మాటలు రావనుకుంటున్నారా.. ఇవాళ మొదలుపెడితే రేపటి వరకు మాట్లాడతానని తెలిపారు. రౌడీ పంచాయితీలు.. మిగతా2లో...

### ప్రశ్నించేవారంటే రేవంత్‌రెడ్డికి ఎందుకంత వణుకు?

- ఎవరు ప్రశ్నిస్తే వాళ్లపై అక్రమ కేసులు పెడుతున్నారు
- జర్నలిస్టు రంజిత్ అరెస్ట్ అప్రజాస్వామికం
- జర్నలిస్టులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి
- సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై కేటీఆర్ ఆగ్రహం




### మహావికాస్ అఘాడీ అంటే అవినీతి, కుంభకోణాలకు నెలవు

- కాంగ్రెస్..పాలిత రాష్ట్రాలను ఏటీఎంలుగా మార్చుకుంటుంది
- కర్ణాటకలో మద్యం విక్రయదారుల నుంచి రూ. 700 కోట్లు కొల్లగొట్టారు
- దేశానికే తొలి ప్రాధాన్యం అనే భావన భారత్‌కు ఉన్న గొప్ప బలం
- దేశాన్ని బలహీనం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది
- అకోలా ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ




## ఉద్రిక్తంగా మారిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ధర్నా

* స్వల్పంగా తోపులాట
* తనపై దాడి జరిగిందని కౌశిక్ రెడ్డి ఆరోపణ
* స్పందించిన కేటీఆర్, హరీశ్‌రావు

2



### మన దేశంలో సమానత్వం ఉంది

- స్త్రీ, పురుష వివక్ష లేదు
- పితృస్వామ్యం.. మహిళ ఎదుగుదలను అడ్డుకోలేదు
- నిర్మలా సీతారామన్




## 14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు

* నెహ్రూ జయంతి నుంచి సోనియా పుట్టిన రోజు వరకు
* ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం
* 28న పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం
* ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
* విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ భేటీ
* పలు నిర్ణయాలతో పాటు, రోడ్ మ్యాప్ సిద్ధం చేసిన ఉపసంఘం




## సత్వర న్యాయమే ప్రధాన ధ్యేయం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే
- ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ అదనపు కోర్టు భవనాలు వర్చువల్‌గా ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్:** కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే న్యాయవ్యవస్థ ప్రధాన ధ్యేయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే అన్నారు. న్యాయవాదులు న్యాయాధికారులకు సహకరిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్‌లలో అదనపు కోర్టు భవనాలను ఆయన వర్చువల్ పద్ధతిలో ప్రారంభించి ప్రసంగించారు. ఈ పద్ధతిలో కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని.. అందరినీ కలుసుకున్న భావన కలిగిందన్నారు. కోర్టు భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా న్యాయవాదులు, న్యాయాధికారులకు అభినందనలు తెలిపారు. కక్షిదారులు లేకపోతే.. మిగతా2లో...



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 110 | ₹ 132 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 191 | ₹ 218 |

### స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుపై రేపటి నుంచి ప్రత్యేక కమిషన్ బహిరంగ విచారణ





## నైతిక విలువల సలహాదారుగా చాగంటి..

కేబినెట్ ర్యాంకు కల్పించిన ఏపీ ప్రభుత్వం

20 కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

మొత్తం 59మందికి నామినేటెడ్ పదవులు




## పాక్ రైల్వే స్టేషన్‌లో పేలుడు

* 20 మంది మృతి



**కరాచీ:** బాంబు పేలుడు తో పొరుగు దేశం పాకిస్థాన్ మరోసారి దద్దరిల్లింది. క్వెట్టా రైల్వే స్టేషన్ లో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ గాయపడ్డారు. బలూచిస్థాన్ లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్టేషన్ నుంచి రైలు పెషావర్‌కు బయల్దేరుతుండగా.. ఈ పేలుడు సంభవించినట్లు పాకిస్థాన్ డాన్ న్యూస్ నివేదించింది. ఈ ఘటనలో 20 మంది మరణించినట్లు పేర్కొంది. సుమారు 30 మందికి పైగా గాయపడ్డారని వెల్లడించింది. ఈ పేలుడును ఆత్మాహుతి దాడిగా భావిస్తున్నట్లు క్వెట్టా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహ్మద్ బలోచ్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. పోలీసులు, భద్రతా దళాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే
# మేం నిజాలు చెబుతూనే ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన బీజేపీని ఎన్నికల్లో ఓడించాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# వచ్చే ఎన్నికల్లో 100 శాతం విజయం మనదే

### పాలకుర్తి బీఆరెస్ నేతలతో కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చేయడం తమకు కూడా తెలుసని చెప్పారు. ప్రజలను కాపాడాల్సింది పోయి.. భయపెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మీకు బాధ్యతను అప్పగించారు.. బాధ్యతాయుతంగా సేవ చేయాలని సూచించారు. అరెస్టులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నాయకులు భయపడవద్దని.. మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 100 శాతం మనదే విజయమని ధీమా వ్యక్తం చే శారు. కొత్త ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడిచిపోయిందని తెలిపారు. ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని అన్నారు. పాలన అంటే ఒట్టి మాటలతో నడిచేది కాదన్నారు కేసీఆర్. అధికారంలోకి రాగానే వాణ్ని లోపల వేయాలి.. వీడిని లోపల వేయాలని బీఆర్ఎస్ చూడదన్నారు. 'ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి. సమసమాజ నిర్మాణం చేయాలి. పది మందికి లాభం చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో.. ఏం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారు' అని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కేసీఆర్ మండిపడ్డారు. అది చేస్తాం.. ఇది చేస్తామని పిచ్చి మాటలు తమకు రావా? అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికా? లేక మాటలతో కాలయాపన చేయడానికా? అని తూర్పారబట్టారు. తాము తమ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువే అమలు చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. అడగడని పథకాలు కూడా అమలు చేశామన్నారు.

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో వందశాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కేసీఆర్ ఉద్ఘాటించారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టిన భయపడాల్సిన పని లేదని పార్టీ శ్రేణులకు భరోసారి ఇచ్చారు గులాబీ దళపతి. అరెస్టులకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. లీగల్‌గా పోరాడుదామని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అందరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కాగా, శనివారం నాడు పలు పార్టీలకు చెందిన నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

చాలా రోజుల తరువాత మాట్లాడిన కేసీఆర్..

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత కేసీఆర్ పూర్తిగా సైలెంట్ అయిపోయారు. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడక ముందే.. ఎలక్షన్ రిజల్ట్స్ ట్రెండ్స్ చూసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు కేసీఆర్. ఆ తరువాత ఇంట్లో పడిపోవడం, ఆస్పత్రిలో ఆపరేషన్, విశ్రాంతి కారణంగా కొన్ని నెలలు ఆయన ప్రజలకు దూరంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోవడంతో తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజు సమావేశానికి హాజరైన కేసీఆర్.. ఆ తరువాత మళ్లీ జాడ లేకుండా పోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ప్రజా క్షేత్రంలోకి వచ్చింది లేదు. వచ్చినా మాట్లాడింది లేదు. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటూ.. పార్టీ ముఖ్యనేతలు వచ్చినప్పుడు కలుస్తూ.. వారికి కీలక సూచనలు చేస్తున్నారు. దాదాపు 5 నెలల తరువాత కేసీఆర్ మళ్లీ తన నోరు విప్పి.. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ విధానాలను తప్పుపడుతూ.. తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ తన పార్టీ క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేశారు.

### స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు పై
### రేపటి నుంచి ప్రత్యేక కమిషన్
# బహిరంగ విచారణ

**విశ్వంభర, హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ నవంబర్ 11 నుంచి బహిరంగ విచారణ జరపనుంది. మాసబ్ ట్యాంక్ సంక్షేమ భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహిస్తారు. వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి సూచనలు, వినతిపత్రాలు, అభ్యంతరాలను కమిషన్ ఛైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు స్వీకరిస్తారు. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాధారణ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 12న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్జీవోలు, సంఘాల నుంచి వినతులు, సూచనలు స్వీకరిస్తారు.

# సత్వర న్యాయమే ప్రధాన ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

న్యాయాధికారుల పాత్ర ఉండదన్న విషయం గుర్తుంచుకొని పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి, రంగారెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్యామ్‌కోషీ మాట్లాడుతూ.. త్వరలోనే ప్రిసైడింగ్ అధికారుల నియామకం చేపడతామన్నారు. జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో కొత్త కోర్టుల ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలున్నాయని, అక్టోబరు 26న భూమి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. త్వరలో పనులు మొదలవుతాయని వెల్లడించారు. జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ రెండూ హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్నాయని, భూమి విలువ అంతకంతకూ పెరిగి వివాదాల సంఖ్య కూడా పెరుగుతోందని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఈ రెండు న్యాయస్థానాలకు బదిలీచేసిన 2,500కుపైగా పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త కోర్టు భవనాల ప్రారంభోత్సవంతో న్యాయవాదులందరికీ జిల్లా కోర్టు లాయర్లుగా గుర్తింపు లభించిందన్నారు. ఈ రెండు కోర్టులకు రెగ్యులర్ జడ్జిలను నియమించాలని బార్ అసోసియేషన్ల నుంచి అభ్యర్థనలు వచ్చాయని, పదోన్నతులు, ఇతర పాలనాపరమైన కారణాలతో ఆలస్యమైందని, త్వరలోనే నియామకం చేపడతామన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి ఎస్.శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్‌లలో ప్రస్తుతం 5 చొప్పున 10 కోర్టులున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 1,13,128 కేసులు దాఖలు కాగా 24,021 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ కేసుల్లో 1,816 ఇబ్రహీంపట్నం కోర్టుకు, 733 షాద్‌నగర్ కోర్టుకు బదిలీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి వై.జయప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రాజశేఖర్‌రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### నాగార్జున సాగర్ వద్ద
## ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వివాదం

**విశ్వంభర, నాగార్జున సాగర్:** నాగార్జున సాగర్ వద్ద ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదుకు వచ్చిన తెలంగాణ అధికారులను ఏపీ అధికారులు అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై కేఆర్ఎంబీ యాజమాన్యానికి తెలంగాణ అధికారులు సమాచారమిచ్చారు. ఇరు రాష్ట్రాల అధికారులకు సాగర్ ఎస్ఈ కృష్ణమోహన్ సర్దిచెప్పారు.

### మహావికాస్ అఘాడీ అంటే
# అవినీతి, కుంభకోణాలకు నెలవు

- అకోలా ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ



**ముంబయి:** మరికొన్ని రోజుల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో అకోలాలో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. మహావికాస్ అఘాడీ అంటేనే అవినీతి అంటూ ఆరోపించారు.

ఈ రోజు ఎంతో ప్రత్యేకం..

''నవంబరు 9కి చరిత్రలో అత్యంత ప్రాధాన్యం ఉంది. 2019లో సరిగ్గా ఇదేరోజు సుప్రీంకోర్టు రామమందిరంపై తీర్పునిచ్చింది. ఆ తీర్పు తర్వాత ప్రతి మతంలోని ప్రజలు గొప్ప సున్నితత్వాన్ని ప్రదర్శించారు. దేశానికే తొలి ప్రాధాన్యం అనే భావన భారత్‌కు ఉన్న గొప్ప బలం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటైతే ఆ రాష్ట్రాన్ని తమకు ఏటీఎంగా మార్చుకుంటుంది. మహావికాస్ అఘాడీ అంటే అవినీతి, కుంభకోణాలకు నెలవు. కర్ణాటకలో మద్యం విక్రయదారుల నుంచి రూ. 700 కోట్లు కొల్లగొట్టారు. ఎన్నికల్లో గెలిస్తే ఇంకెంత దోచుకుంటారో ఊహించండి'' అంటూ ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు.

హరియాణా ప్రజలు కాంగ్రెస్ కుట్రను భగ్నం చేశారన్నారు. దేశాన్ని బలహీనం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వివిధ కులాల మధ్య చిచ్చుపెట్టి సమాజాన్ని విడదీసేందుకు ప్రయత్నిస్తోందని.. మనమంతా ఐక్యంగా ఉండి వారి కుట్రను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీల హక్కులను హస్తం పార్టీ హరిస్తోందని ఆరోపించారు.

నా తరపున హామీ ఇవ్వండి..

''పదేళ్లలో కేంద్రం పేదలకు పక్కా ఇళ్లు నిర్మించింది. మీరు ఇతర గ్రామాలను సందర్శించినప్పుడు ఇల్లు లేని వారు, గుడిసెల్లో నివసించేవారు కనిపిస్తే.. వారి వివరాలతో సహా చిరునామాను నాకు పంపించండి. అతడికి శాశ్వతంగా ఒక ఇల్లు సొంతం అవుతుందని నా తరపున హామీ ఇవ్వండి. కచ్చితంగా ఆ హామీని నేను నెరవేరుస్తా. రాష్ట్ర ప్రజలు నుంచి నాకు ఎప్పుడూ ఆశీస్సులు అందుతూనే ఉన్నాయి. మరోసారి మీ ఆశీర్వాదం కోసం ఇక్కడికి వచ్చాను. ఎన్నికల్లో మహాయుతి కూటమిని గెలిపిస్తారని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. కాగా.. 288 మంది శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలు ప్రకటించనున్నారు.

# 14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు

### విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ భేటీ



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణపై శనివారం జరిగిన సబ్‌కమిటీ భేటీలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రజా విజయోత్సవాలు ప్రారంభించి.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు వరకు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది. విజయోత్సవాల్లో భాగంగా భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ 25 రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ కార్యక్రమాల ద్వారా వివరించనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

భేటీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. ''ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం. 28న పారా మెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం. ఉత్సవాల్లో భాగంగా పలు కంపెనీలో ఒప్పందాలు చేసుకుంటాం. గ్రూప్4కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తాం. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తాం'' అని తెలిపారు.

# నైతిక విలువల సలహాదారుగా చాగంటి

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మరోసారి పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. తొలి జాబితాలో ఆర్టీసీ, పౌరసరఫరాలు, ఏపీఐఐసీ, వక్ఫ్ బోర్డు వంటి 20 కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్‌లతో పాటు ఆర్టీసీకి వైస్ ఛైర్మన్‌ను కూడా నియమించింది. తాజాగా వివిధ సామాజిక వర్గాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌లను నియమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ (పట్టాభిరామ్), ఏపీ కల్చరల్ మిషన్ (తేజస్వీ), ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ (జీవీ రెడ్డి), ఫారెస్ట్ డెవలప్‌మెంట్ (సుజయ్ కృష్ణ), గ్రంథాలయ పరిషత్ (జి.కోటేశ్వరరావు) సహా వివిధ పట్టణాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఛైర్మన్‌లను నియమించింది. పొత్తు ధర్మాన్ని పాటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారికి ఇందులో గుర్తింపు లభించింది. మొత్తం 59మందిని నామినేటెడ్ పదవుల్లో నియమించింది. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును రాష్ట్ర నైతిక విలువల సలహాదారుగా నియమించడమే కాదు, ఆయన క్యాబినెట్ ర్యాంకును ఇచ్చారు.

రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్. (నర్సాపురంతెదేపా)క్యాబినెట్ ర్యాంక్

రాష్ట్ర నైతిక విలువల సలహాదారుచాగంటి కోటేశ్వర రావు. (స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్) క్యాబినెట్ ర్యాంక్. శెట్టిబలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌కుడిపూడి సత్తిబాబు. (రాజమండ్రి తెదేపా)

గవర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మాల సురేంద్ర. (అనకాపల్లి తెదేపా)

కళింగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌రోణంకి కృష్ణంనాయుడు. (నరసన్నపేట తెదేపా)

కొప్పు వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్. (మాడుగుల తెదేపా)

కురుబకురుమసంక్షేమ,అభివృద్ధికార్పొరేషన్ఛైర్మన్ దేవేంద్రప్ప. (ఆదోని తెదేపా)

నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్.సదాశివ. (తిరుపతి తెదేపా)

రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి. (అడ్వొకేట్ భాజపా)

తూర్పు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్: పాలవలస యశస్వి. (శ్రీకాకుళం జనసేన)

ఏపీ వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కప్పట్రాళ్ల సుశీలమ్మ ( బోజమ్మ ) (ఆలూరుతెదేపా)

ఏపీ వన్యకుల క్షత్రియ (వనేరెడ్డి, వన్నికాపు, పల్లి కాపు, పల్లి రెడ్డి) కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఆర్ రాజన్ (చంద్రగిరి తెదేపా)

ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నరసింహ యాదవ్ (తిరుపతి తెదేపా)

ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చిలకలపూడి పాపారావు (రేపల్లె జనసేన)

ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీరంకి వెంకట గురుమూర్తి (పామర్రు తెదేపా)

ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ గండి బాబ్జి (పెందుర్తి తెదేపా)

ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ విజయవాడ మంజులా రెడ్డి రెంటచింతల (మాచర్ల తెదేపా)

ఏపీ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు నీలాయపాలెం విజయకుమార్ (తిరుపతి తెదేపా)

ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ జీవీ రెడ్డి (మార్కాపురం తెదేపా)

ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ మన్నవ మోహన్ కృష్ణ (గుంటూరు వెస్ట్ తెదేపా)

ఏపీ కల్చరల్ కమిషన్ తేజస్వి పొడపాటి (ఒంగోలు తెదేపా)

ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పోలంరెడ్డి దినేశ్ రెడ్డి (కోవూరు తెదేపా)

ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సుజయ్ కృష్ణ రంగారావు (బొబ్బిలి తెదేపా)

ఏపీ గ్రంథాలయ పరిషత్ గోనుగుంట్ల కోటేశ్వర రావు (నరసరావుపేట తెదేపా)

ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డేగల ప్రభాకర్ (గుంటూరు ఈస్ట్ తెదేపా)

ఏపీ ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు ( కేకే చౌదరి కోడూరు తెదేపా)

ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చిల్లపల్లి శ్రీనివాస రావు (జనసేన)

ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రగడ నాగేశ్వర రావు (యలమంచిలి తెదేపా)

ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి ( ఒంగోలు తెదేపా)

ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆనం వెంకట రమణా రెడ్డి ( నెల్లూరు రూరల్ తెదేపా)

ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ రఘురామ రాజు గొట్టిముక్కల ( విజయవాడ సెంట్రల్ తెదేపా)

ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ శేవల దేవదత్ (తిరువూరు తెదేపా)

ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రావి వెంకటేశ్వర రావు (గుడివాడ తెదేపా)

ఏపీ ఉమెన్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కావలి గ్రీష్మ (రాజాం తెదేపా)

ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ బోర్డు ఛైర్మన్ (దొన్ను దొర తెదేపా విజయనగరం జోన్), రెడ్డి అప్పల నాయుడు జనసేన (విజయవాడ జోన్), సురేశ్ రెడ్డి భాజపా (నెల్లూరు జోన్) , పోలా నాగరాజు తెదేపా (కడప జోన్)

ఏపీ హ్యాండ్ లూమ్ కోఆపరేటివ్ సొసైటీ సజ్జా హేమలత (చీరాల తెదేపా)

ఏపీ నాటక అకాడమీ గుమ్మడి గోపాల కృష్ణ ( పామర్రు తెదేపా)

ఎన్టీఆర్ వైద్య సేవ సీతారామ సుధాకర్ ( విశాఖపట్నం సౌత్ తెదేపా)

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ (విజయవాడ వెస్ట్ తెదేపా)

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్వామినాయుడు అల్లాడ (అమలాపురం తెదేపా)

అనంతపూర్ హిందూపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ టిసి . వరుణ్ అనంతపూర్ జనసేన)

అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూపానంద రెడ్డి (కోడూరు తెదేపా)

బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సలగల రాజశేఖర్ బాబు (బాపట్ల తెదేపా)

బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ తెంటు లక్ష్మి నాయుడు (బొబ్బిలి తెదేపా)

చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కె.హేమలత (చిత్తూరు తెదేపా)

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ తుమ్మల రామస్వామి (కాకినాడ జనసేన)

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సోమిశెట్టి వెంకటేశ్వర్లు (కర్నూలు తెదేపా)

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మట్టా ప్రసాద్ (మచిలీపట్నం భాజపా)

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (నెల్లూరు రూరల్ తెదేపా)

రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ బొడ్డు వెంకటరమణ చౌదరి (రాజానగరం తెదేపా)

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోరికన రవికుమార్ (శ్రీకాకుళం జనసేన)

విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణవ్ గోపాల్ (విశాఖపట్నం ఈస్ట్)

ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ముస్తాక్ అహ్మద్ (నంద్యాల తెదేపా)

ఏపీ ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దూండి రాకేశ్ (విజయవాడ వెస్ట్ తెదేపా)

ఏపీ క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వి. సూర్యనారాయణ రాజు (కనకరాజు సూరి ) ( భీమవరం జనసేన)

ఏపీ స్టేట్ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కొత్తపల్లి సుబ్బారాయుడు (నరసాపురం జనసేన)

ఏపీ మాదిగ వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ తెదేపా)

ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ ( ఒంగోలు జనసేన)

ఏపీ గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ కిడారి శ్రావణ్ (అరకు వ్యాలీ తెదేపా)

## ఉద్రిక్తంగా మారిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ధర్నా

**విశ్వంభర, హుజూరాబాద్:** దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలంటూ బీఆరెస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హుజూరాబాద్‌లో చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. దళిత కుటుంబాలతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ధర్నా నిర్వహించేందుకు వస్తుండగా స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. పోలీసులకు, దళితులకు మధ్య జరిగిన ఈ తోపులాటలో ఓ మహిళకు స్వల్పగాయాలు అయ్యాయి. అనంతరం దళిత కుటుంబాలతో కలిసి కౌశిక్ రెడ్డి అంబేద్కర్ చౌరస్తా దగ్గర దాదాపు గంటపాటు ధర్నా నిర్వహించారు. దీంతో కరీంనగర్ వరంగల్ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి కౌశిక్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వస్తోందని చెప్పడంతో వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని ధర్నా చేస్తుంటే.. పోలీసులు తనతోపాటు, ధర్నా చేస్తున్న వారిని తీవ్రంగా కొట్టారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు.

### దళిత బంధు అడిగితే దాడి చేస్తారా?: కేటీఆర్

ఈ ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. దళిత బంధు సాయం అడిగితే ఎమ్మెల్యేపై దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడి చేయడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? అని నిలదీశారు. ''ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు పని చేస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పకుండా పోలీసులకు వడ్డీతో సహా చెల్లిస్తాం. కౌశిక్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష పెంచుకున్నారు. అరికెపూడి గాంధీతో అతడిపై దాడి చేసే ప్రయత్నం చేశారు. ప్రజల కోసం పోరాడుతున్న ఎమ్మెల్యేపై సీఎం దాడి చేయించారు. ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. కౌశిక్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. అరెస్టు చేసిన భారాస కార్యకర్తలందర్నీ విడుదల చేయాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### కౌశిక్ రెడ్డికి హరీశ్‌రావు ఫోన్

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు ఫోన్ చేశారు. ఘటన జరిగిన తీరు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయపరంగా ముందుకెళ్దామని సూచించారు.

# ప్రశ్నించేవారంటే రేవంత్‌రెడ్డికి ఎందుకంత వణుకు?

### సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం

**విశ్వంభర, హైదరాబాద్:** జర్నలిస్ట్, వైఆర్ టీవీ రంజిత్ అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రశ్నించే వారంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత వణుకు అని ప్రశ్నించారు. వైఆర్ టీవీ రంజిత్ అరెస్టు నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్‌మీడియా వేదికగా కేటీఆర్ విరుచుపడ్డారు. రాష్ట్రంలో ఎవరూ ప్రశ్నిస్తే వాళ్లపై అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు నిత్య కృత్యమయ్యాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చేసే దద్దమ్మ పనులను నిలదీసినందుకే రంజిత్‌ను నిర్బంధించారని అన్నారు. వెంటనే రంజిత్‌ను విడుదల చేయాలని.. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

రంజిత్‌ను వెంటనే విడుదల చేయాలి : హరీశ్‌రావు

వైఆర్ టీవి రంజిత్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. నిఘా వేసి, రెక్కీ నిర్వహించి ఒక జర్నలిస్టును నిర్బంధించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, ప్రజల తరఫున నిలదీస్తే సంకెళ్లు వేస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తప్పులను ఎత్తి చూపితే అరెస్టు చేస్తారా? కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన రంజిత్‌ను వెంటనే విడుదల చేయాలని, అతని పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మన దేశంలో సమానత్వం ఉంది..

### నిర్మలా సీతారామన్

**బెంగళూరు:** మహిళా సాధికారత, పితృస్వామ్యంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పితృస్వామ్యం మహిళ ఎదుగుదలను అడ్డుకుంటే ఇందిరా గాంధీ ఏ విధంగా ప్రధానమంత్రి అయ్యారని ప్రశ్నించారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో సమానత్వం ఉందని.. స్త్రీ, పురుష వివక్ష లేదన్నారు.

మహిళా సాధికారతపై అడిగిన ప్రశ్నపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. ''భారత్‌లో మహిళల ఎదుగుదలను పితృస్వామ్యం అడ్డుకుంటే.. మరి ఇందిరాగాంధీ ప్రధాని ఎలా అయ్యారు..? ఇలాంటివి విని మోసపోకండి. మీ కోసం మీరు నిలబడి, తర్కయుక్తంగా మాట్లాడితే. ఏ పితృస్వామ్యం మిమ్మల్ని, మీ ఎదుగుదలను అడ్డుకోలేదు'' అని సీతారామన్ పేర్కొన్నారు. అయితే.. మహిళలకు తగిన సౌకర్యాలు కల్పించడం లేదని, దీని కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఆవిష్కర్తలకు ఉన్న అవకాశాలపై అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. ''ప్రధాని మోదీ ఆవిష్కర్తలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించారు. కొత్త ఆవిష్కరణల కోసం కేంద్రం కృషి చేస్తోంది. అది మాత్రమే కాకుండా ఆవిష్కరణలకు తగిన మార్కెట్లను కనుగొనేందుకు కృషి చేస్తోంది'' అని తెలిపారు. మొత్తం ప్రభుత్వ కొనుగోళ్లలో 40 శాతం ఎమ్ఎస్ఎమ్ఈల నుంచే వస్తున్నాయని వెల్లడించారు. దీనివల్లే 2 లక్షల స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయని.. అందులో 130 యూనికార్న్‌లుగా అవతరించాయని అన్నారు.


# మళ్లీ రంగంలోకి హైడ్రా బుల్డోజర్లు

- ఫిల్మ్‌నగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత
- మహిళా మండలి భవనం తొలగించాలని స్థానికుల ఫిర్యాదు
- హైడ్రా కూల్చివేతపై ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ తీవ్ర అభ్యంతరం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణల కూల్చివేతలపై కొద్ది రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న హైడ్రా తాజాగా ఫిల్మ్ నగర్ రోడ్డు నెం.12లో బుల్డోజర్లతో విరుచుకుపడింది. అక్కడి ప్రముఖ విగ్రహాల సమీపంలోని నిర్మాణాన్ని నేలమట్టం చేసింది. రెండు జేసీబీల సహాయంతో హైడ్రా సిబ్బంది షెడ్డును కూల్చివేశారు. ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ రోడ్డును ఆక్రమించి ఫిల్మ్ నగర్ మహిళా మండలి పేరుతో నిర్మాణం చేపట్టి కార్యకలాపాలు నిర్వహిస్తోందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ మూడు రోజుల కిందట ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీకి నోటీసులు జారీ చేశారు.

అనధికారికంగా నిర్మించిన ఫిల్మ్ నగర్ మహిళా మండలి భవనాన్ని 24 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అనధికారిక నిర్మాణాన్ని కూల్చివేశామని హైడ్రా అధికారులు తెలిపారు. ఆ ప్రదేశంలో ఉన్న విగ్రహాల జోలికి వెళ్లలేదని స్పష్టం చేశారు. అయితే హైడ్రా కూల్చివేతపై ఫిల్మ్ నగర్ హౌజింగ్ సొసైటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ సొసైటీకి చెందిన 290 గజాల్లో మహిళా మండలి భవనంతో పాటు విగ్రహాలు పెట్టడానికి కేటాయించామని, తాము ఎలాంటి రోడ్డును ఆక్రమించలేదని సొసైటీ కార్యదర్శి ఖాజా సూర్యనారాయణ తెలిపారు. తమ స్థలంలోని నిర్మాణాన్ని హైడ్రా అన్యాయంగా కూల్చివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు నగరంలోని చెరువులు, కుంటలను ఎవరూ ఆక్రమించకుండా ఇప్పటికే రంగారెడ్డి జిల్లా రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పకడ్బందీగా లెక్కలు సిద్ధం చేస్తున్నారు. డిజిటల్ సర్వేల సహాయంతో చెరువుల విస్తీర్ణాన్ని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధయిస్తున్నారు. ప్రతి చెరువుకు సంబంధించిన అంశాలను జియో ట్యాగ్ చేసి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దాదాపు జిల్లాలోని 1075 చెరువులుండగా 107వి పూర్తి చేసి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో మిగిలిన వాటి తుది సర్వే కూడా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.



ఎల్బీనగర్‌లోని పత్రిక ఫొటోగ్రాఫర్ ప్రవీణ్ వివాహ విందుకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మహేందర్ యాదవ్, గురుమూర్తి, పరమేష్, వీరు.

- విశ్వంభర, హైదరాబాద్

## ప్రాణం పోయే వరకు దళితబిడ్డల కోసం పోరాడుతూనే ఉంటా

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**విశ్వంభర, హుజురాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గంలోని నా దళితబిడ్డలకు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేసే వరకు పోరాడుతూనే ఉంటాను అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. హుజురాబాద్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బంధు రెండో విడుత నిధుల కోసం దళితులతో కలిసి పాడి కౌశిక్ రెడ్డి నిరసనకు దిగారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి దాడికి పాల్పడ్డారు. దీంతో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చేరిన కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇవాళ నా చేయి విరగ్గొట్టినా పర్వా లేదు.. నన్ను చంపినా పర్వాలేదు.. కానీ నా దళిత బిడ్డలకు మాత్రం దళితబంధు ఇవ్వకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణలోని దళిత బిడ్డలకు కేసీఆర్ దళిత బంధు ఇస్తే.. ఈ రేవంత్ రెడ్డి రూ. 12 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేశాడు. నీవు ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగితే ఈ విధంగా దాడులు చేయిస్తావా..? లాఠీఛార్జ్ చేయిస్తావా..? అని రేవంత్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. నన్ను హత్య చేసేందుకు కుట్ర చేశారు. పోలీసుల కుట్రలను నా దళిత సోదరులు అడ్డుకున్నారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని దళిత సోదరులు పోలీసులతో కొట్లాడిన తర్వాత నన్ను తీసుకొచ్చారు. దళిత సోదరులే ఇవాళ నా ప్రాణాలను కాపాడారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

## పెండింగ్ బిల్లులను చెల్లించండి

**మంత్రి పొన్నంకు సర్పంచుల సంఘం జేఏసీ వినతి**

**విశ్వంభర, హైదరాబాద్:** పెండింగ్ బిల్లులను డిసెంబర్ 31లోగా ఇప్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. మినిస్టర్ క్యాంప్ ఆఫీసులో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ నేతలు శనివారం కలిశారు. తమ సమస్యలపై సీఎం స్పందించి, తమను చర్చలకు పిలవాలని కోరారు. డిసెంబర్ 31వ తేదీలోపు బిల్లులను క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామాల సర్పంచ్‌లు మొత్తం కుటుంబాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు.

## రైతులు అధైర్యపడొద్దు

*** పంటలకు మద్దతు ధర ఇస్తాం**

*** మంత్రి పొంగులేటి**

**విశ్వంభర, హైదరాబాద్:** రైతులు అధైర్యపడొద్దని, పంటలకు మద్దతు ధర ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ ఆఖరిలోపు పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. డిసెంబర్‌లో గ్రూప్ 1 అభ్యర్థులకు నియామకపత్రాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## బీజేపీ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేక పార్టీ

*** కులగణనపై ఆ పార్టీ వైఖరి ఏంటి?**

*** బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**విశ్వంభర, హైదరాబాద్:** కులగణనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చేసిన ఆరోపణలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. భాజపా కులగణనకు అనుకూలమా? వ్యతిరేకమా..? అనేది లక్ష్మణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సామాజిక మార్పు తీసుకురావడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం సేకరిస్తున్న సమాచారం గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన మాటలను ఒక్కరోజైనా బీజేపీ రాష్ట్ర నేతలు ఖండించారా? అని నిలదీశారు. భాజపా.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేక పార్టీ అన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్యల పట్ల బలహీన వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

"ఐఐటీ, ఐఐఎం లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ కాదా? కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర బీజేపీ నాయకులు ఒత్తిడి తెచ్చేది ఉందా.. లేదా? ఎన్నికల కోసం కులగణన చేస్తున్నట్లు బీజేపీ నేత లక్ష్మణ్ ఆరోపణలు చేయడంలో అర్థం లేదు. ఇప్పుడు ఏ ఎన్నికలు ఉన్నాయో లక్ష్మణ్ చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ రిజర్వేషన్లు పెట్టాలా.. వద్దా.. బీజేపీ నేతలు స్పష్టం చేయాలి" అని డిమాండ్ చేశారు.

## ఏపీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 174మంది ఎంపిక

**రేపు జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా పురస్కారాల ప్రదానం**

**విశ్వంభర, అమరావతి**: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 174 మందిని విద్యాశాఖ ఎంపిక చేసింది. మంగళగిరిలో నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో వారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 77 మందికి, ఇంటర్మీడియట్ విద్యా శాఖలో (26), పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లు (16), డిగ్రీ లెక్చరర్లు (19), ఇంజినీరింగ్, ఫార్మసీ లెక్చరర్లు (4), విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు 32 మందికి అవార్డులు ఇవ్వనున్నారు. తాజాగా ఈ జాబితాను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది.

## అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి

*** హామీల అమలుపై తెలంగాణలో పాదయాత్ర చేసే దమ్ముందా?**

*** మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్**

**విశ్వంభర, కరీంనగర్:** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీల అమలు, రుణమాఫీ, ఆరు గ్యారంటీలపై తెలంగాణలో ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు.

కరీంనగర్‌లోని మమతా థియేటర్‌లో బీజేపీ కార్యకర్తలు, ఏబీవీపీ నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ 'జితేందర్ రెడ్డి' సినిమాను వీక్షించారు. అనంతరం వారితో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్‌లో చోటు కల్పించి సభ్య సమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నారని నిలదీశారు.

అబద్ధాలు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని బండి సంజయ్ అన్నారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి అని విమర్శించారు. మహారాష్ట్రకు పోయి అబద్ధాలు చెప్పడం కాదు.. తెలంగాణలో తిరిగి ఆ విషయాలు చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిజంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి ఉంటే.. కోట్లు ఖర్చు పెట్టి మహారాష్ట్రలో ఇచ్చిన ప్రకటనల్లో ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు చేశామని చెప్పిన రేవంత్ రెడ్డి... ఇంకా 20 లక్షల మంది రైతులకు నయాపైసా రుణమాఫీ కాలేదని చెప్పే దమ్ముందా? అని ప్రశ్నించారు. మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ. 2500లు, నిరుద్యోగులకు రూ.2 లక్షల మాఫీ, విద్యార్థులకు రూ 5 లక్షల భరోసా కార్డు, వృద్ధులకు నెలనెలా రూ.4 వేల ఫించన్, పేదలందరికీ ఇండ్లు ఇచ్చారా? ఇవేమీ అమలు చేయకుండా మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. మహారాష్ట్రలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ బండారాన్ని బయటపెడతామని స్పష్టం చేశారు.

ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీకి హర్యానాలో కర్రు కాల్చి వాతపెట్టారని బండి సంజయ్ అన్నారు. ఈసారి మహారాష్ట్రలో కూడా అదే జరగబోతోందని అన్నారు. బీజేపీపై యుద్ధం చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటు అని అన్నారు. దేనికోసం యుద్ధం చేస్తారని ప్రశ్నించారు.

## పర్యవేక్షణ అధికారుల నియామకం

**ఇంటింటి సర్వే కోసం ప్రభుత్వం చర్యలు**

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో కచ్చితత్వంతోపాటు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీహెచ్ఎంసీతో పాటు జోనల్ స్థాయిలోనూ ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో సమన్వయం కోసం పర్యవేక్షణ అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జీహెచ్ఎంసీ పరిధిలో పర్యవేక్షణ అధికారిగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లకు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్సను నియమించారు. ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లకు పురపాలక శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి జోన్లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యవేక్షించనున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఝార్ఖండ్ ఎన్నికల అధికారిగా వెళ్లారు. అక్కడి నుంచే సర్వే తీరును ఆయన పరిశీలిస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వే పర్యవేక్షణ బాధ్యతలను సర్ఫరాజ్‌కు అప్పగించారు. జోనల్ కమిషనర్లు, పర్యవేక్షణ అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రేటర్‌లో నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేయాలని, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సర్ఫరాజ్ సహకారం అందించాలని ప్రభుత్వం సూచించింది.

## ఎక్కడుంటే అక్కడే వివరాలు చెప్పొచ్చు

* స్వగ్రామానికి, సొంతింటికి వెళ్లాల్సిన అవసరం లేదు

* నేటి నుంచి కుటుంబ వ్యక్తిగత వివరాల సర్వే ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రెండోదశ సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభం కానుంది. కుటుంబ వ్యక్తిగత వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాల కోసం స్వగ్రామంలోని ఇల్లు వదిలి... దూరప్రాంతాల్లోని పట్టణాలు, నగరాల్లో నివసించే వారికి రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఒక కుటుంబం ప్రస్తుతం ఎక్కడ నివసిస్తుంటే అక్కడే గణకుల వద్ద తమ వివరాలను నమోదు చేయించుకునే అవకాశమిచ్చింది. ఆధార్ కార్డులో చిరునామా ఉన్న చోటికి, సొంతింటికి, స్వగ్రామానికి వెళితేనే కుటుంబ వివరాలు నమోదు చేస్తారనే అపోహ వద్దని రాష్ట్ర ప్రణాళికశాఖ సూచించింది. కుటుంబ సభ్యుల వ్యక్తిగత ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు, ప్రశ్నపత్రంలో అడిగిన వివరాలన్నీ తెలపాలి. ఆధార్, రేషన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం వంటివి అందుబాటులో ఉంచుకుంటే సర్వే కోసం వచ్చిన గణకులకు త్వరగా సమాచారం ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు.

### ఇంటి నంబరు, యజమాని పేర్ల నమోదు పూర్తి

ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు సర్వే ఈనెల 6 నుంచి 8 వరకు పూర్తిచేశారు. ఒక్కో గణకుడికి 150 నుంచి 175 ఇళ్ల దాకా కేటాయించడంతో వీటి నంబర్ల నమోదుకు బుధ, గురు, శుక్రవారాల వరకు ప్రభుత్వం సమయం ఇచ్చింది. ఇంకా పట్టణాలు, నగరాల్లో అక్కడక్కడా కొన్ని ఇళ్లు మిగిలాయి. వాటి వివరాల నమోదు శనివారం పూర్తిచేస్తారు. వీటి ఆధారంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి కుటుంబంలోని సభ్యులందరి సమగ్ర వివరాల నమోదును ఈనెల 9 (శనివారం) నుంచి నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలు ఉన్నాయని, అన్ని ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించినట్లు ప్రణాళికశాఖ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 28,32,490 కుటుంబాలు ఉండటంతో 19,328 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు. సర్వే పూర్తి చేయడానికి 94,750 మంది గణకులను, వారిపై 9,478 మంది సూపర్‌వైజర్లను, ప్రభుత్వం నియమించింది.

### ఏ కులమూ లేదంటే 999 కోడ్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో కుటుంబాల వివరాల నమోదు కోసం ఇదివరకు ఖరారు చేసిన ఫాంలో కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. 'కులం వివరాలు చెప్పకుంటే'... 999, 'ఏ సామాజికవర్గం లేదు' అంటే... 01 కోడ్‌లతో నమోదు చేసేలా మార్చారు. ధరణిలోని భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కొన్ని వరుసలను అదనంగా చేర్చారు. 'దేవాలయాలు, మసీదులు, చర్చిలకు ఎలాంటి వివక్ష, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛగా వెళుతున్నారా?... లేదా' అనే అంశాన్ని సైతం కొత్తగా జోడించారు.

### రాజ్‌భవన్ వద్ద సర్వే స్టిక్కర్

సమగ్ర సర్వేలో భాగంగా రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్ కుటుంబ వివరాల నమోదు కోసం రాజ్‌భవన్ గేటు వద్ద ఎన్యూమరేటర్లు శుక్రవారం స్టిక్కర్ అతికించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేరుతో స్టిక్కర్ అతికించినట్లు అధికారులు తెలిపారు.







# 'తెలుగు'కు వెలుగులనిచ్చిన సూరీడు

# ఛార్లెస్ ఫిలిప్స్ బ్రౌను

○ నేడు ఛార్లెస్ ఫిలిప్స్ బ్రౌను జయంతి సందర్భంగా



**ఆహారానికి కాటన్, వ్యవహారానికి బ్రౌన్ అని నానుడి. అంటే కాటన్ దొర గోదావరి నదికి ఆనకట్ట కట్టి పుష్కలంగా పంటలు పండటానికి జీవితాంతం కృషి చేశాడు. అదే విధంగా చెద పురుగులకు ఆహారం కానున్న ఎన్నో తాళపత్ర గ్రంథాలను సేకరించి, పరిశీలన చేసి, అచ్చు వే యించి తెలుగు భాషా వికాసానికి యావజ్జీ వితాన్ని అర్పించిన ఘనుడు బ్రౌన్. అటు వంటి బ్రౌన్ జన్మించిన రోజు నవంబరు 10 సందర్భంగా బ్రౌన్ చేసిన భాషా సేవ గురించి కొంత తెలుసుకుందాం.**

బ్రౌన్ పూర్తి పేరు ఛార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్. సింపుల్ గా 'సి.పి. బ్రౌన్' అని 'బ్రౌన్' అని పిలుస్తారు. 1798 సంవత్సరం నవంబరు 10 వ తేదీన కలకత్తాలోని డేవిడ్, కేతి అనే దంపతులకు జన్మించారు. తండ్రి డేవిడ్ కలకత్తాలో మత ప్రచారకుడిగా ఉండేవారు. 1812 లో డేవిడ్ మరణించగా బ్రౌన్ తల్లి, సోదరిలతో కలసి ఇంగ్లాండ్ వెళ్ళిపోయారు. తర్వాత బ్రౌన్ తన 19వ ఏట 1817లో తూర్పు ఇండియా కంపెనీ ఉద్యోగిగా వచ్చి ఇండియా మద్రాస్ లో ఉద్యోగంలో చేరారు. బ్రౌను ఉద్యోగం లో చేరేనాటికి తెలుగు రాదు. ఉద్యోగ విధులు సక్రమంగా నిర్వర్తించేటందుకు గాను తెలుగు భాష నేర్చుకోవాలనే పట్టుదలతో వెలగపూడి కోదండ రామపంతులు గారి వద్ద శిష్యరికం చేసి తెలుగు భాషను నేర్చుకోవటమే కాకుండా కేవలం మూడేళ్ళలో తెలుగులో అద్భుత ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా మద్రాసు నుంచి కడప, మచిలీపట్నం, రాజమండ్రి మొదలైన ప్రాంతాలు తిరిగారు. తెలుగు భాషపై అభిమానం, మమకారం పెంచుకుని తన జీతం డబ్బులు మొత్తంను తెలుగు భాషా వ్యాప్తికే ఖర్చు పెట్ట సాగారు. కేవలం భాష నేర్చుకుంటే సరిపోదు. భాషలో మెళకువలు తెలుసుకోవాలంటే వ్యాకరణం, ఛందస్సు నేర్చుకోవాలనే ఆలోచనతో పత్యం అద్వైత బ్రహ్మయ్యశాస్త్రి, తిప్పాభట్ల వెంకటశాస్త్రీల వద్ద ఛందస్సు, వ్యాకరణం నేర్చుకున్నారు. మెళకువలు తెలుసుకున్నారు. బ్రౌన్ తెలుగు భాషా పరిశోధన భాషా సేవలకు

కార్య క్షేత్రంగా కడపను ఎంచుకుని తన సొంత డబ్బుతో పెద్ద భవనం కొని దానికి కావ్యోద్ధరణ భవనంగా పేరిడి పలుచోట్ల నుంచి ఎందరో భాషా పండితులను రప్పించి రాష్ట్రం నలుమూలలా సేకరించిన తాళపత్ర గ్రంథాలకు వ్యాఖ్యానాలు, ప్రతిపదార్థ తాత్పర్యాలు రాయించి వాటిని ప్రచురింప చేసే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించే వాడు. ఆనాటి ప్రజలు ఆ భవనాన్ని గౌరవంగా 'బ్రౌన్ కాలేజీ'గా వ్యవహరించే వారు. ఆ కావ్యోద్ధరణ బంగళాలో బ్రౌన్ చేసిన అనితర సాధ్యమైన కృషి వల్ల పునరుజ్జీవనం చెంది శాశ్వత ముద్ర పొంది తెలుగు వారికి అందిన వాటిలో ప్రబంధాలు, పురాణాలు, కథలు, వ్యాసాలు, నిఘంటువులు ఒకటేమిటి ఎన్నో అక్కడ కొత్త రూపును సంతరించుకున్నాయి. కొన్ని ఆవిర్భవించాయి. వాటిలో వసు చరిత్రము, మను చరిత్రములు జూలూరి అప్పయ్య పంతులుచేత పరిష్కరింపబడి వెలుగు చూసిన వాటిలో ప్రసిద్ధ ప్రబంధాలు కాగా పోతన భాగవతం, పంచ తంత్రం, విజయ విలాసం, కళాపూర్ణోదయం, తారాశశాంక విజయం వంటి ప్రబంధాలు, భట్టి విక్రమార్క కథలు, అనంతపురం చరిత్ర,

తాతాచారి కథలు, 'వార్ అండ్ రాజాస్' మొదలైన వాటిని పది విభాగాలతో కల తెలుగు వ్యాకరణంను స్వయంగా రాసి ప్రచురించటం, ఆంధ్ర సంస్కృత చంధోలంకార గ్రంథం, మిశ్ర భాషా నిఘంటువు, కర్ణాటిక్ క్రోనాలజీ మొదలైన పరిశీలన పరిశోధనా గ్రంథాలు, కవిశకం, వీరశైవుల మతాచారాలు, శిల్ప, జ్యోతిష్క, ఖగోళశాస్త్రాలకు సంబంధించిన వ్యాసాలు తెలుగులోనికి రాయటం జరిగింది. బ్రౌన్ చేసిన సాహితీ సేవ, పురాణాలు, ప్రబంధాలకు ఆయన ఇచ్చిన పునరుజ్జీవనం. ఇదంతా అనన్య సామాన్య కృషి ఐతే బ్రౌన్ ను తెలుగు బాష ఉన్నంతవరకూ చిరస్థాయిగా నిలబెట్టగలిగేది ఆయన స్వయంగా రూపొందించిన 'తెలుగుఇంగ్లీషు', 'ఇంగ్లీషుతెలుగు' నిఘంటువులు. వీటినే బ్రౌణ్య నిఘంటువు అంటారు. ఆ నిఘంటువులు ఇప్పటికీ చాలా వాటికి ప్రామాణిక గ్రంథాలుగా ఉపయోగపడటం ఆయన చేసిన కృషి ఆ చంద్రతారార్కం నిలిచిపోతుందనటానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

బ్రౌన్ చేసిన సాహితీ సేవ ఇంతవరకూ ఒక ఎత్తయితే ఆయన స్వయంగా పరిశోధించి పలు ప్రామాణిక ప్రతులను సేకరించి, వేమన పద్యాలను ప్రచురించటం, వాటిని 'ది వర్సెస్ ఆఫ్ వేమన' అనే పేర ఆంగ్లంలో ప్రచురించటం బ్రౌన్ కు ఎనలేని ఖ్యాతినార్జించి పెట్టింది..

'తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా? గిట్టదా?
విశ్వదాభిరామ వినురవేమ'

లాంటి కొన్ని వందల పద్యాలు, ఆణిముత్యాల్లాంటి సామెతలు ఎన్నో మనకు వేమన అందించినా అవి మనకు పూర్తిగా అందలేదు. వాటిలో అందిన వాటిని బ్రౌన్ అచ్చు వేయించి మనకు అందించారు. 'వేమన పద్యాలు వేదాలతో సమానం' అనే నానుడిని బ్రౌన్ తన కృషి ద్వారా నిజం చేశారు. బ్రౌన్ లేనట్లయితే వేమన, వేమన పద్యాలు ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయుండేవి.

ఉద్యోగరీత్యా కడప జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా, ఆ తర్వాత పోస్టుమాస్టర్ జనరల్ గా, మద్రాస్ ప్రభుత్వానికి తెలుగు అనువాదకుడిగా, కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యునిగా, మద్రాస్ బ్యాంకులో ప్రభుత్వ డైరెక్టరుగా, కాలేజీలో లిఖిత భాండాగారం క్యూరేటర్ గా ఎన్నో రకాలైన పదవుల్లో తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే తెలుగు భాషకు సేవ చెయ్యటం బ్రౌన్ కే దక్కింది.

బాల్య వివాహాల పేరిట మగ్గిపోతున్న స్త్రీలకు వితంతు పునర్వివాహాలంటూ నూతన జీవితాలను ప్రసాదించిన కందుకూరి వీరేశలింగం పంతులు యుగ ప్రవక్త ఐతే అటకలపై నాశనమైపోతున్న ఎన్నో తాళపత్ర గ్రంథాలను సేకరించి వాటికి ముద్రణా భాగ్యం కలిగించి తెలుగు సమాజాన్ని కేరాఫ్ చిరునామాగా మలచి శాశ్వత గుర్తిం పు కల్పించిన బ్రౌన్ 'భాషా ప్రవక్త అయినారు.

బ్రౌన్ కేవలం ఉద్యోగం చేస్తూ భాషా సేవ మాత్రమే కాకుండా సామాజిక సేవ కూడా చేసిన దాఖలాలున్నాయి. బ్రౌన్ కడపలో ఉన్న రోజుల్లో ఒకచోట సతీ సహగమనం జరగబోతోంది అన్న విషయం తెలుసుకుని తన సిబ్బందితో అక్కడకు వెళ్ళి ఆ కార్యక్రమాన్ని ఆపు చేయించి ఆ మహిళను కాపాడినాడు. చదువు పట్ల ఎంతో అభిరుచి కలిగిన బ్రౌన్ కడపలో రెండు ఉచిత పాఠశాలలను, మద్రాసు, మచిలీపట్నంలలో ఒక్కో పాఠశాలను ఏర్పాటు చేసి వాటికయ్యే ఖర్చులు తానే భరించాడు. తనకున్న ఆస్తిని, తన జీతాన్ని కూడా భాషా సేవకు ఉపయోగించటమే కాకుండా లక్ష రూపాయలు అప్పు చేసి కావ్యోద్ధరణకు ఖర్చు చేసిన ఘనత బ్రౌన్ కే దక్కుతుంది. తను ఎంతో కష్టపడి తయారుచేసిన నిఘంటువులు ఒకసారి కొవ్వొత్తి పడి కాలిపోతే ఎంతో ఓపిగ్గా తిరిగి వాటిని మొత్తం రాశారు అని చెప్పుకుంటుంటారు. బ్రౌన్ గురించి తెలిసినవారందరూ. అదీ బ్రౌన్ కున్న పట్టుదల. పాశ్చాత్యుడై ఉండి కూడా తనది కాని పరభాష అయిన తెలుగు పై భాషా వ్యామోహం పెంచుకుని తన యావజ్జీవితాన్ని వినియోగించిన గొప్పవాడు బ్రౌన్.

'తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
యెల్ల నృపులు గొల్వనెఱుగవే బాసాడి
దేశ బాషలందు తెలుగులెస్స'

అంటూ తెలుగు భాషను పెంచి పోషించి, ఎన్నో కావ్య ప్రబంధాలను, కవితా కుసుమాలను పూయించి, నూతన కాంతులతో వికసింపచేసి తెలుగుభాషకు ఎంతో సేవ చేసిన కన్నడ చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు వలె బ్రౌన్ చేసిన తెలుగు భాషా సేవను పరిశీలిస్తే 'బ్రౌన్'ను శ్రీకృష్ణ దేవరాయలు తో పోల్చవచ్చు. బ్రౌన్ వ్యక్తిగత జీవి తం పరిశీలిస్తే చాలా ఆడంబర జీవితాన్ని గడిపాడని చెప్పటానికి దాఖలాలున్నాయి. ఖరీదైన ఫర్నీచర్, ఖరీదైన తెల్లవర్ణ చిత్రాలతో బ్రౌన్ నివాస భవనం రాజ మందిరంలా ప్రకాశించేదని చరిత్రకారులు చెబుతుంటారు.

బ్రౌన్ బతికిన 86 సంవత్సరాల్లో అధిక భాగం అంటే 67 సంవతసరాలు తెలుగు భాషా సేవలోనే గడిపి తన 86 వ ఏట 1884 డిసెంబర్ 12న ఇంగ్లండ్ లో మరణించాడు. బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవ అనన్య సామాన్యం, అనితర సాధ్యం. అందుకే ఆయనకు స్మృత్యంజలి ఘటించే లాగున కడపలో ఆయన చేసిన సాహితీ యజ్ఞ భవనాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయంగా మార్చి ఎన్నో సారస్వత కార్యక్రమాలు, భాషా సమ్మేళనాలు నిర్వహిస్తుండటం ఆ మహనీయునికి అర్పిస్తున్న నివాళి అని చెప్పొచ్చు. ప్రపంచంలో తెలుగు మాట్లాడేవాడు ఎక్కడ ఉన్నా సరే నవంబర్ 10వ తేదీనాడు బ్రౌన్ ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనన్య సామాన్య కృషితో తెలుగు భాషకు వెలుగులనందించిన బ్రౌన్ సదా స్మరణీయుడు. ఆయన బాటలో తెలుగు వారందరూ పయనించటం, తెలుగే మాట్లాడటం, తెలుగు అభివృద్ధికి కృషి చెయ్యటం, ప్రభుత్వాలు స్వచ్ఛంధ సంస్థల, సాహితీ సంస్థల తో కలిసి తెలుగు భాష పరివ్యాప్తి కోసం కృషి చేయాలి. మన అమ్మ భాషను మనమే కాపాడుకోవటం అనేవి మన అందరి ముందూ ఉన్న కర్తవ్యం. వాటిని నెరవేర్చే దిశగా పయనించాలని బ్రౌన్ సంకల్పం అందరికీ ఆశయం కావాలని ఆకాంక్షిద్దాం..



- తెన్నేటి మాస్టారు
పశ్చిమగోదావరి జిల్లా..
సెల్ : 8247433432

# భారత ఎన్నికల సంస్కర్త టి.ఎన్.శేషన్

**నేడు ఆయన వర్ధంతి**



భారత దేశ ఎన్నికల వ్యవస్థనే సమూలంగా ప్రక్షాళన చేసి, రాజకీయ నాయకులకు, స్వార్థ అధికారులకు సింహ స్వప్నంగా నిలిచారు మాజీ ఎన్నికల కమిషనర్ క్రీ.శే.టీఎన్ శేషన్.

భారత ఎన్నికల వ్యవస్థలో భారీ సంస్కరణలు తీసుకొచ్చిన కొన్ని అసాధారణ నిర్ణయాలు భారత ఎన్నికల వ్యవస్థనే మార్చేసి ఎన్నికల కమిషన్ కు ఉన్న అధికారాలు ఏమిటో సామాన్య ప్రజలకు సైతం కనువిప్పు కలిగించిన సంస్కర్త ఆయన.

ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో ఎన్నికలకు క్రమం, న్యాయం, సమగ్రతను తీసుకు రావడానికి ఆయన చేసిన కఠిన చర్యలకు గుర్తింపుగా 1996 లో ప్రతిష్ఠాత్మక రామోన్ మాగ్సేసే అవార్డు పొందారాయన. భారత దేశ ఎన్నికలలో బూత్ , ప్రభుత్వ యంత్రాల దుర్వినియోగానికి రిగ్గింగ్ పర్యాయ పదంగా ఉన్న సమయంలో టిఎన్ శేషన్ భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించారు. 1990 నుండి 1996 వరకు దేశంలోని 10 వ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్న కాలంలో దేశ ఎన్నికల వ్యవస్థపై తన అధికారాన్ని ముద్రించ గలిగారు.

తిరునెల్లాయ్ నారాయణ అయ్యర్ శేషన్ కేరళలోని పాలక్కాడ్ జిల్లా తిరునెల్లైలో డిసెంబర్ 15, 1932 న జన్మించాడు.ఆయన పాఠశాల విద్యను బాసెల్ ఎవాంజెలికల్ మిషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ నుండి, పాలక్కాడ్ లోని ప్రభుత్వ విక్టోరియా కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు.


అతను మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుండి భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ సాధించాడు. ఐఎఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పుడు మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో 3 సంవత్సరాలు ప్రదర్శన కారుడిగా పని చేశాడు. శేషన్ మొట్టమొదటి పోస్టింగ్ తమిళనాడు లోని మదురై జిల్లాలోని దిండిగల్ లో సబ్ కలెక్టర్ గా. ఈ ప్రారంభ పోస్ట్ లోనే, రాజకీయ నాయకుడి జోక్యం ఉన్నప్పటికీ చట్టాన్ని అమలు చేయడం ద్వారా శేషన్ మొదట తన ధృఢ సంకల్ప పాత్రను చూపించాడు. 1958 లో, శేషన్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్‌గా, గ్రామీణాభివృద్ధి సచివాలయంలో డిప్యూటీ సెక్రటరీగా మద్రాస్‌కు తరలించబడి, 4 సంవత్సరాలు పదవి నిర్వహించాడు. తరువాత, శేషన్ డిసెంబర్ 1964 లో తమిళనాడు లోని మదురై జిల్లా కలెక్టర్‌గా చేరాడు. తర్వాత కాలక్రమంలో ప్రధాన మంత్రి కార్యాలయంలో అటామిక్ ఎనర్జీ విభాగంలో 1969 లో భారత ప్రభుత్వ సీనియర్ పదవులలో మొదటి స్థానానికి శేషన్ నియమితుడయ్యారు.

అక్కడ అటామిక్ ఎనర్జీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. 1972 1976 మధ్య పనిచేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని అంతరిక్ష విభాగంలో జాయింట్ సెక్రటరీ పదవికి 1976 లో బదిలీ అయినప్పుడు ప్రజలను, డబ్బును, వనరులను నిర్వహించడంలో తనదైన శైలి ప్రదర్శించాడు. తర్వాత శేషన్ తమిళనాడుకు తిరిగి వచ్చి, రాష్ట్ర పరిశ్రమల మరియు వ్యవసాయ కార్యదర్శిగా పనిచేశాడు. తమిళనాడు ముఖ్యమంత్రితో "గొడవ" తరువాత (శేషన్ స్వయంగా గుర్తుచేసుకున్నట్లు), రాజీనామా చేసి, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ సభ్యునిగా ఢిల్లీకి తిరిగి నియమించ బడ్డారు,

ప్రధాని రాజీవ్ గాంధీ ఆహ్వానం మేరకు, అతను 1985 నుండి 1988 వరకు పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అయ్యాడు. అలా కొనసాగడంతో పాటు, 1988 తరువాత రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా 1989 వరకు తాను నిర్వహించిన అంతర్గత భద్రతా కార్యదర్శిగా శేషన్‌ను రాజీవ్ నియమించు కున్నారు. పది నెలల తరువాత, ప్రధాని గాంధీ తనపై ఉంచిన నమ్మకానికి రుజువుగా శేషన్ కేబినెట్ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. కొద్దికాలానికే, అప్పటి ప్రధాని చంద్ర శేఖర్‌కు న్యాయ మంత్రిగా ఉన్న మిత్రుడు సుబ్రమణ్యం స్వామి చొరవతో, శేషన్‌కు ముఖ్య ఎన్నికల కమిషనర్ పదవిని ఇచ్చారు. శేషన్ మొదట ఈ ప్రతిపాదనను తిరస్కరించి, రాజీవ్ గాంధీని సంప్రదించి, అంగీకరించాలని నిర్ణయించుకుని, 1990 డిసెంబరులో పదవిని చేపట్టారు. శేషన్ ఎన్నో ఎన్నికల దుర్వినియోగాలను గుర్తించాడు. సరికాని ఎన్నికల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో తప్పిదాలు, బలవంతపు ఎన్నికలు, ప్రచారం చేయడానికి చట్టపరమైన పరిమితి కంటే ఎక్కువ ఖర్చు చేయడం, పోలింగ్ బూత్‌లను లాక్కోవడానికి గూండాలను ఉపయోగించడం, అధికారాన్ని సాధారణంగా దుర్వినియోగం చేయడం వంటివి ఉన్నట్లు కనుగొన్నారు. వెంటనేరాజకీయ ఒత్తిళ్లను ధిక్కరించి ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టారు. తన రాజ్యాంగ అధికారాన్ని ప్రశ్నించమని ప్రభుత్వాన్ని సవాలు చేసే స్థాయికి కూడా వెళ్ళాడు. శేషన్ సంస్కరణలు ముఖంగా... ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి, సమగ్రతను కల్పించడం, ఓటర్లకు స్వేచ్ఛ అధికారం ఇవ్వడం, ఎన్నికల విధానాలను సంస్కరించడం, ఎన్నికల చట్టాలను మార్చడం. దేశంలో జాతీయ ఎన్నికలను అమలు చేసే అద్భుతమైన పనిలో, సిబ్బంది, ఉద్యోగులలో అధిక సంఖ్యాకులు విధులను తేలికగా తీసుకున్నారని శేషన్ గమనించాడు. 1992 లో కఠిన నిర్ణయాలు ప్రారంభించారు.

1993 లో తమిళనాడులో జరిగిన ఎన్నికలపై బ్యూరోక్రసీతో శేషన్ కు గొడవలు తలెత్తాయి. తమిళనాడులో భద్రతా దళాలను మోహరించాలని శేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాడు. వాటిని పూర్తిగా ఉపయోగించు కోవాలని రాష్ట్రాన్ని ఆదేశించాడు. ఈ ఉత్తర్వు ద్వారా శేషన్ దేశ హోంమంత్రితో విభేదించాడు. శేషన్ ఆదేశాన్ని అమలు చేయడానికి నిరాకరించి నప్పుడు, ఎన్నికల కమిషన్ అధికారాన్ని ప్రభుత్వం గుర్తించే వరకు దేశంలో ఎన్నికలు జరగవని శేషన్ నిర్ణయించారు. మళ్ళీ, ఈ సమస్యను సుప్రీం కోర్టుకు పంపారు. తన అభిప్రాయాన్ని చెప్పిన తరువాత, ఈ వ్యూహాత్మక ఉపసంహరణ అతనికి ఓటర్ల దృష్టిలో ఘనతను సంపాదించింది. శేషన్ అధికారాలను తగ్గించడానికి, అక్టోబర్ 1993 లో, పార్లమెంట్ రాజ్యాంగాన్ని సవరించింది. ముఖ్య ఎన్నికల కమిషనర్‌తో అధికారాన్ని పంచుకోవడానికి ఇద్దరు అదనపు కమిషనర్లను చేర్చింది. ఎంఎస్ గిల్ మరియు జివిసి క్రిష్ణ మూర్తి, ఇద్దరూ ఘనులే. సుప్రీంకోర్టులో కొత్త నియామకాలను సవాలు చేస్తూ శేషన్ తిరిగి పోరాడాడు. ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ పనులపై చీఫ్ కమిషనర్‌కు పూర్తి నియంత్రణ ఇస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఓటర్ల హక్కుల గురించి ప్రజలలో అవగాహన కల్పించడంలో శేషన్ సఫలమైనాడు. చట్టబద్ధమైన ఓటర్లందరికీ ఫోటో ఐడెంటిఫికేషన్ కార్డులను జారీ చేయాలని 1992 లో శేషన్ ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. ఈ చర్య అనవసరమని, ఖరీదైనదని రాజకీయ నాయకులు తీవ్రంగా నిరసించారు. ప్రభుత్వం చర్యల కోసం 18 నెలలు వేచి ఉన్న తరువాత, ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోతే, జనవరి 1, 1995 తరువాత ఎన్నికలు జరగవని శేషన్ ప్రకటించారు. శేషన్ పట్టుబట్టడంతో, ప్రభుత్వం ఐడీ కార్డులు ఇవ్వడం ప్రారంభించింది.


ఎన్నికల ప్రక్రియలో చట్టం అమలులో కఠినమైన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేశారు. అర్హత కలిగిన ఓటర్లందరికీ ఓటరు ఐడీల జారీ, ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుపై పరిమితి, ప్రగతిశీల, స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్... ఎన్నికలను నిర్వహించే రాష్ట్రాలు కాకుండా ఇతర రాష్ట్రాల నుండి ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల అధికారులను వినియోగించారు. ఓటర్లకు లంచం ఇవ్వడం లేదా బెదిరించడం, ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ, ప్రచారం కోసం అధికారిక యంత్రాల ఉపయోగం, ఓటర్ల కుల లేదా మత భావాలకు విజ్ఞప్తి, ప్రార్థనా స్థలాలను ప్రచారానికి ఉపయోగించడం, ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు, అధిక వాల్యూమ్ స్పీకర్లు ఉపయోగించడం, తదితరాలను నియంత్రించే కఠిన చర్యలు గైకొన్నారు. 1997 లో భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసి కేఆర్ నారాయణన్ చేతిలో ఓడిపోయాడు. 10 నవంబర్ 2019న (వయసు 86) చెన్నైలో మరణించారు.



- రామకిష్టయ్య
సంగనభట్ల
9440595494

# నోస్టాల్జియా కథలు

నేడు నెల్లూరు టౌన్ హాల్‌లో విజయ మహల్ సెంటర్ కథల సంపుటి ఆవిష్కరణ సందర్భంగా..




వినసొంపైన నెల్లూరు మాండలికంలో ఎనభయవ దశకపు బాల్యాన్ని రికార్డు చేసిన కథలు విజయ మహల్ సెంటర్. రోహిణి వంజారి రచించిన ఈ కథల నిండా బాల్య స్మృతులు, మానవీయ బంధాలు పరుచుకొని ఉన్నాయి.

'వొజ్రం ఇలువ' పరీక్ష ఫీజు కట్టమని తండ్రి ఇచ్చిన పావలా పోగొట్టుకున్న పసిపాప అమాయకత్వం, ఆ పావలా కోసం మురికి కాలువలో చేతులు పెట్టి వెతికి తెచ్చిన తండ్రి బీదరికం పాఠకులను ఆలోచింపచేస్తుంది. తప్పిపోయిన పిల్లవాడు తల్లి దరికి చేరిన ఉదంతం సునీల్ ఏమయ్యాడో కథలో కనిపిస్తుంది. మూగ వృద్ధురాలి మానవతా దృక్పథం ఈ కథలో ఆదర్శంగా నిలుస్తుంది. కథలో నెల్లూరు వీధుల్లో ఉండే సందడి, అనుబంధాలు కళ్ళముందు కనిపిస్తాయి.

సినిమా కథానాయకుల పట్ల ఆరాధనా భావం, కొత్త సినిమా చూడడానికి తల్లిదండ్రుల అనుమతి కోసం పిల్లల ఆరాటం, చిరంజీవిని పెళ్లాడుతా అనుకునే అమాయకపు బాల్యం 'చిరంజీవే నా మొగుడు' అనే కథలో కనిపిస్తాయి. ఈ కథలు చదువుతున్న పాఠకులకు తప్పకుండా తమ బాల్యం మదిలో మెదులుతుంది.

బడుగు జీవుల దుర్భర జీవితాలకు అక్షర రూపం ' కర్పూర దీపం ' మరుగుదొడ్లను శుభ్రం చేసే నరసమ్మ జీవిత గాథ ఇది. తాను బతికి ఉండగా తనతో సేవలు చేయించుకున్న వాళ్లే తనను ముట్టుకోవడానికి ఇష్టపడని సమాజం తాను నాలుగు రోజులు పలికి రాకపోయేసరికి ఇంటిని వెతుక్కుంటూ వెళ్తారు. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న నరసమ్మను చూసి ఆమె రుణం తీర్చుకోవడానికి కులం మతం పరువు అంతస్తు హోదాలను పక్కకు పెట్టి అందరూ ఆమెకు అంతిమయాత్ర నిర్వహిస్తారు. మానవత్వం ఇంకా బతికే ఉంది అనే ఆశాభావాన్ని కలిగించే కథ ఇది.

పిల్లల పట్ల పక్కింటి వాళ్ళు చూపే అనురాగం ఆప్యాయతలను తెలియజెప్పే కథ రెడ్డెమ్మ దేవత అయ్యింది. నూతన సంవత్సరం సందర్భంగా యాపిల్ పండు తినాలన్న కోరిక పేదరికం కారణంగా నెరవేరకపోవడం, అదే సందర్భంలో పక్కింటి రెడ్డమ్మ మూడు యాపిల్ కాయలు ఇవ్వడంతో ఆమె 12 ఏళ్ల బుజ్జమ్మకు దేవతలా కనిపించడం సహజమే. పిల్లల మనస్తత్వాన్ని, పిల్లల పట్ల పెద్దలు వ్యవహరించవలసిన రీతిని ఈ కథ తెలియజేస్తుంది.

ఆకలికి కులం లేదు అని తెలియజెప్పిన కథ లలితమ్మ హోటల్. మాస్టారు మోహన్రావు పిల్లలను టిఫిన్ తీసుకురావడానికి ఐదు రూపాయలు ఇచ్చి లలితమ్మ బ్రాహ్మణ హోటల్లో మాత్రమే తేవాలని పురమాయిస్తాడు. ఎంత వెతికినా హోటల్ కనిపించక మరొక కాపు వారి హోటల్లో టిఫిన్ తీసుకొని మధ్యాహ్న సమయానికి బడికి చేరుకుంటారు పిల్లలు. ఆకలి మంటతో ఉన్న మోహన్ రావు ఇది ఎక్కడ తెచ్చారు అని కూడా అడగకుండా ఆవురావుమని తినేస్తాడు. తర్వాత వాళ్లు లలితమ్మ బ్రాహ్మణ హోటల్లో తేలేదు అని కూడా ఆయనకు అర్థం అయినప్పటికీ మౌనంగా ఉంటాడు. దీన్నిబట్టి ఆకలి కులమెరుగదు అని అర్థమవుతున్నది.

ఈ కథల్లో నెల్లూరు సాంస్కృతిక జీవనం ఉన్నది. మూలాపేటలో జరిగే ఇరగాలమ్మ జాతర నెల్లూరు ప్రజల జీవితంతో ఎలా మమేకమైందో 'గంగరాయి సెట్టు కింద ఇరగాలమ్మో ' కథలో గమనించవచ్చు.

ఈ కథలో శాస్త్రీయ దృక్పథము కూడా కనిపిస్తుంది. అత్తింటి ఆరళ్ళను భరించలేని మస్తాను అనే యువతి ఇరగాలమ్మ పూనినట్టుగా పూనకంతో ఊగిపోతూ వేరు కాపురం పెట్టించడానికి అత్త రమణమ్మ ఆడబిడ్డ రంగిలను ఒప్పించే సంఘటన రచయిత్రి శాస్త్రీయ దృక్పథానికి నిదర్శనం. ఇట్లాగే శాస్త్రీయ స్పృహను కలిగించే మరో కథ 'తట్టుడీ మీకు తీయబడును '. క్రైస్తవం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. పాఠశాలలో బూట్ల మిస్సమ్మ దయ్యం తిరుగుతుందని, ఏసుప్రభును ప్రార్థిస్తే భయం పోగొడతాడని ఒక అపోహ ఒకటి ప్రచారంలో ఉండేది. సాయంత్రం వేళ ఎలిజిబెత్ టీచరు బూట్లు వేసుకుని చెక్క మెట్లు దిగుతుండగా వచ్చే శబ్దమే బూట్ల మిస్సమ్మ దయ్యమని కథ చివర్లో రచయిత్రి తేల్చి చెప్తుంది. మూఢనమ్మకాలను వదిలించాలనే స్పృహ ఈ కథలో అంతర్లీనంగా కనిపిస్తున్నది.

నెల్లూరు సంస్కృతిని చూపే మరొక కథ 'కుడుముల సామి'. వినాయకుడికి కుడుములు సమర్పించిన తర్వాతే వ్యవసాయ పనులు మొదలుపెట్టడం నెల్లూరు రైతుల ఆనవాయితీ. ఈ కథ ద్వారా వినాయకుడికి కుడుములు పోసే కార్యక్రమం సాక్షాత్కరింపజేసింది రచయిత్రి.

కుందేళ్లను ప్రేమతో సాకి చివరకు మాంసం కోసం చంపివేయడాన్ని తట్టుకోలేకపోయింది రచయిత్రి. ఇది రచయిత్రి జీవ కారుణ్య భావనకు నిదర్శనం. ఆనంద భైరవి కథలో రంగులరాట్నంలో తిరగడం కోసం సిగరెట్టు డబ్బాలు ఏరుకునే పిల్లల మనస్తత్వం, మూగజీవాల పట్ల ప్రేమ కనిపిస్తాయి.

1979లో విచ్ఛిన్నం అయిపోయిన అమెరికా అంతరిక్ష కేంద్రం స్కైలాబ్ ఉదంతం ప్రపంచాన్ని కలవరపెట్టింది. అది ఫలానా రోజు కూలిపోతుంది అని రేడియో వార్తల్లో తెలవగానే ప్రజలంతా ఊపిరి బిగబట్టుకొని ఇంకా సేపట్లో చనిపోతాం అనే భావంతో భయాందోళనలతో గడిపారు. ఈ సన్నివేశాన్ని రచయిత్రి బాల్యంలో ప్రత్యక్షంగాచూసి ఉండవచ్చు. కనుక ఆనాడు నెల్లూరులో ఉన్న పరిస్థితి స్కైలాబ్ కథలో చక్కగా చూపించారు.

మానవీయస్పృహతో హృదయాన్ని పిండి వేసే కథ 'మహారాజు'. వ్యసనానికి తాగుబోతు అయినా ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మానవతామూర్తి రవణడు. సుబ్రహ్మణ్యం మాస్టారు చనిపోయినప్పుడు ఎవరు దగ్గరకు రాకపోయినా తానే అన్నీ అయి అంతిమయాత్ర నిర్వహించిన వాడు. దసరా ఉత్సవాలలో శవం వేషం వేసి అందరినీ అలరింప చేసినవాడు. అకస్మాత్తుగా శవం వేషంలో ఉండగానే శవం గా మారిపోవడం పాఠకుల హృదయాలను ద్రవింప చేస్తుంది. ఇదే కథను స్వల్ప మార్పులతో దసరా ఉత్సవాల నేపథ్యంలోనే రాసిన మరో కథ ఒక బాలనాగమ్మ నలుగురు మాయల పకీర్లు. ఇది హాస్యాస్ఫోరకమైన కథ. మాయలపకీరు వేషం వేసిన వాడికి కుక్క దొరకక ఒకే కుక్కను నలుగురు మాయల పకీరు వేషగాళ్ళు బాడుగకు తీసుకోవడం ఈ కథలో ఇతివృత్తం.

కులం కన్నా గుణం మిన్న అని తెలియపరచిన కథ 'బాపనోళ్ళ పిల్ల ముత్తరాసి యానాది పిలగోడు '. సంఘసంస్కరణ కాంక్షిస్తూ సాగిన కథ ఇది.

సేవా దృక్పథంతో పనిచేసే డాక్టర్ కు ఎంతటి ప్రజాదరణ ఉంటుందో తెలియజెప్పే కథ 'రూపాయి దేవుడు'. డాక్టరుకు ప్రమాదం జరిగింది అనే తప్పుడు సమాచారం వచ్చిన వెంటనే ప్రజలు ఎలా తల్లడిల్లిపోయినారో , ఆయన క్షేమంగా ఉన్నాడు అని తెలియగానే ఎంత సంతోషం వ్యక్తం చేశారు ఈ కథను చదివితే అవగతం అవుతుంది. ప్రజా డాక్టర్ దేవుడితో సమానం అని ఈ కథ ద్వారా తెలుసుకుంటాం. పడుచు జంటల సరసాలను తల్లికి చెబుతానని బెదిరించే ఓ చిన్న పిల్ల కథ 'అందమైన గాజులు'. పిల్లల మనస్తత్వం ఈ కథలో గమనించవచ్చు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం జన్మస్థలం నెల్లూరు. వారి తండ్రి సుప్రసిద్ధ హరికథా కళాకారులు సాంబమూర్తి గారు. రచయిత్రి చిన్నతనంలో సాంబమూర్తి గారి హరికథను ఎస్పీ శైలజ గారి పాటలను విన్న ఉదంతాన్ని ' సాంబమూర్తి కథ శైలజమ్మ పాట' అనే కథగా మలిచింది. సాయిబాబా మందిరంలో పూజారి చలమయ్య కొడుకు సాయిరాం గుడిలో కొబ్బరి నీళ్ళ కొబ్బరి ముక్కలు ఇచ్చినందుకుగాను సైన్స్ రికార్డులో రచయిత్రి చేత బొమ్మలు వేయించుకోవడం వంటి చిన్ననాటి అనుభూతులను 'సైన్స్ రికార్డు కొబ్బరి చట్నీ' కథగారాశారు.

జొన్నలగడ్డ వారి వీధి, శాంతి స్వీట్ హోమ్, స్వామి దాస్ కాన్వెంట్, విజయ మహల్ రైల్వే గేట్, శ్రీనివాస విద్యాలయం, వేదాయపాలెం బాలాజీ నగర్, మొదలైన ప్రాంతాలు, కృష్ణ, కళ్యాణి, కావేరి హాల్స్, రంగనాయకుల పేటలోని వినాయక మహల్, సుందర్ డీలక్స్, మణి టాకీస్, శ్రీనివాస మహల్, అర్చన ఏసి, కనకమహల్ మొదలైన సినిమా థియేటర్లు కథల నిండా కనిపిస్తూ పాఠకులను నెల్లూరులో విహరింప చేస్తాయి. నెల్లూరు ప్రజల నిష్కల్మషమైన ప్రేమ, మనుషుల మధ్య అనుబంధాలు, సంఘ జీవనం పాఠకులకు ముచ్చట కొలుపుతాయి. రోహిణి వంజారి గారి రచన శైలి ఆకట్టుకునే విధంగా ఉంది. చక్కని జీవద్భాష ఈ కథల సంపుటికి అదనపు ఆకర్షణ. వీరి నుండి మరిన్ని మంచి కథలు ఆశించడం అత్యాశకాబోదు.



- డాక్టర్ సాగర్ల
సత్తయ్య
7989117415

## మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క కన్నుమూత



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి అక్క శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత కొద్ది రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో ఆమె బాధపడుతున్నారు. కాగా బెంగళూరు నారాయణ హృదయాలయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొమిరెడ్డి జ్యోతక్క మృతితో కార్యకర్తలు అభిమానులు నియోజకవర్గ ప్రజలు శోకసముద్రంలో మునిగారు.

## స్కాట్లాండ్‌లో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా లండన్ పర్యటనలో ఉన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి , ఉమ్మడి పాలమూరు జిల్లా సహచర ఎమ్మెల్యే లు ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు సమక్షంలో స్కాట్లాండ్ రాష్ట్రంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు.

## సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మున్సిపాలిటీలో అన్ని బ్లాకుల్లోని ఎన్యుమరేటర్స్ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మున్సిపాలిటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. ఎన్యుమరేటర్స్ సమగ్రంగా ఫారం లోని జాబితా పరిశీలించి తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్వీనర్ ఎన్నిక



**విశ్వంభర, డిండి:** డిండి మండల కేంద్రంలో మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల గ్రామ శాఖ కన్వీనర్లను కోకన్వీనర్లను దేవరకొండ నియోజకవర్గం కన్వీనర్ బోయినీ చంద్రమౌళి, డిండి మండల కన్వీనర్ అవుట మల్లేష్ ఆధ్వర్యంలో మండల గ్రామ శాఖ కన్వీనర్లను నీరటి బాలరాజు, కోకన్వీనర్లను అవుట రామస్వామి, అవుట అంకాలు, అవుట శ్రీనివాసులు, ఎర్ర బాలస్వామి, నారీమల్ల కుమారు, అవుట చెన్నయ్య, ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో నీరటి లక్ష్మీనారాయణ, అవుట గెల్వయ్య, అవుట చెన్నయ్య, సంతోష్, మహేష్, సురేష్, పరమేష్, ఆనందు, అనిల్, అంజి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేను పరిశీలించిన జడ్పీ సీఈఓ



**విశ్వంభర. మహేశ్వరం :** మహేశ్వరం మండలంలోని గట్టుపల్లి గ్రామం, మహేశ్వరం గ్రామం, సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే ను జడ్పీ సీఈవో , కృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రతి ఒక్కరు సర్వేకు సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో , ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎంపీఓ రవీందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



**విశ్వంభర, పరిగి:** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన రామయ్య కు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మంజూరు చేయించిన 60 వేల రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును రామయ్యకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగులయ్య గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

## కల్వకుర్తి-మాచర్ల రైల్వే లైన్ ప్రారంభించాలి

**విశ్వంభర, ఆమనగల్లు:** ఏపీ-తెలంగాణలను అనుసంధానించే లాకల్వకుర్తి-మాచర్ల రైల్వే లైన్ పనులు ప్రారంభించాలని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ ను కోరారు. డోర్నకల్ నుంచి సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల్ వరకు నూతన రైల్వే లైన్ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన జడ్చర్ల-నాగర్ కర్నూల్-కొల్లాపూర్-నంద్యాల వరకు రైల్వే లైన్ పనులు ప్రారంభించాలని లేఖ ఇచ్చారని మల్లు రవి తెలిపారు. దానికి సర్వే పూర్తయిందని కేంద్రం నుండి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని అరుణ్ కుమార్ తెలిపారు

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### చెక్కుల పంపిణీ లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీ నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.భూక్యా మురళీ నాయక్ అన్నారు. శనివారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే మురళీ నాయక్ లబ్బిదారులకు అందచేసారు. నియోజకవర్గ పరిధిలో గల వివిధ మండలాలకు చెందిన అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలలోని 190 మంది బాధితులకు మంజురైన 48,85,000 రూపాయల విలువగల చెక్కులను మురళీ నాయక్ లబ్బిదారులకు అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రములో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం, బంగారు తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, అన్ని మండలాల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వార్డు కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, వార్డు మెంబర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 800 మీటర్ల పరుగు పందెంలో విజయలక్ష్మికి కాంస్య పతకం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉస్మానియా విశ్వ విద్యాలయంలో నిర్వహించినఇంటర్ కాలేజ్ ఆథెట్లిక్స్ ఛాంపియన్ షిప్ ఫర్ మెన్, ఉమెన్ 2024-25 పోటీలలో కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న నేనావత్ విజయలక్ష్మి 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.రామ్ రెడ్డి తెలిపారు. శనివారం విజయలక్ష్మిని డాక్టర్ పి రామ్ రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విజయలక్ష్మి దేశం తరఫున ఆడాలని ఆకాంక్షించారు. తమ కళాశాలలో చదువుతోపాటు విద్యార్థులకు వారి నైపుణ్యాలను వెలికి తీసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత ఉన్నారు.

## రామన్నపేట పీఏసీఎస్ భవనం ప్రారంభం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. ఈ కార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, డిసిసిబి చెర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ప్రారంబోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, స్వంత నిధులతో భవనాన్ని నిర్మించుకున్న సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వినతి మేరకు రామన్నపేట వ్యవసాయ మార్కెట్ ను ఉప మార్కెట్ నుండి మార్కెట్ గా ఏర్పాటు చేస్తామని అన్నారు.

# కుటుంబ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- సర్వేలో ప్రభుత్వ సూచనల ప్రకారం సమాచారాన్ని సేకరించాలి
- స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని అర్హులు వినియోగించుకోవాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా శనివారం కురవి మండలం అయ్యగారి పల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, కురవి మండల కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వే చేసే ఎన్యుమినేటర్స్ ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఖచ్చితమైన సమాచారం సేకరించాలని, విధులలో ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వే నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 4, మున్సిపల్ పరిధిలు, 18 మండలాలు సర్వే కోసం 1884 మంది ఎన్యుమినేటర్స్, 186 మంది సూపర్వైజర్లు, 18 మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పారదర్శకంగా, వేగంగా, ప్రభుత్వ సూచనల ప్రకారం సర్వేను నిర్వహించుటకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. గత మూడు రోజులుగా హౌసింగ్ స్టిక్కరింగ్ పూర్తి చేశామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొని రోజువారి నివేదికలు తెప్పించడం జరుగుతుందని అన్నారు. సర్వే చేసిన రికార్డులను అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, మార్పులు చేర్పులు తదితర అంశాల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలలో బూతులు అధికారులు సిద్ధంగా ఉంటారని ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట కురవి ప్రత్యేక అధికారి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, తహసిల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, తదితరులు ఉన్నారు.

# నూతన హమాలీ సంఘ కార్యవర్గానికి సన్మానం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలో నూతన హమాలీ సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య, ఉపధ్యక్ష్యులుగా కృష్ణయ్య, పార్వతి, జనార్దన్, కృష్ణయ్య, బీ జంగయ్య కోశాధికారిగా వెంకటేష్, సహయ కార్యదర్శులుగా వెంకటేష్, జంగయ్య సలహాదారులుగా రమేష్, మల్లేష్, పెంటయ్య లింగయ్య, కృష్ణ, నూతన కార్యవర్గానికి డీసీసీ అధికార ప్రతినిధి మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహ ఆవరణలో వారికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంఘం సభ్యులకు భీమ సదుపాయం కల్పిస్తానని, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు జంగిర్ బాబా, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షులు హనుమనాయక్, మాజీ వార్డు సభ్యులు మంకీ శ్రీను, రాయికంటి బీక్షాపతీ, ముత్తి కృష్ణ, బోసు రవి, ఎర్రోళ్ల శ్రీకాంత్, క్యామ రాజేష్, కర్రోళ్ళ రమేష్, తుప్పరి మహేష్, సత్యం వెంకటేష్, హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## టీపీసీసీ మీడియా కో ఆర్డినేటర్‌గా కప్పాటి పాండురంగా రెడ్డి



**విశ్వంభర. మహేశ్వరం:** టీపీసీసీ మీడియా మహేశ్వరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గా కప్పాటి పాండురంగా రెడ్డి ని మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జీ కిచ్చినగారి లక్ష్మారెడ్డి నియమించారు. శుక్రవారం పాండురంగా రెడ్డికి నియామక పత్రం అందజేసారు . ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా మీడియా ఇంచార్జీగా సమర్థవంతంగా పని చేయగల సామర్థ్యం వున్న నాయకుడు పాండురంగా రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమం లో పిసిసి మాజీ ఉపాధ్యక్షుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, మర్యాద మురళీదర్ రెడ్డి, సభావత్ క్రిష్ణా నాయక్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటి సభ్యులు మదుసూదన్ రెడ్డి, డిసిసి ప్రదాన కార్యదర్శి బొక్క భూపాల్ రెడ్డి, ఎగ్గిడి క్రిష్ణవకురుమ, కౌన్సిలర్ యాదన్న రాజునాయక్,మదన్ పాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,బాబురావు,పాండుగౌడ్, సభావట్ గణేష్ నాయక్, మహేందర్ కురుమ కౌన్సిలర్ జంగయ్య, మహిళా నాయకురాల్లు పద్మక్క. సమతక్క.అమృత నాయుడు,జగదీశ్వర్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే సమాచారాన్ని సమర్థవంతంగా సేకరించాలి : తహసిల్దార్ లలిత



**విశ్వంభర, ఆమనగల్లు:** సమగ్ర కుటుంబ కుల గణన, ఓటర్ల జాబితా సమర్థవంతంగా నిర్వహించాలని తాహసిల్దార్ లలిత అన్నారు. కుల గణన, ఓటర్ల జాబితా పై ప్రత్యేక కార్యక్రమం 2025 భాగంగా ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా, సమయపల్లి తండా, మేడిగడ్డ తండా, ఆమనగల్ మున్సిపాలిటీ లో ఆమె పర్యటించారు. ఎలాంటి లోటుపాటు లేకుండా తప్పులు దొరలకుండా నిక్షిప్తంగా సమాచారాన్ని సేకరించాలని ఎన్యుమారేటర్లకు సూచించారు. అలాగే బీఎల్ఓ లకు ఫార్మ్ 6 మరియు ఫామ్ 7లు తీసుకొని ఓటర్ల నమోదు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ ఆర్డీఓ శీను నాయక్ పాల్గొని పోలింగ్ బూత్ నెంబర్ 190, 193, 194 లు సందర్శించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ చెన్నకేశవులు, ఏన్యూమరటర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్యాయం కోసమే సమగ్ర సర్వే

ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి



**విశ్వంభర, ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తో రాష్ట్రంలోని ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సర్వేలో ఆయన పాల్గొని స్థానిక ప్రజలకు సమగ్ర సర్వే పై విశ్లేషించారు. ఈ సర్వే తో సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన మొదలైన వివరాలతో పొందుపరచబడిన సమగ్ర సర్వే బుక్ లెట్ పై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని పదవ వార్డులో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. కుటుంబంలోని సభ్యుల వివరాల గురించి అధికారులు అడిగి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ ఛైర్పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ ఛైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ ఏ రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొంతం మంజుల మురళీ, వనం శేఖర్, భాగ్యలక్ష్మి శివ, మాజీ వైస్ ఛైర్మన్ లింగ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కె బబ్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**విశ్వంభర, పెద్ద శంకరంపేటః** ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. హవేలీ ఘన్పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో.స్పెషల్ క్యాంపింగ్ డే జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (స్వీప్)ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం - 2025 లో భాగంగా మెదక్ జిల్లావ్యాప్తంగా ఈరోజు (శనివారం), రేపు (ఆదివారం) నవంబర్ 10 వ తేదీన ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 1వ తేదీ 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత,కొత్త ఓటర్ గా నమోదు చేసుకునేందుకు,మార్పులు సవరణకు,వెలువడిన ఓటరు జాబితాలో అభ్యంతరాల తెలిపేందుకు కోసం బూత్ లెవల్ ఆఫీసర్లు తమ బూత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. నూతన ఓటరు గా నమోదుకు ఫామ్ - 6, అక్టోబర్ 29 న విడుదల చేసిన ఓటర్ ముసాయిదా లో అభ్యంతరాల కోసం ఫారం - 7, సవరణలకు ఫారం - 8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు. ఆన్లైన్లో voters.eci.gov.in వెబ్సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

## గట్టు ఇప్పలపల్లిని మండలంగా ప్రకటించాలి



**విశ్వంభర, తలకొండపల్లి:** కల్వకుర్తి నియోజకవర్గం లో తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలంటూ 148వ రోజు గిరిజన యువకులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. చుట్టుపక్కల గ్రామ పంచాయతీలకు గట్టు ఇప్పలపల్లి అన్ని విధాలుగా కేంద్ర బిందువుగా ఉన్నది కాబట్టి, అన్ని గ్రామ పంచాయతీలకు మార్కెటింగ్ చేసుకోవడానికి అన్ని వసతులు ఉన్నందున మా గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలంటూ జేఏసీ చైర్మన్ మోకురాల అశోక్ గౌడ్ అన్నారు. గడ్డ తండా రమేష్ నాయక్, మొత్య నాయక్, శేష నాయక్, హనుమంతుని హనుమంతు, రామ్ సింగ్, భాస్కర్, రాజు, కిషోర్ నాయక్, బాలు, అమర్ సింగ్, వైస్ చైర్మన్ శరత్చంద్ర,రమేష్ బోయినపల్లి నవీన్ కుమార్, ఏదుల అనిల్ పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే పనులను పరిశీలించిన ఎంపీడీవో



**విశ్వంభర, పరిగి:** పరిగి మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే పనులను శనివారం ఎంపీడీవో కరీం, ఎంఈఓ గోపాల్ తో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రాములు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏన్యూమరేటర్ భ్రమరాంబ, గ్రామస్తులు శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, పెంటారెడ్డి, యాదయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి



**విశ్వంభర. మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ బాయ్స్ హై స్కూల్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో 68వ ఎస్. జి. ఎఫ్ . టి ఎస్ హ్యాండ్బాల్ అండర్ 19 బాయ్స్, గర్ల్స్ .కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ పాల్గొని చైర్మన్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో పైకి రావాలని అన్నారు నేషనల్ గేమ్స్ లో మన తెలంగాణ విద్యార్థులు ముందుండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జపాల భవన సుధాకర్, రాజమోని రాజు ముదిరాజ్ నర్లకంటి బాలరాజు,దేవేందర్ నాయక్,శివ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహ స్థాపనకు భూమి పూజ



**విశ్వాంభరం, నాగారం:** నాగారం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి శనివారం గౌడ కులస్తులు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాలు, కొబ్బరికాయల హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు బంధారపు వెంకటయ్య, బాలగాని మురళీ, అనంతుల వెంకటయ్య, బంధారపు పిచ్చయ్య పిచ్చయ్య, అనంతుల మల్లయ్య, అనంతుల యాదగిరి, పాముకుంట్ల అంజయ్య, ఖమ్మంపాటి చంద్రయ్య, అనంతుల లాలు, అనంతుల ముత్తయ్య, బాలగానినారాయణ, బాలగాన్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కుకు అర్హులు



**విశ్వంభర, అమనగల్లు:** భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు వస్పుల శ్రీశైలం కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని, ఓటుహక్కుపై సమాజంలో మరింత అవగాహన అవసరమని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 183వ బూత్ కమిటీ ఆధ్వర్యంలో 18 ఏళ్ళు నిండిన వారికి శనివారం ఓటుహక్కు దరఖాస్తు చేయించారు. అమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బీ ఎల్ ఓ స్వాతి పర్యవేక్షణలో పలువురికి కొత్తగా దరఖాస్తు చేయించారు. అర్హులందరూ ఓటుహక్కును పొంది ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని శ్రీశైలం కోరారు.

## జాతీయస్థాయి హాకీ క్రీడకు ఎంపికైన పిల్లల ఉమేష్



**విశ్వంభర, మహబూబాబాద్:** ఇటీవల సంగారెడ్డి జిల్లాలో జరిగిన 68వ ఎస్ జీ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ అండర్ 17 బాలుర విభాగంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మైనార్టీ బాలుర కళాశాలకు చెందిన విద్యార్థి పిల్లల ఉమేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక అయ్యాడు. ఈనెల నవంబర్ 22 నుంచి 27 వరకు హర్యానాలో జరగబోయే జాతీయస్థాయి టోర్నమెంట్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ ఎండి రహీం హుస్సేన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థి జాతీయస్థాయి హాకీ టోర్నమెంటుకు ఎంపికైనందుకు మాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. చదువు తోపాటు విద్యార్థులు, క్రీడల్లో కూడా రాణిస్తే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి పిల్లల ఉమేష్ ను కళాశాల పీడి రవీందర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించండి

### జలమండలి ఎండీని విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని భారతీ నగర్, రామచంద్రపురం, పటాన్ చేరు డివిజన్ల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు 13 కోట్ల 20 లక్షల రూపాయలు నిధులు కేటాయించాలని ఆ శాఖ ఎండి అశోక్ రెడ్డిని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్లో పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. బల్దియ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు, పాత కాలనీలలో అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికల సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. వీటితోపాటు గతంలో జలమండలికి కేటాయించిన ఆర్ హెచ్ సీ ప్రాంతంలో ఆసుపత్రి సేవలు లేనందున స్థానిక అవసరాల కోసం జీహెచ్ఎంసీ కి కేటాయించాలని కోరారు. ఎందుకు సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** రక్తదానం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముస్తాఫ అన్నారు. శనివారం మాదాపూర్ లోని అపెక్స్ కోవంటేజ్ సాఫ్ట్వేర్ కంపెనీలో ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ముస్తఫా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో నేటికీ బ్లడ్ బ్యాంకులలో కొరత ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి అయినా బ్లడ్ డొనేషన్ చేయాలని సూచించారు. బ్లడ్ డొనేషన్ చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలు అవొచ్చు అని తెలిపారు. చాలామంది ఉద్యోగులు బ్లడ్ డొనేషన్ ఇవ్వడానికి ముందుకు రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు.. బ్లడ్ డొనేషన్ చేసిన ఉద్యోగులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి విజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో కన్న కొడుకును హతమార్చిన తండ్రి

**విశ్వంభర, ఎల్బీనగర్:** క్షణికావేశంలో తండ్రి కుమారుడిపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేయడంతో కుమారుడు మరణించిన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్మన్ ఘాట్ న్యూ మారుతి నగర్ కి చెందిన 23 సంవత్సరాల వీరనగరి జైపాల్ డిగ్రీ విద్యాభ్యాసాన్ని మధ్యలో ఆపివేసి జులాయిగా తిరుగుతున్నాడు. ఈ విషయంలో తండ్రి వీరనగరి శేఖర్ కుమారుడు వీరనగరి జైపాల్ మధ్య గొడవ జరుగుతుండగా కోపంతో తండ్రి కూరగాయలు కోసే కత్తితో దాడి చేయడంతో జైపాల్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు ఓవైసీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# హత్య కేసును ఛేదించిన దుండిగల్ పోలీసులు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** నియోజక వర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లంపేట లో గత రెండు నెలల క్రితం వంశీ రెసిడెన్సీ లో నివాసముంటూ మిల్క్ పాయింట్ నిర్వహిస్తున్న శారద (50) మహిళ హత్య కేసును దుండిగల్ పోలీసులు ఛేదించారు. వివరాలను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు. గుర్తు తెలియని దుండగులు ఒంటరిగా ఉన్న మహిళను హత్య చేసి ఒంటిపై ఉన్న బంగారం దోచుకెళ్లారని అని కుమారుడు సాయి వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతికత ఆధారంగా మృతురాలు బి.శారదను చంపిన నిందితుడు ఎ. ప్రవీణ్ కుమార్ గా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా అతను నిజం ఒప్పుకున్నాడు. అదిలాబాద్ జిల్లాకు చెందిన ఇతడు ప్రైవేట్ ఉద్యోగి, గతంలో రిపోర్టర్గా కూడ పనిచేశాడు. ప్రవీణ్ కు మృతురాలు శారద తో గత 10 సంవత్సరాలుగా అక్రమసంబంధం ఉంది. మృతురాలు సంవత్సరం నుండి ఆమె డబ్బు కోసం ప్రవీణ్ ను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించింది. లేని పక్షంలో కుటుంబ సభ్యులతో వారి అక్రమ సంబంధం గురించి బయటపెడతానని, కేసు నమోదు చేసి పరువు తీస్తానని బెదిరించింది. దీంతో నిందితుడ ఆమెకు కు 2,00,000 రూపాయలు ఇచ్చాడు. ఆమె ఫోన్లోని తన వీడియోలను ఇస్తానని చెప్పి ప్లాన్ చేసి మల్లంపేటకు కు 23 సెప్టెంబర్ 2024 ఉదయం తన స్వస్థలం ఉట్నూర్ నుండి మల్లంపేటలో ఉన్న ఆమె ఫ్లాట్కి రప్పించింది. ఇంటికి వచ్చిన తర్వాత అతను తన వీడియోలను తిరిగి ఇవ్వాలని కోరడం జరిగింది. వీరిద్దరి మద్య వాగ్వాదం జరిగి కోపంతో అతను ఆమె గొంతును గట్టిగా నొక్కాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించిందని తెలుసుకొని అక్కడ్నుంచి పరారయ్యాడు. పోలీసులు ఎలాగైనా కేసును చేదించాలని ఉద్దేశంతో సాంకేతిక పరిజ్ఞానంతో ప్రవీణ్ కుమార్ ను అదుపులోనికి తీసుకున్నారు. నిందితుని అరెస్టు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన నందుకు ఏ. సతీష్ కుమార్, డీఐ సతీష్, ఎస్ఐ శంకర్ ను డీసీపీ కోటిరెడ్డి అభినందించారు.

## తరగతి గదులను పునరుద్ధరించిన పూర్వ విద్యార్థులు



**విశ్వంభర, హసన్పర్తి:** హనుమకొండ జిల్లా హసన్పర్తి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం హసన్పర్తి 66 డివిజన్ (జావా) కార్యక్రమంలో ముఖ్య అధితి గా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యకర్మంలో పాత విద్యార్థులు తమ సొంత నిధులతో పాత తరగతి గదులను పునరుద్ధరించారు. నూతన తరగతి గదులను ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేసే విధంగా విద్యార్థులు ముందుకు రావాలని అన్నారు. తదనంతరం జావా సభ్యులకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలగే పాఠశాలను అతి త్వరలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతసాగర్ పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, హసన్పర్తి సీఐ, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం నూతన మండల కమిటీ ఎన్నిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో సీపీఎం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా రెండవసారి బొడ్డుపల్లి వెంకటేశం ఎన్నిక కావడం జరిగిందని, రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల మహాసభలో హాజరైన మండల ప్రతినిధులు మరోసారి **వెంకటేశంను నూతన మండల కార్యదర్శిగా** ఎన్నిక చేయడం జరిగిందని, మునిపంపుల గ్రామానికి చెందిన వెంకటేశం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా, మండల కార్యదర్శిగా, నకిరేకల్ డివిజన్ కార్యదర్శిగా, యాదాద్రి భువనగిరి ప్రథమ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమంలో పనిచేసి, గత మహాసభలో సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగిందని, ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు జల్లెల పెంటయ్య లు తెలిపారు. సీపీఎం నూతన మండల కమిటీగా 21 మందితో రామన్నపేట మండలం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల కార్యదర్శిగా బొడ్డుపల్లి వేంకటేశం, మండల కార్యవర్గ సభ్యులుగా జలల పెంటయ్య, కూరెళ్ళ నరసింహాచారి, బోయిని ఆనంద్, బల్గూరి అంజయ్య, కల్లూరి నాగేష్, కందుల హనుమంతు, జంపాల అండాలు, మండల కమిటీ సభ్యులుగా మీర్ ఖాజా అలీ, గాదె నరేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, ఎండి.రషీద్, వేముల సైదులు, మేడి గణేష్, గొరిగె సోములు, బొడిగె రజిత, ఎర్రోళ్ల లక్ష్మమ్మ లను మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు. సీపీఎం మండల మహాసభ సందర్భంగా పలు ప్రజా సమస్యల బలమైన పోరాటాలు నిర్వహించాలని మహాసభలో తీర్మానం చేయడం జరిగింది. రామన్నపేటలో ఏర్పాటు చేయ తలపెట్టిన ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని, రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా మార్చి, ఖాళీ డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని, చిట్యాల నుండి భువనగిరికి నాలుగు లైన్ల రోడ్డును వేయాలని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాలువలను పూర్తి చేసి రైతాంగానికి నీరు ఇవ్వాలని, రామన్నపేట నియోజకవర్గం పునర్ ఏర్పాటు చేయాలని, మూసి కాలుష్యాన్ని ప్రక్షాళన చేసి మూసి నీటికి బదులుగా గోదావరి జలాలను ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, ఆసిఫ్ నెహర్ కాలువల ద్వారా అందించాలని, ఇలాంటి పలు సమస్యల పరిష్కారానికై, సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది.

## ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ కోర్టు జడ్జి డి నాగేశ్వరరావు



**విశ్వంభర, జగిత్యాల:** సమాజంలో జీవించే ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, దానివల్ల ప్రతి మనిషి జీవితానికి మేలు జరుగుతుందని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జగిత్యాల జిల్లా మెట్ పల్లి లో శనివారం లీగల్ సర్వీస్ డే సందర్భంగా మెట్ పల్లి సీనియర్ సివిల్ కోర్టు జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్ డి నాగేశ్వరరావు అన్నారు. మెట్ పల్లి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల కళాశాల యందు నిర్వహించిన జాతీయ లీగల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు అందించవచ్చునని ఆయన పేర్కొన్నారు. నేడు దేశంలో ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తున్నాడు అంటే ఎన్నో చట్టాలు వారికి అండగా ఉన్నాయన్న విషయం తెలుసుకోవాలని, మైనర్ విద్యార్థులు మోటార్ సైకిల్ నడపవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జ్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలు ఇతర వ్యసనాలకుదూరంగా ఉండి సమాజంలో ఉత్తమమైన వ్యక్తులుగా తీర్చిదిద్దబడాలని, భవిష్యత్తులో చట్టాలపై అవగాహన పెంపొందించుకొని ఉన్నతమైన విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శ పౌరులుగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, కార్యదర్శి టి వేణు గోపాల్, సీనియర్ న్యాయవాదులు వెంకట నరసయ్య, ఆనంద్ గౌడ్, వడ్డేపల్లి శ్రీనివాస్, గడ్డం శంకర్ రెడ్డి, ఓజ్జల శ్రీనివాస్, నల్ల రాజేందర్, శేఖర్, నరసయ్య రాజేశ్వర్గౌడ్, సురక్ష తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ అవుట్లెట్ సమస్య పరిష్కారం కోసం కృషి

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, హయత్ నగర్** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం సాహెబ్ నగర్ గ్రామరైతులతో తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుండి వచ్చే వరద నీటిని కాప్రాయ్ చెరువులోకి రాకుండా గుర్రంగూడ ఫారెస్ట్ నుండి విపశ్యన ధ్యాన కేంద్రం మీదుగా దిగువన ఉన్న గాయత్రినగర్, పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్ విల్లాస్ మీదుగా తీసుకెళ్లి మునగనూర్ మీదుగా అంబర్ పెట్ శివారులో కలపాలని ప్రణాళిక చేయడం జరిగింది. ఇందులో భాగంగా ట్రంక్ లైన్ పనులు క్రిస్టల్ విల్లాస్ ఎదురుగా ఉన్న రైతుల పొలాల వరకు వచ్చి ట్రంక్ లైన్ పనులు ఆగిపోవడం జరిగింది. ప్రజా అవసరాలు గుర్తించి 21 కాలనీల డ్రైనేజీ సమస్య ట్రంక్ లైన్ కోసం తమ పొలాల నుంచి కొంత స్థలం ఇవ్వాలని రైతులను కోరారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలు మీకు అందిస్తామని హామీ ఇచ్చారు. మీరు ఆ స్థలం ఇస్తే దాదాపు శివారు ప్రాంతాల్లో ఉన్న 21 కాలనీవాసులకు ఎంతో మేలు చేసినవారవుతారు అని ఎమ్మెల్యే రైతులకు విజ్ఞప్తి చేశారు. దానికి రైతులు కూడా సానుకూలంగా స్పందించడం జరిగింది. అలాగే తమకు రెండు రోజుల్లో సమయం ఇస్తే రైతులందరం మాట్లాడుకొని ఈ సమస్యను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే కి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, అధికారులు శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రైతులు జక్కిడి మోహన్ రెడ్డి, జక్కిడి శేఖర్ రెడ్డి, జక్కిడి సంజీవ రెడ్డి, జక్కిడి లక్ష్మరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం




**విశ్వంభర, యాకుత్పుర:** హైదరాబాద్ యాకుత్పురా నియోజకవర్గం గౌలిపుర లోని జానకి దాస్ మఠ్ లో కార్తీక మాసంలో గోవర్ధన పూజ, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. దక్షిణ ముఖం హనుమంతుడు కలిగి ఉండడం ఈ దేవాలయ విశిష్టత, ఈ దేవాలయంలో రామ్ లక్ష్మణ సీత, శివుడు, రాధాకృష్ణులు, హనుమంతుని విగ్రహం, పోచమ్మ గుడి, నవగ్రహాలు, గత మూడు వందల సంవత్సరాల నుండి నిర్విరామంగా పూజలు అందుకుంటున్నారు. ఈ మఠంలో జానకి దాస్ జీవ సమాధి అవ్వడం కూడా ఓ ప్రత్యేకత. నర్సింగ దాస్ మెహెంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ దేవాలయానికి రూపం పోశారు. కుటుంబ సభ్యులు విశాల్ దాస్ మహంత ప్రత్యేక చొరవ తీసుకొని, ఈ కార్యక్రమాలను తన భుజస్కంధాలపై వేసుకొని నడిపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉమేష్ దాస్, శివాని మహంత్ కోయల్ మహంతు, సిమ్రాన్ అనుష, నందిని, ఉదతి, అనిత, బస్తీవాసులు సహాయ సహకారాలతో ఈ యొక్క కార్యక్రమం విజయవంతం చేస్తున్నారు.

## ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి కళ్యాణం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జల్ గ్రామంలో గోవిందరాజస్వామి కొండపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి కళ్యాణం కన్నుల అంగరంగ వైభవంగా జరిగింది. వెల్జాల్ గ్రామానికి చెందిన నాగులపల్లి ముకుందరావు రేణుక దంపతులు, అయ్యపరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్.శ్రీనివాస్ యాదవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, కూన రవి, నరేందర్ గౌడ్ శివ విజయ్ కుమార్, సూరిశెట్టి భాస్కర్, శ్రీను, పోల ప్రభాకర్, గోపాలకృష్ణ, మోహన్ గుప్త, భయ్యా ఇస్త్రారి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భూపతి అన్న కాలనీలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ గోదావరి లోయ ప్రతిఘటన పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతి వీరన్న, పార్టీ జిల్లా కార్యదర్శి పిట్టల సత్యం లు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఒక నిమిషం మౌనం పాటించించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతి వీరన్న మాట్లాడుతూ చంద్ర పుల్లారెడ్డి ఒక విప్లవ యోదుడు, ఆనాడు ఉన్నటువంటి భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా భారతదేశం వ్యాప్తంగా పాలకవర్గాల దోపిడికి ఒక ప్రతిఘటన పోరాటాన్ని ముందుకు తీసుకొచ్చి నిర్మించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు, పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోవు సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రారంభించబడింది. ప్రతీ గ్రామంలో పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడీ టీచర్లు ఈ సర్వేలో ఎన్యూమరేటర్లుగా పాల్గొంటున్నారు. ఒక్కో ఎన్యూమరేటరుకు 150 కుటుంబాల చొప్పున కేటాయించబడ్డాయి. కానీ కుటుంబ సభ్యుల వివరాలు తీసుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. రామన్నపేట మండలంలోని కొత్తగూడెం గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గ్రామస్తుల దగ్గర వివరాలు సేకరిస్తున్న ఆ గ్రామపు పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడీ టీచర్.

## ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష నిర్వహించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సేవల్లో లోపం ఉండకూడదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. సౌకర్యాలు లేవంటూ రోగులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలోని సిబ్బంది అందరూ రోగులతో ప్రేమతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరడం జరిగింది.

## పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు పవన్ కల్యాణ్



**విశ్వంభర, మంగళగిరి:** రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో బాధ్యతగా ప్రవర్తించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హితవు పలికారు. పోలీసులు బాధ్యతగా పని చేయకపోతే.. వారు చేసిన తప్పులు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తాయన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, ఈ వ్యవహారంలో పోలీసులు ప్రవర్తించిన తీరుపై పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితుల తల్లిదండ్రులతో పోలీసులు వ్యవహరించిన తీరు ఆ కుటుంబాలకు తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు. శనివారం మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఇటీవల తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భీమవరం ప్రాంతానికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి, విజయవాడకు చెందిన నాదెండ్ల నిరంజన్‌ల కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ట్రస్ట్ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. పోలీసులు వ్యవహించిన తీరుపై బాధిత కుటుంబ సభ్యులకు పవన్ క్షమాపణలు చెప్పారు. కనీసం సమాధానం చెప్పకపోగా పోలీసులు మాట్లాడిన తీరు బాగాలేదన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై ఎందుకు కేసులు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు.

## రోడ్లపై వడ్లు ఆరబెట్ట వద్దు

### రైతులకు పేట ఎస్సై శంకర్ సూచన



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రహదారులపై రైతులు బడ్లు ఆరబెట్టవద్దని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ రైతులకు సూచించారు. శనివారం నార్సింగ్ రహదారిపై వడ్లు ఆరబెట్టిన రైతులకు ఎస్సై అవగాహన కల్పించారు. రోడ్లపై వడ్లు ఆరబెట్టడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్ల పైన వడ్లు ఆరబెట్టి బ్లాక్ టాప్ కప్పుపై రాళ్ళు పెట్టడం వల్ల రాత్రి పూట ఆక్సిడెంట్స్ జరుగుతున్నాయని ఎస్ఐ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉత్లూర్ శివార్లో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్ పైన వడ్లు ఆరబెట్టి న రైతులకు ఎస్సై హెచ్చరించారు. రోడ్లపై వడ్లు ఆరబెట్టడంతో ప్రమాదాలు జరిగితే కఠిన శిక్షలకు గురవుతారని తెలియ జేశారు.

## అక్రమంగా నిల్వ వుంచిన రేషన్ బియ్యం పట్టివేత



**విశ్వంభర, ఎల్బీనగర్:** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సరూర్ నగర్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ సైది రెడ్డి పట్టుకున్నారు. సరూర్ నగర్ మండలం ఇంద్ర హీల్స్ కాలనీలో ప్రభుత్వం ప్రజలకి ఇచ్చే రేషన్ బియ్యాన్ని కొంతమంది వ్యక్తులు నిల్వ వుంచారని సమాచారం వచ్చిందని ఇన్స్పెక్టర్ సైది రెడ్డి తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటన ప్రదేశానికి వెళ్ళి తనిఖీలు నిర్వహించగా అక్కడ వున్న 65 బ్యాగులు (30 క్వింటలు)ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా నిల్వవుంచిన కుందన్ కుమార్(24) అనే వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీని వెనుకాల వున్న వ్యక్తులపై కూడా కేసు నమోదు చేస్తామని తెలిపినారు. ఎవరైనా ప్రభుత్వం ప్రజలకి ఇచ్చే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ వుంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రక్తదానం మహాదానం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ ఆర్కేపురంలోని శ్రీశైవ క్షేత్ర పీఠంలో శనివారం పీఠం కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు ప్రసాద్, వనితాశక్తి ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరక్టర్ హేమ, పీఠం మేనేజర్ కోటేశ్వర్ రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పీఠాధిపతి శివస్వామి జన్మదినోత్సవాల సందర్భంగా సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సూచనల ప్రకారం సమాచారాన్ని సేకరించాలి

### జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి పట్టణంలోని 22 వ వార్డులో శనివారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఎన్యూమరేటర్ పాత్ర పోషించి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి మండలం, కొత్లాపూర్ గ్రామంలో ఇంటింటి కుటుంబ సర్వే, కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రక్రియకి మూడు రోజులపాటు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేసుకుని శనివారం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ నరసింహ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3400 ఎన్యూమరేటర్ బ్లాక్లు గా ఏర్పాటు చేసి ఎన్యూమరేటర్లను నియమించడం జరిగిందన్నారు. రిజర్వ్‌డ్ ఎన్యూమరేటర్లను కూడా సిద్ధంచేయడం జరిగిందన్నారు. వీరందరికి సర్వే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 10 మంది ఎన్యూమరేటర్ లకు ఒక సూపర్ వైజర్, ప్రతి మండలానికి ఒక జిల్లాఅధికారిని ప్రత్యేక అధికారిగా, ప్రతి నియోజకవర్గాని ఒక అధికారిని నియమించడం జరిగిందన్నారు. ఈ సర్వే రెండు వారాలలో పూర్తి చేసే విధంగా పారదర్శకంగా, వేగంగా, ప్రభుత్వ సూచనల ప్రకారం సర్వేను నిర్వహించుటకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం ఏడు గంటలకే ఈ సర్వే మొదలుపెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొని రోజువారి నివేదికలు తెప్పించడం జరుగుతుందని అన్నారు. సర్వే చేసిన రికార్డులను అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరుగుతుందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియ సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వే చేసే ఎన్యుమినేటర్స్ ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఖచ్చితమైన సమాచారం సేకరించాలని, విధులలో ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సర్వే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, మండల ప్రత్యేకాధికారి ఖాసీం బేగ్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రాష్ట్రంలోని ముదిరాజ్‌ల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట లోని చౌదరి చెరువులో చేప పిల్లలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు టీ జీ ఎఫ్ సీ ఓ ఛైర్మెన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్ జీవితాల్లో వెలుగులు నింపాలని సీఎం రేవంత్ రెడ్డి ఉచిత చేప పిల్ల విడుదల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ముదిరాజుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయామని అంతేకాకుండా కుల వృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు మా ప్రభుతం కృషి చేస్తుంది అని అన్నారు. మత్స్య అభివృద్ధి స్టేట్ సెక్టర్ పథకం ద్వారా 100% రాయితీ పై చేప పిల్లలను విడుదల చేసేందుకు మ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అలాగే చేప పిల్లలను పెంచిన తరువాత వాటిని అమ్ముకోడానికి కూడా వాహన సౌకర్యం కూడా మా ప్రభుత్వం కల్పిస్తుంది అని ఎమ్మెల్యే అన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా అన్ని విధాలుగా అదుకోవడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూధన్, నారా గౌడ్, సంగమేశ్వేర్ సెట్, రాజశేఖర్ రెడ్డి, పెరుమాళ్ గౌడ్, సంతు సెట్, గంగా రెడ్డి, కుంట్ల రాములు మాజీ సర్పంచ్, సంగయ్యా మాజీ ఉప సర్పంచ్, సాయి రెడ్డి, రాజు మాజీ ఎంపీపీ, చందర్ మాజీ సర్పంచ్, కుమార్, శశిధర్ రెడ్డి, సుభాష్ గౌడ్, వీర గౌడ్, నరేష్ మాజీ సర్పంచ్, జిల్లా మత్స్య శాఖ అధికారులు, తదితర మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.


## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**విశ్వంబర, వికారాబాద్:** రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శివా రెడ్డి పేట్ గ్రామం నందు 133, 134 పోలింగ్ స్టేషన్ లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటరు లిస్ట్ లో మార్పులు చేర్పులు తదితర అంశాల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలలో బీ ఎల్ ఓ అధికారులు సిద్ధంగా ఉంటారని ఆయన తెలిపారు. ఓటర్ గా నమోదుకు ఆదివారం బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంప్ లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జనవరి 1,2025 నాటికి 18 సం.లు నిండిన ప్రతి అర్హులైన వారు ఓటర్ గా నమోదు చేసుకోవడానికి మరో అవకాశం అని, ఓటర్ జాబితా లో తమ పేరు ఉందో లేదో ఓటర్ చెక్ చేసుకొని, ఓటర్ గా పే రు లేకుంటే ఫారం 6 ద్వారా పోలింగ్ బూత్ లో ఉన్న బి.ఎల్.ఓ దగ్గర నమోదు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్ లలో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుండి అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. అన్ని పోలింగ్ బూత్ లలో ఫారం 6,7,8, 8ఏ దరఖాస్తులు బి.ఎల్.ఓ.ల దగ్గర అందు బాటు లోవుంటాయని అన్నారు. 18 సం.లు నిండిన వారు రెండు కలర్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటో లు, నివాస, వయస్సు ధృవీకరణ పత్రం తీసుకొని రావాలని అన్నారు. ఆన్ లైన్ లో www.nvsp.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఓటర్ నమోదు సమాచారం కొరకు 1950 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం తెలుసు కోవచ్చని ఆయన తెలిపారు. ఈ పోలింగ్ స్టేషన్ పరిది లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, లిస్ట్ లో ఏవైనా మార్పులు ఉన్నాయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సుధీర్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, బీ ఎల్ ఓ లు స్వరూప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ భారతాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదు: గడ్కరీ



**ముంబయి:** గ్రామీణ భారతాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ విమర్శించారు. ఆ పార్టీ తన పాలనలో పల్లెలకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే రైతుల ఆత్మహత్యలు ఉండేవి కావని, గ్రామాల్లో పేదరికం తక్కువగా ఉండేదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వార్ధా జిల్లాలో నిర్వహించిన ప్రచార సభలో గడ్కరీ పాల్గొని ఈమేరకు ప్రసంగించారు. బీజేపీ అంటే తనకు లేదా ప్రధాని మోదీకి చెందిన పార్టీ కాదని.. దాని కోసం తమ జీవితాలను అంకితం చేసిన కార్యకర్తలదని కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంలో పార్టీ కార్యకర్తల సహకారాన్ని కొనియాడిన ఆయన.. తాను కార్యకర్తగా ఉన్న రోజులను గుర్తుచేసుకున్నారు. "పార్టీ కార్యకర్తగా ఉన్న సమయంలో నేను విదర్భ ప్రాంతంలోని వార్ధా జిల్లాలో స్కూటర్‌పై తిరిగేవాడిని. దేశ చరిత్రలో.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వలేదు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలూ కల్పించలేదు. ఆ పార్టీ తన పాలనలో పల్లె వికాసంపై దృష్టి సారించి ఉంటే రైతుల ఆత్మహత్యలు, పేదరికం ఉండేవి కావు" అని అన్నారు. తాను రిజర్వేషన్లను వ్యతిరేకించనని, రాజకీయాల కోసం కులమతాల ప్రస్తావన తీసుకురానని స్పష్టం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారు రిజర్వేషన్లు పొందాలని.. సామాజికవర్గాలను అడ్డుగా పెట్టుకుని కాదని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 20న పోలింగ్ నిర్వహించనున్నారు. 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో డీజీపీ ద్వారకా తిరుమలరావు భేటీ

**విశ్వంభర,అమరావతి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో డీజీపీ ద్వారకా తిరుమలరావు భేటీ అయ్యారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వీరిద్దరూ సమావేశమై పలు కీలక విషయాలపై చర్చించారు. ఇటీవల రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడి ఘటనలు, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు చేయడంపై కూటమి ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న నేరాలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, అరెస్టులపై పవన్‌తో డీజీపీ చర్చించినట్లు తెలుస్తోంది. గతంలో సామాజిక మాధ్యమాల్లో వైకాపా నేతల పోస్టులపై చర్యలు తీసుకోవడంలో పోలీసుల తీరుని పవన్ తప్పుబట్టిన నేపథ్యంలో డిప్యూటీ సీఎంతో డీజీపీ సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు గణపురం అంజయ్య అధ్యక్షతన జరిగగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు భూక్య మురళి నాయక్ హాజరయ్యారు. మొత్తం 190 మంది కి 48 లక్షల 85 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల నీ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం అని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేశారని, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు, 500 కే గ్యాస్, పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు కచ్చితంగా ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మండల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కేసముద్రం మాజీ జడ్పీటీసీ కదిర సురేందర్, నియోజకవర్గ నుండి గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి 100 సిమెంట్ బస్తాలు అందజేత



**విశ్వంభర, నందిగామ :** ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,గూడూరు మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్త అన్నారు.షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలంలోని అయ్యప్ప టెంపుల్ లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,గూడూరు మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్త ఆలయ నిర్మాణానికి 100 సిమెంట్ బస్తాలు అందజేశారు.అనంతరం అయ్యప్ప టెంపుల్ లో ఆలయ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,గూడూరు మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్తని పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గురుస్వామి గిరీష్ నాయర్,బాతుక లక్ష్మయ్య యాదవ్,దేపల్లి అశోక్ గౌడ్,మాదారం నరసింహ గౌడ్,నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి




**విశ్వంభర, హైదరాబాద్:** కాంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ. భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామ రాజు ప్రధాన కార్యదర్శి సి హెచ్ సురేష్ బాబు శనివారం జలమండలి మేనేజంగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డిని కలసి జలమండలి ఉద్యోగుల సమస్యలపై చర్చించడం జరిగినది. ప్రధానంగా జలమండలి ఉద్యోగులకు ఫ్రీ హెల్త్ కార్డు మంజూరు,క్యూ ఏ టీ వింగ్ టెక్నికల్ ఆఫీసర్స్ ప్రొమోషన్స్, జె టీ ఓ( క్యూ ఏ టీ ) నుండి ఏ టీ ఓ (క్యూ ఏ టీ ) అప్ గ్రెడేషన్, అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్, పెండింగ్లో ఉన్న జి. పి. ఈ నుంచి టెక్నీషియన్ గ్రేడ్ టూ ప్రమోషన్లు వారంలో పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది.

## దైద వెంకన్నకు సన్మానం



**విశ్వంభర, కొత్తగూడెం:** కొత్తగూడెం కు చెందిన ఎస్కే గౌస్( ఐఎన్టి యుసి ఛీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సింగరేణి లో ఆర్ .సి. హెచ్. పి. నందు జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ అయిన సందర్భముగా పదవీ విరమణ మహోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి మహబూబాబాద్ జిల్లా కేంద్రం కు చెందిన హరిత మిత్ర అవార్డు గ్రహీత మొక్కల సంరక్షకులు దైద వెంకన్నను అతిథిగా పిలిచి ఘనంగా సన్మానించారు.

## నేరాల వెనకున్న పెద్దతిమింగలాలనూ వదలం: పీతల సుజాత



**విశ్వంభర,అమరావతి:** వైసీపీ పాలనలో మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డ ముఠాని వదిలిపెట్టేది లేదని తెదేపా నేత, మాజీ మంత్రి పీతల సుజాత హెచ్చరించారు. దీని వెనకున్న పెద్ద తిమింగలాలపైనా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైకాపా ఆగడాలు ఇకపై సాగవన్నారు. " ప్యాలెస్‌లో కూర్చున్న పెద్ద తిమింగలాలను వదిలిపెట్టేది లేదు. వైకాపా పాలనలో మహిళలపై 2,04,414 నేరాలు జరిగాయి. నేరస్తుల్ని వదిలిపెట్టే ప్రసక్తేలేదు" అని ఆమె స్పష్టం చేశారు.

# హైదరాబాద్ వేదికగా లోక్ మంథన్-2024

## నవంబరు 21 నుంచి 24 వరకు నిర్వహణ ◆ ఆతిథ్యం ఇవ్వనున్న శిల్పకళావేదిక







**ఈ దేశంలో "నగరవాసులు, వనవాసులు, పల్లె వాసులు" అంటూ మూడు రకాల ప్రజలు లేరు. ఉన్నదల్లా ఒకే రకం "భారతీయ వాసులు" మాత్రమే. ఇది ఎలా నిర్ధారిస్తాం? ఇదే పనిని - 'లోక్ మంథన్ ' మరోసారి చేయబోతోంది. భారత జాతిని - అజ్ఞానంతో వేర్వేరుగా విడదీసి చూసే సంస్కృతినుంచి, "అందరం ఒకటే జాతి, అందరికీ దేశమే తొలి ప్రాధాన్యతా అంశం" అన్న విశ్వాసం దిశగా నడిపించే శంఖారావంతో హైదరాబాదులో జరగబోతోంది ఈ 'లోక్ మంథన్.'**

ఇలాంటి ఆలోచనా పరులందరినీ ఒక్క వేదికమీదికి తీసుకువచ్చేందుకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. లోక్ మంథన్-2024 పేరుతో ఏర్పాటయ్యే భారీ సదస్సుకు విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబరు 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ పక్కనున్న శిల్పకళావేదిక దీనికి ఆతిథ్యం ఇవ్వబోతోంది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్‌జీ, మాతా అమృతానందమయి.. మరెంతో మంది ప్రముఖులు ఈ సమావేశాలకు హాజరై మార్గదర్శనం చేయనున్నారు. దేశంలో ఇప్పటికే మూడు ప్రధాన నగరాల్లో లోక్ మంథన్ సదస్సులు జరగ్గా.. భాగ్యనగర్‌లో జరగబోయేది నాలుగోది. ప్రజ్ఞాభారతి, ప్రజ్ఞా ప్రవాహ్ ల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా లోక్ మంథన్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం ఇది.

### ఏమిటీ లోక్ మంథన్?

వలస వాదులు మన జీవన విధానాన్ని , స్థానికమైన పద్ధతులను తారుమారు చేశారు. నగర వాసులు, గ్రామవాసులు, వనవాసులు అంటూ మనమధ్య తేడాలను సృష్టించారు. తమ పరిపాలనకు అనుగుణంగా మన సంపన్న దేశంపై పట్టు సాధించడానికి నాగరికులు-అనాగరికులు, గిరిజనులు, మైదాన ప్రాంతాల వారు, పట్టణ ప్రాంతాలవారు- గ్రామాలలో ఉండేవారు అనే భావనను సృష్టించారు. ఎన్నో తేడాలు ఉన్న జానపద సంప్రదాయాలు ఉన్నప్పటికీ ప్రజలలో ఉన్న లోకం అనే భావన అనాదిగా ఐకమత్యానికి తోడ్పడింది. ఈ పురాతన దేశంలో అనాదిగా వస్తున్న ఈ ఐకమత్య భావనను ఒక పద్ధతి ప్రకారం నాశనం చేశారు.

అందరినీ కలుపుకొనిపోయే లోకం అనే భావన అంటే రకరకాల రూపాలలో ఉన్న జానపదుల సంప్రదాయాలే అనే విధంగా మభ్యపెట్టారు. వేర్పాటు ధోరణిని ప్రభావితం చేశారు. ఈ రకమైన తప్పుడు విభజనను, వలసవాద భావాలను భారతీయుల మనస్సులలో నుంచి తొలగించి , సరయిన కథనాలను ప్రచారం చేసి లోక సంప్రదాయాలను తిరిగి నెలకొల్పడమే లోక్ మంథన్ ఉద్దేశం. ఇది భారతీయులలో ఉన్న ముఖ్యమైన ఐకమత్య భావనను చాటిచెప్తుంది. భారతీయుల లోక సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలిపేందుకు, వాటి గురించి చైతన్యం కలిగించేందుకు లోక్ మంథన్ ప్రేరణ ఇస్తుంది. దేశంలో రకరకాల జీవన విధానాలు కలిగిన వారి మధ్య సుహృద్భావాన్ని పెంపొందిస్తూ కృత్రిమమైన భేదభావాలను నిర్మూలించడానికి కృషి చేస్తుంది. దేశమే ముఖ్యం అని ఆలోచించే వారికి, దేశం కోసం పనిచేసే వారికి వేదిక లోక్ మంథన్. ప్రసిద్ధి చెందిన విద్యావేత్తలు, ఆలోచనాపరులు, తత్వవేత్తలు, పరిశోధకులు,కళాకారులు, కార్యకర్తలు చర్చించడానికి, వారిని పనిలో నిమగ్నం చేయడానికి అవసరమైన వేదికను ఇది సమకూరుస్తుంది. రాజకీయాలు, మీడియా, కళలు, విద్యావేత్తల ద్వారా ప్రచారం అవుతున్న వేర్పాటు వాద కథనాల పట్ల సరయిన అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతీయులలో ఐకమత్యాన్ని పెంపొందించే కొత్త ఆలోచనలను సులభతరం చేసే లక్ష్యంతో కూడా పనిచేస్తుంది.

### ఏయే అంశాలపై దృష్టి పెట్టింది?

**కుటుంబ వ్యవస్థ...ప్రాధాన్యం:** లోక్‌మంథన్ ప్రధానంగా కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తుంది. బలమైన భారతీయ కుటుంబ వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న విలువలు, ప్రవర్తనా నియమావళిని ప్రచారం చేస్తుంది. వాటి ఆచరణకు పాటుపడతుంది.

**సామాజిక సమరసత:** విభిన్న భౌగోళిక ప్రాంతాలలోని సముదాయాల ఆలోచనలు, ఆచరణ, సంప్రదాయాలలో సారూప్యతను గుర్తించి సామాజిక సమరసరతకు కృషి చేస్తుంది.




**పర్యావరణ పరిరక్షణ:** స్థానిక పర్యావరణ శాస్త్ర అధ్యయనం, నీరు, చెట్లు, వ్యవసాయం, పశువులతో సహా సహజ వనరుల సంరక్షణపై దృష్టి పెడుతుంది.

**స్వదేశీ ఆచరణ:** భారత దేశ వాతావరణానికి, పర్యావరణానికి, సామాజిక సాంస్కృతిక గతి శీలతకు అనుగుణంగా దేశం ముఖ్యం అనే జీవనశైలిని పెంపొందిస్తుంది.

**నాగరికుల కర్తవ్యాలు:** భారతీయులందరికీ సమాజం, దేశం పట్ల ఉండాల్సిన పౌరబాధ్యతలను, విధులను తెలియజెప్తుంది.

### ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక..

లక్ష్యాల సాధన కోసం లోక్‌మంథన్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. విద్యావేత్తలు , మేధావులతో చర్చా కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించనుంది. అలాగ విభిన్న కళారూపాలు, ఆహార పదార్థాల ప్రదర్శనలు ఏర్పాటు చేయనుంది. స్థానికంగా ఉన్న బతుకమ్మ లాంటి పండుగలను సామాజికంగా నిర్వహిస్తుంది. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించింది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

### ఎక్కడెక్కడ సదస్సులు జరిగాయి?

దేశంలో ఇప్పటివరకు మూడు చోట్ల లోక్ మంథన్ సదస్సులు జరిగాయి. 2016 నవంబరు 12 నుంచి 14 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో తొలిసదస్సు జరిగింది. దేశం, కాలం, పరిస్థితులపై ప్రధానంగా ఇందులో చర్చ జరిగింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు దీనిలో పాల్గొని మార్గదర్శనం చేశారు. 2018 సెప్టెంబరు 27 నుంచి 30 వరకు బిహార్‌లోని రాంచీలో రెండో సదస్సు జరిగింది. జన-గణ-మన దేశీయతలపై ఇందులో చర్చ జరిగింది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు ఇందులో పాల్గొన్నారు. 2022 సెప్టెంబరు 21 నుంచి 24 వరకు అసోం లోని గౌహతిలో మూడో లోక్ మంథన్ జరిగింది. లోక సంప్రదాయాలు, జాతీయ స్వీయ భావన, సాంస్కృతిక స్పృహను చెక్కు చెదరకుండా ఎలా ఉండాలనేదానిపై ఇందులో ప్రధానంగా చర్చించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దీనికి హాజరయ్యారు.

### హైదరాబాద్ లోక్ మంథన్‌కు శ్రీకారం

లోక్ మంథన్-2024లో భాగంగా దేశమే ముఖ్యం అని ఆలోచించే కార్యకర్తల సమావేశం ఆగస్టు 10వ తేదీన భాగ్యనగర్ జలవిహార్‌లో ప్రారంభమైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దీనికి హాజరయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వీడియో ద్వారా సభికులనుద్దేశించి మాట్లాడారు. ప్రజ్ఞా భారతి రాష్ట్ర అధ్యక్షుడు టి.హనుమాన్ చౌదరి, ప్రజ్ఞా ప్రవాహ్ జాతీయ సంయోజకులు నందకుమార్, జానపద కళాకారులు దాసరి కొండప్ప, స్వామిని సువిద్యామృత ప్రాణ, ఆధ్యాత్మక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తదితులు పాల్గొన్నారు. లోక్ మంథన్-2024 స్వాగత సమితికి గౌరవాధ్యక్షులుగా ఉండేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తమ అంగీకారాన్ని తెలిపారు. ప్రజ్ఞాభారతి రాష్ట్ర అధ్యక్షుడు టి.హనుమాన్ చౌదరి కార్యనిర్వాహక అధ్యక్షులుగా, వనవాసీ కల్యాణ ఆశ్రమం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.కె.నాగు ఉపాధ్యక్షులుగా, ప్రజ్ఞా ప్రవాహ్ జాతీయ సంయోజకులు జె.నందకుమార్ జాతీయ కార్యదర్శిగా, ప్రజ్ఞాభారతి కార్యదర్శి ఎం.రఘు సంయుక్త కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పూర్వ ఐఏఎస్ అధికారి ఉమామహేశ్వర రావు, ఎంసీఎన్‌యూ పూర్వ ఉపకులపతి ప్రొ.కుఠియాల, ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యనిర్వాహక అధ్యక్షులు విజయభారతి సాయని స్వాగత సమితి ఉపాధ్యక్షులు ఉన్నారు. ఇంకా అనేక మంది ప్రముఖులు లోక్‌మంథన్ ఆహ్వాన సమితిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

### ప్రజ్ఞా ప్రవాహ్..ప్రజ్ఞా భారతి

భారతదేశపు సంస్కృతి, మేధోపరమైన వారసత్వ సంపదను లోతుగా అవగాహన చేసుకోవడానికి, అభివృద్ధి చేయడానికి ప్రజ్ఞాప్రవాహ్ సంస్థ పనిచేస్తోంది. తత్వ శాస్త్రం, కళలు, సాహిత్యం, సమాజశాస్త్రాలు, భారతీయ సంస్కృతికి చెందిన వివిధ విషయాల గురించి చర్చించడానికి కృషి చేస్తుంది. విద్యావేత్తలు, మేధావులు, ఆలోచనాపరులు, కార్యకర్తలు, సాంస్కృతికరంగంలో ఔచిత్యం కలిగిన విషయాలను చర్చించే వారికి వేదికగా సేవలు అందిస్తోంది. కాగా ప్రజ్ఞా భారతి..ప్రజ్ఞా ప్రవాహ్ సంస్థలో ఒక భాగంగా తెలంగాణలో పనిచేస్తోంది. ఇది భారతీయ సంస్కృతిపట్ల నిబద్ధత కలిగేలా చేయడానికి, మేధోపరంగా విశ్లేషించడానికి, సంస్కృతిపట్ల గౌరవభావం పెంపొదించడానికి అంకితమైంది. గత మూడు దశాబ్దాలుగా సేవలందిస్తోంది. గోష్టులు, సెమినార్లు, సమావేశాల వంటి కార్యక్రమాల ద్వారా దేశ నిర్మాణానికి అవసరమైన ప్రసంగాలను సమృద్ధి చేసే జాతీయ వాదులకు వేదికగా నిలుస్తోంది. లోక్ మంథన్-2024 నిర్వహణ బాధ్యతలను ఈ సంస్థలు భుజానికెత్తుకోగా సంస్కార భారతి సహా భావ సారూప్యత కలిగిన మరెన్నో సంస్థలు తోడ్పాటునందిస్తున్నాయి. హాజరు కాదలచిన వారు లోక్ మంథన్ వెబ్ సైట్ %షషష.శ్రీశినెఝీఖత్త్పుఖఅ.శీతీప్ర/తీవస్త్రఱం-వతీ% లో రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. భాగ్యనగర్ మినహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భాగ్యనగర్ కీర్తి ప్రతిష్ఠలను దేశమంతటా చాటేలా లోక్ మంథన్-2024ను విజయవంతం చేయాలని కోరుతున్నారు.



- రావికంటి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్
99088 92067

---

**ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు**

# ఈసారైనా నామినేటెడ్ పదవి తీసుకుంటారా?





**విశ్వంభర, అమరావతి:** కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్న నేపథ్యంలో మూడు పార్టీలకు సంబంధించిన నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో ఎట్టకేలకు ఈరోజు 62 మందితో కూడిన రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితా విడుదలైంది. విడుదలైన వెంటనే తమ పేరు చూసుకునే ప్రయత్నాల్లో ఉన్న రాజకీయ నాయకులందరికీ రెండో నెంబర్ లో ఉన్న పేరు చూసి ఆశ్చర్యాన్ని కలిగించింది. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేరు అది. అదేంటి ఈయన రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తి కదా అని ఆలోచిస్తూనే ఇంతకీ ఏ పదవి ఇచ్చారు అంటూ పోర్ట్ ఫోలియో చూసే ప్రయత్నం చేశారు. అయితే దాన్ని చూసి మరికొంత ఆశ్చర్యానికి గురయ్యారు. విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే ప్రభుత్వ సలహాదారు గా ఆ పదవి ఉంది. దీంతో అందరూ ఒక్కసారిగా ఊపిరి పిలుచుకున్నారు ఆ పదవి వల్ల తమ అవకాశాలు పోవని, తమకు కలిగే నష్టమేమీ లేదంటూ ఒక వైపు, మరొకవైపు చాగంటి కోటేశ్వరావు లాంటి సమాజాన్ని విపరీతంగా ప్రభావితం చేసే వ్యక్తులకి పదవి ఇవ్వడం ద్వారా మంచి సందేశం వెళ్లిందన్న సంతోషం ఒకవైపు అలా ముందుకు సాగారు రాజకీయ నాయకులు.

## అందరిలోనూ సర్వత్రా ఆసక్తి

చాగంటి కోటేశ్వరరావు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త. తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఈయన తన ప్రవచనాలతో ఎంతో మందిని మంత్రమగ్దులను చేస్తారు. చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడతారు. యూత్ ఎలాంటి డైరెక్షన్‌లో వెళ్లకూడదు.. ఏ పని చేస్తే మేలు జరుగుతుంది. తల్లి దండ్రులు తమ పిల్లలకు ఎలాంటి బుద్ధులు నేర్పించాలి. చదువుకునే స్టూడెంట్లు చదువుపై ఎలా ఫోకస్ చేయాలి సహా ఇతర ఎన్నో వాటిపై చెప్తుంటారు. వాటిని వీక్షించి పరవశించిపోయేవారెందరో ఉన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలకు ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అలాంటి ఆధ్యాత్మిక పవచనకర్తకు ఏపీ ప్రభుత్వం కీలకమైన పదవి కట్టబెట్టింది.

### చాగంటి కోటేశ్వరరావు పదవి తీసుకుంటారా?

ఏపీ రాష్ట్ర నైతిక విలువల సలహాదారు పదవిని ఆయన తీసుకుంటారా? లేదా అనేది అందరిలోనూ క్వశ్చన్ మార్క్. ఎందుకంటే 2016లో చంద్రబాబు హయాంలో కేబినెట్ హూదాతో చాగంటిని ఏపీ ప్రభుత్వ సలహాదారుగా నియమించారు.. 2014 %-% 19 మధ్య కాలంలో ఆనాటి టిడిపి ప్రభుత్వం చాగంటిని ఈ బాధ్యతలు తీసుకోవాలని కోరింది. కానీ చాగంటి కోటేశ్వరరావు ఆ పదవిని తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏం చెప్పినా చేస్తాను కానీ తనకు ప్రత్యేకంగా పదవేమీ వద్దంటూ సున్నితంగా తిరస్కరించారు. అదే విషయాన్ని ప్రభుత్వానికి కూడా సవినయంగా తెలియజేశారు. తనకు పదవులు పట్ల ఏమాత్రం ఆసక్తి లేదని, అందులోనూ ప్రభుత్వం ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో వెనుకంజ వేయనంటూ అప్పట్లో చెప్పారు చాగంటి . ఆ తర్వాత 2023 లో అప్పటి సీఎం జగన్.. ఆయన్ని టీటీడీ ధార్మిక సలహాదారు పదవిలో నియమించారు. అప్పుడు కూడా చాగంటి ఆ పదవిని నిరాకరించారు. దీంతో ఇప్పుడు ప్రకటించిన పోస్ట్‌ని చాగంటి చేపడతారా? లేదా అనేది అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### చాగంటి కోటేశ్వరరావు గురించి క్లుప్తంగా..

చాగంటి కోటేశ్వరరావుఒక ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త. ఈయన తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వాస్తవ్యులు. ఈయన తండ్రి చాగంటి సుందర శివరావు, తల్లి సుశీలమ్మ. 1959 జూలై 14వ తేదిన ఈయన జన్మించారు. కోటేశ్వరరావు సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరిగారు. వీరికి ఇద్దరు పిల్లలుబీ ఈయన ధారణ శక్తి, జ్ఞాపకశక్తి చెప్పుకోదగ్గవి. మానవ ధర్మం మీద ఆసక్తితో అష్టాదశ పురాణములను అధ్యయనము చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ, భక్త జన మనసులను దోచుకున్నారు. ఉపన్యాస చక్రవర్తి, శారదా జ్ఞాన పుత్ర, ఇత్యాది బిరుదులను అందుకున్నారు.

మండల దీక్షతో 42 రోజుల పాటు సంపూర్ణ రామాయణమును, 42 రోజుల పాటు భాగవతాన్ని, 30 రోజుల పాటు శివ మహా పురాణాన్ని,, 40 రోజుల పాటు శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రమును అనర్గళంగా ప్రవచించి పండిత, పామరుల మనసులు దోచుకొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నఎంతో మంది తెలుగు వారు ఆయ ప్రవచనాలకు అభిమానులుగాన్నారు. అతను ధారణాశక్తి గొప్పది. ఒకసారి శంకరుల సౌందర్యలహరి తిరగేస్తే అది మొత్తం అతను మదిలో నిలిచిపోతుంది. ఎక్కడ ఏ పేజీలో ఏమున్నదో చెప్పగలరు.

అప్పుడపుడు కాకినాడలో అయ్యప్ప దేవాలయంలో సాయంత్రం కూర్చుని భక్తులముందు భారతభాగవత ప్రవచనాలు ఇచ్చేవారు. ఏనాడూ డబ్బు పుచ్చుకునే వారు కారు. అతను స్వరలాలిత్యం, ధారణ, విజ్ఞానం, విశదీకరణ భక్తులను ఆకర్షించాయి. అభిమానులు పెరిగారు.

పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో .. ఎక్కడో ఒకచోట చాగంటి వారిని కలిశారు. "మీ గురించి ఎంతో విన్నాను. మీ ఆధ్యాత్మిక పరిజ్ఞానం అసాధారణం. మీ ప్రవచనాలు నాకు బాగా నచ్చాయి. ముఖ్యంగా మీ పాండితీప్రకర్ష అమోఘం. ఇప్పుడు నేను మంచి స్థితిలో ఉన్నాను. ఏమైనా అడగండి. చేసిపెడతాను" అన్నారట పీవీ. చాగంటి వారు నవ్వేసి "మీకూ, నాకు ఇవ్వాల్సింది ఆ పరమాత్మే తప్ప మరెవరూ కారు. మీ సహృదయానికి కృతజ్ఞతలు. నాకేమీ ఆశలు లేవు." అని నమస్కరించి బయటకు వెళ్లిపోయారట.

# భారత పరిశ్రమలకు రతన్ టాటా ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారు: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** టాటా సంస్థల అధినేత రతన్ టాటా మృతిచెంది నెల రోజులు కావస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ.. ఓ ఆర్టికల్ రాశారు. దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటాకు తన వ్యాసంతో నివాళి అర్పించారు. సమాజంలోని అన్ని రంగాలు రతన్ టాటా లేని లోటును ఫీలవుతున్నాయన్నారు. సీజనల్ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రొఫెషనల్స్ ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం, దాతృత్వం పట్ల శ్రద్ధ ఉన్నవాళ్లు కూడా రతన్ మృతితో విషాదంలో ఉన్నట్లు రాశారు. ఈ దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా రతన్ మరణం అందర్నీ కలిచివేసిందన్నారు. యువతకు రతన్ ప్రేరణగా నిలిచారన్నారు. భారతీయ సంప్రదాయాలను ఎందరికోపరిచయం చేశారని,సమగ్రతకు.. సేవకు ఆయన కట్టుబడి ఉన్నట్లు మోదీ తెలిపారు. రతన్ నాయకత్వంలో టాటా గ్రూపు కొత్త తీరాలకు వెళ్లిందన్నారు. విశ్వాసం, గౌరవం, నమ్మకాన్ని ఆ సంస్థ పొందిందన్నారు. సాధించిన ఘనతల పట్ల ఆయన వినయంగా ఉండేవారన్నారు. మరొకరి ఆశయాలకు మద్దతు ఇవ్వడం ఆయన ఉత్తమ లక్షణమన్నారు. భారత్‌లో స్టార్టప్ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంతో రతన్ టాటా మెంటర్‌గా వ్యవహరించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. స్టార్టప్‌లకు ఊతం ఇవ్వడం వల్ల.. ఆవిష్కరణలు, పారిశ్రామీకంలో కొత్త సంస్కృతి ఏర్పడిందన్నారు. రతన్ చూపిన పాజిటివ్ సంకేతం .. రాబోయే దశాబ్దాల్లో ఇండియాను మరింత తీర్చిదిద్దుతుందని ఆశిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.ప్రపంచస్థాయికి తగ్గట్లుగా బెంచ్‌మార్క్‌లను సెట్ చేయాలని భారతీయ వ్యాపారవేత్తలను రతన్ ప్రోత్సహించినట్లు ప్రధాని తన వ్యాసంలో వెల్లడించారు. ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించడంలో.. రతన్ విజన్.. భారత భవిష్యత్తు నాయకులకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుందని ఆశించారు. బోర్డురూమ్‌లకో లేక మనుషులకు సాయం చేయడమే కాదు.. ఆయన గొప్ప జంతు ప్రేమికుడు అని కూడా తెలిపారు. రతన్ తన శునకానికి చెందిన ఫోటోను ఎప్పుడూ అప్‌డేట్ చేసేవారన్నారు. గొప్ప నాయకుడిని తన సక్సెస్‌ను బట్టి అంచనా వేయడం కాదు అని, ఆ వ్యక్తి నిస్సహాయులను ఆదుకున్న సామర్థ్యాన్ని బట్టి అంచనా వేస్తారన్నారు.అత్యంత క్లిష్ట సమయాల్లో రతన్ టాటా తనలోని దేశభక్తిని చాటారన్నారు. కోట్లాది మంది భారతీయుల ఆ దేశభక్తిని ప్రత్యక్షంగా తిలకించినట్లు చెప్పారు. ముంబై దాడుల తర్వాత తాజ్ హోటల్ రీఓపెన్‌చేసిన తీరుదేశానికి మేలుకొలుపు వంటిదన్నారు. భారత్ ఐక్యంగా ఉన్నదని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ప్రదర్శించినట్లు మోదీ తెలిపారు.

రతన్ వ్యక్తిగతంగా తనకు ఎన్నో ఏళ్లుగా తెలుసు అని, గుజరాత్‌లో కలిసి పనిచేశామన్నారు. అక్కడ ఆయన ఎన్నో ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం స్పెయిన్ ప్రెసిడెంట్‌తో కలిసి వడోదరలో సీ-295 విమాన తయారీ కాంప్లెక్స్‌ను ఓపెన్ చేసినట్లు తెలిపారు. రతన్ టాటానే ఆ కాంప్లెక్స్ గురించి ప్లాన్ వేశారన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ఓపెనింగ్ సమయంలో రతన్ లేకపోవడం శోచనీయమన్నారు.రతన్ టాటా తనకు రెగ్యులర్‌గా లేఖలు రాసేవారన్నారు. ప్రభుత్వ పాలన అయినా లేక శుభాకాంక్షల సందేశాలైనా.. ఆయన క్రమంగా లేఖలు రాసేవారని ప్రధాని తెలిపారు. తమ సర్కారు చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌కు రతన్ టాటా మంచి సపోర్టు ఇచ్చినట్లు తెలిపారు. దేశ ప్రగతిలో పరిశుభ్రత, స్వచ్ఛత, శానిటేషన్ చాలా కీలకమైనవని రతన్ నమ్మేవారన్నారు. హెల్త్‌కేర్‌అంశంలోనూ ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. క్యాన్సర్‌పై పోరాటంలో భాగంగా అస్సాంలో అనేక ఆస్పత్రులను ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తెవాలన్న ఆశయం రతన్‌లో ఉన్నట్లు తెలిపారు. భారత్‌ను ఉత్తమ ప్రదేశంగా తీర్చిదిద్దిన ఆయన పట్ల రాబోయే తరాలు కృతజ్ఞతతో ఉంటారన్నారు.

# అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీస్తాం: కేంద్ర హోం అమిత్ షా



**రాంచీ:** అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఝార్ఖండ్‌లోని పాలము ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చాసంకీర్ణ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయ సర్కారుగా మారిందని.. ఇకనైనా ప్రజలు వారిని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చొరబాటుదారులను అరికట్టడం కేవలం మోదీ నాయకత్వంలోని భాజపా వల్లే సాధ్యమవుతోందన్నారు. ఓబీసీ కోటాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మహారాష్ట్రలోని కొన్ని వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని.. అయితే మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకం అనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలని అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీ తన వెంట ఎప్పుడూ రాజ్యాంగాన్ని తీసుకెళ్లి, ప్రచారాల్లో దానిని చూపిస్తుండటాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ నేత నకిలీ రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ దానిని అపహాస్యం చేస్తున్నారని అమిత్ షా దుయ్యబట్టారు.జమ్మూకశ్మీర్ ఎన్నటికీ భారత్‌లో అంతర్భాగమేనని.. ఎన్ని తరాలు వచ్చి అడిగినా ఆర్టికల్ 370ని పునరుద్ధరించే అవకాశం లేదని షా పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పెరుగుతున్న అక్రమ చొరబాటుదారుల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అది తమ పొలిటికల్ అజెండా అని సీఎం హేమంత్ సోరెన్ విమర్శిస్తున్నారని అన్నారు. సోరెన్ వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.

# మార్నింగ్ వాక్ అలవాటును వదులుకున్న తదుపరి సీజేఐ..!



**ఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఈనెల 10న పదవీ విరమణ చేయనున్న విషయం తెలిసిందే. తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈనెల 11న బాధ్యతలు చేపట్టనున్నారు. ఈక్రమంలో ఆయనకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జస్టిస్ ఖన్నా ప్రతిరోజు ఎంతో ఇష్టంగా చేసే మార్నింగ్ వాక్‌ను ఇకపై పూర్తిగా మానేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. లోధి గార్డెన్ వద్ద ప్రతిరోజు జస్టిస్ ఖన్నా ఒంటరిగా కొన్ని కిలోమీటర్ల వరకు మార్నింగ్ వాక్ చేస్తారు. ఈక్రమంలో తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికవడంతో ఆయనను ఎక్కువమంది గుర్తుపట్టే అవకాశాలున్నాయి. దీంతో బద్రతా సిబ్బందిని వెంట పెట్టుకొని వాకింగ్ చేయాల్సి ఉంటుంది. అది ఆయనకు అంతగా ఇష్టం లేకపోవడంతో మార్నింగ్ వాక్‌ను పూర్తిగా మానేయాలని నిర్ణయించు కున్నారట. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నా...చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన ధర్మాసనాల్లో కీలక భూమిక వహించారు. ఎన్నికల బాండ్లు, 370వ రాజ్యాంగ అధికరణం రద్దు, ఈవీయంల వినియోగంపై సమర్థన వంటి తీర్పులను ఇచ్చిన ధర్మాసనాల్లో జస్టిస్ ఖన్నా భాగస్వామిగా ఉన్నారు. ఢిల్లీలోని ప్రముఖ కుటుంబానికి చెందిన జస్టిస్ ఖన్నా...దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 1960 మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నాఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు అందుకున్నారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ ఖన్నా ప్రధాన న్యాయమూర్తిగా ఆరు నెలలు పదవీ కాలంలో ఉంటారు.

# ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలను వేటాడటంలో బీజేపీ దిట్ట: ఝార్ఖండ్ సీఎం



**రాంచీ:** ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలను వేటాడటంలో బీజేపీ దిట్ట అని ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అన్నారు. అలా చేసి ఆ పార్టీ అనేక ప్రభుత్వాలను పడగొట్టిందని ఆరోపించారు. బిహార్ సీఎం నీతీశ్‌కుమార్‌ను ఎన్డీఏలో చేర్చుకోవడం దానికి ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రాలపై జీఎస్టీ విధించి, వారికి ఆదాయ వనరులు లేకుండా చేసి.. పేద రాష్ట్రాల నడ్డి విరిచిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఝార్ఖండ్ రాష్ట్రాన్ని బీజేపీ రెండు దశాబ్దాలకు సరిపడా పిండేసిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి భాజపా పలు ప్రయత్నాలు చేసిందని, అవి బెడిసికొట్టడంతో తనపై కుట్ర పన్ని జైలుకు పంపించిందని సోరెన్ ఆరోపించారు. భాజపా చేసే 'విభజన రాజకీయాలు' రాష్ట్ర ప్రగతిని ఆపలేవని అన్నారు. హిందూ-ముస్లిం పోలరైజేషన్, మత విద్వేషాలు, విభజన రాజకీయాలు మినహా భాజపాకు మరో అజెండా లేదని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి పదేపదే లేఖలు రాసినా కేంద్రం నుంచి అందాల్సిన రూ. 1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలు చెల్లించలేదని.. వాటిని ఎలా పొందాలో తమకు తెలుసని ఆయన పేర్కొన్నారు. మణిపూర్‌లో కంటే ఝార్ఖండ్‌లో గిరిజనుల పరిస్థితి దారుణంగా ఉందని ప్రధాని చెప్పే మాటలే వారి కుట్రపూరిత ఆలోచనలను తెలియజేస్తున్నాయన్నారు. తమ డబుల్ ఇంజిన్ రాష్ట్రంలో ఏం జరుగుతోందో కూడా ప్రధాని గమనించట్లేదని విమర్శించారు. ఒక గిరిజన సీఎం ఝార్ఖండ్ ముఖ్య మంత్రిగా ఉండడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని సోరెన్ మండి పడ్డారు. రాష్ట్రంలో నెలలతరబడి ఎన్నికల ప్రచారాలు చేస్తున్న సీఎంలు వారి రాష్ట్రాల పరిస్థితులను ఎందుకు పట్టించుకోవట్లేదు అని ఆయన ప్రశ్నించారు. ఝార్ఖండ్‌లో చొరబాటుదారుల గురించి మాట్లాడే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమ సొంత పార్టీ నేతలు చేసే అవినీతిని, అక్రమాలను ఎందుకు విస్మరిస్తున్నారని సోరెన్ ప్రశ్నించారు. వ్యాపారుల పార్టీగా పేరు పొందిన బీజేపీ సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను నియంత్రిస్తోందని మండిపడ్డారు. గుజరాత్‌లోని ఓడరేవుల్లో భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడంపై ప్రధాని ఎందుకు స్పందించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలుచేయాల్సిన అవసరం లేదని అన్నారు.81 అసెంబ్లీ స్థానాలున్న ఝార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13న తొలివిడత, నవంబర్ 20న రెండోవిడత పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# ఆర్మీ అధికారి టార్చర్ తర్వాత ఉగ్రవాదిగా మారాలనుకున్నా: ఎన్సీ ఎమ్మెల్యే



**శ్రీనగర్:** ఆర్మీ అధికారి చిత్రహింసల తర్వాత తాను ఉగ్రవాదిగా మారాలనుకున్నానని జమ్మూకశ్మీర్‌లో అధికారంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఎమ్మెల్యే తెలిపారు. అయితే ఒక సీనియర్ అధికారి చర్య వల్ల వ్యవస్థపై తనకు నమ్మకం కలిగిందని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎన్సీ ఎమ్మెల్యే కైసర్ జంషైద్ లోన్ సభలో మాట్లాడారు. చిన్నప్పుడు తాను నివసించే ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి గురించి తనతో సహా 32 మంది యువకులను ఆర్మీ అధికారి ప్రశ్నించారని తెలిపారు. టెర్రరిస్ట్‌లో చేరిన యువకుడు తెలుసా? అని ఆ అధికారి తనను అడిగితే తెలుసని చెప్పానన్నారు. దీంతో ఆ మిలిటరీ అధికారి తనను కొట్టినట్లు చెప్పారు.కాగా, ఉగ్రదాడిలో ఆ యువకుడు పాల్గొన్నాడా? అని ఆర్మీ అధికారి అడిగారని, లేదని చెప్పిన తనను మళ్లీ కొట్టాడని ఎన్సీ ఎమ్మెల్యే కైసర్ జంషైద్ లోన్ తెలిపారు. ఇంతలో ఒక సీరియర్ అధికారి అక్కడకు వచ్చి తనతో మాట్లాడారని అన్నారు. 'నువ్వు జీవితంలో ఏమి కావాలనుకుంటున్నావు?'అని నన్ను అడిగారు. నేను మిలిటెంట్‌గా ఉండాలనుకుంటున్నానని చెప్పా. ఆయన నన్ను కారణం అడిగారు. ఆర్మీ అధికారి చేతిలో నేను అనుభవించిన చిత్రహింసల గురించి చెప్పా' అని అన్నారు.మరోవైపు జూనియర్ ఆర్మీ అధికారిని ఆ సీనియర్ అధికారి బహిరంగంగా మందలించారని ఎమ్మెల్యే కైసర్ జంషైద్ లోన్ తెలిపారు. ఆయన చర్య వల్ల వ్యవస్థపై తనకు నమ్మకం కుదిరిందని చెప్పారు. సమస్యలను చర్చల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో ఈ సంఘటన నిరూపించిందని అన్నారు. అయితే ఆర్మీ వల్ల చిత్రహింసలకు గురైన 32 మంది యువకుల్లో 27 మంది ఆ తర్వాత మిలిటెన్సీలో చేరినట్లు తనకు తెలిసిందన్నారు.

# ఉద్ధవ్ థాకరే వెళ్లగొట్టాడు.. ఏక్‌నాథ్ షిండే కండువా కప్పాడు..



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మరో 10 రోజుల సమయం మాత్రమే ఉన్నది. ఎన్నికల కోలాహలం మొదలైనప్పటి నుంచి నేతలు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారారు. ఆ తర్వాత నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఎన్నికలకు కేవలం 10 రోజుల సమయం ఉండగా.. ఇప్పుడు కూడా ఓ నాయకుడు ఒక పార్టీ మరో పార్టీలోకి మారారు.పార్టీకి ప్రతికూలంగా వ్యవహరిస్తున్నాడన్న కారణంగా శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే () పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ఇటీవల రూపేశ్ మాత్రే అనే నాయకుడిపై బహిష్కరణ వేటు వేశారు. దాంతో ఆయన ఇప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనలో చేరారు. ఏక్‌నాథ్ షిండే ఆయనకు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాగా, మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రధాన పోటీ అధికార మహాయుతిలోని మూడు పార్టీలకు, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీలోని మూడు పార్టీలకు మధ్యనే ఉన్నది.

# లక్నో వెళ్తున్న వందే భారత్ రైలుపై రాళ్ల దాడి.. యువకుడు అరెస్ట్



**లక్నో:** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ నుంచి ఉత్తరప్రదేశ్ లక్నోకు వెళ్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. 22546 నంబర్ గల వందే భారత్ రైలు గురువారం లక్నోకు వెళ్తోంది. ఈ క్రమంలో లక్సర్ – మొరదాబాద్ రైల్వే సెక్షన్‌లోని ఖరంజా కుతుబ్‌పూర్ గ్రామ సమీపంలోకి రాగానే రైలుపై కొందరు రాళ్లు రువ్వారు. ఈ దాడిలో సీ-6 కోచ్ కిటికీ అద్దానికి పగుళ్లు ఏర్పడ్డాయి . ఈ ఘటనతో రైల్లోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై లోకో పైలట్ మొరదాబాద్‌లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఆర్పీఎఫ్‌కు చెందిన బృందం కుతుబ్‌పూర్ గ్రామానికి చేరుకొని ఘటనపై విచారణ చేటప్టింది. ఈ మేరకు 22 ఏళ్ల సల్మాన్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు.

# అయోధ్య రామాలయ పనులు మరో 3 నెలలు ఆలస్యం



**అయోధ్య:** అయోధ్యలోని రామాలయ నిర్మాణ పనుల్లో మరింత జాప్యం జరుగుతున్నది. ఆలయ శిఖర పనులు మూడు నెలలు ఆలస్యం కానున్నట్లు కన్‌స్ట్రక్షన్ కమిటీ చైర్మెన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. 2025 జూన్‌కు బదులుగా, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు సెప్టెంబర్ 2025 వరకు పూర్తి కానున్నట్లు నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. వర్కర్ల కొరత, బండల పని పూర్తి కాని నేపథ్యంలో.. ఆలయ శిఖర నిరాణంలో ఆలస్యం అవుతున్నట్లు చెప్పారు. సుమారు 200 మంది కార్మికులు షార్టేజ్ ఉన్నట్లు ఆయన తెలిపారు.ఆలయంలోని ఫస్ట్ ఫ్లోర్‌లో పెట్టాల్సిన బండలకు చెందిన పనులు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. నిర్మాణ పనులు ఆలస్యం కావడానికి లేబర్ షార్టేజ్ కారణమన్నారు. ఆలయ పరిసరాల్లోని ఆడిటోరియం, బౌండరీ ఇంకా నిర్మించాల్సి ఉన్నది. శుక్రవారం అయోధ్యలో జరిగిన రామాలయ బిల్డింగ్ కమిటీ మీటింగ్‌లో మిశ్రా పాల్గొన్నారు.టెంపుల్ బౌండరీ కోసం 8.5 లక్షల క్యూబిక్ అడుగుల విస్తీర్ణంలో.. బాన్సి పహర్‌పుర్ స్టోన్స్‌ను వాడనున్నట్లు తెలిపారు. అయితే ఆ రాళ్లు అయోధ్యకు వచ్చాయని, కానీ కార్వింగ్ పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు చెప్పారు. ఫస్ట్ ఫ్లోర్‌లో సరిగా లేని రాళ్లను తీసి, వాటి స్థానంలో మక్రానా స్టోన్స్ వేయనున్నట్లు తెలిపారు.ఆలయంలో పొందుపరిచే అన్ని విగ్రహాలను జైపూర్‌లో తయారు చేస్తున్నారు. డిసెంబర్ వరకు ఈ ప్రక్రియ పూర్తి కానున్నది. రామ్‌లల్లాకు చెందిన మరో రెండు విగ్రహాలను కూడా ఆలయ పరిసరాల్లో పెట్టనున్నారు. ఆలయం నుంచి భక్తులు ఎగ్జిట్ అయ్యే దారిని వెడల్పు చేయనున్నట్లు చెప్పారు.

# ఇదిగో ఈ తుపాకీతో చంపేస్తాం ఎంపీ పప్పూ యాదవ్‌కు మరోసారి బెదిరింపులు



ఢిల్లీ: బీహార్‌లోని పూర్ణియా స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్‌కు నుచంపేస్తామంటూ మరోసారి బెదిరింపులు వచ్చాయి. ఎంపీని చంపడానికి ఇప్పటికే ఆరుగురు వ్యక్తులను పురమాయించామని, ఇదిగో ఈ తుపాకీతోనే అంతమొందిస్తారంటూ బెదిరించారు. ఈమేరకు పప్పూ యాదవ్ పర్సనల్ సెక్రెటరీ మహమ్మద్ సిద్ధిఖ్ ఆలమ్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి వాట్సాప్ మెసేజ్ పంపించాడు. టర్కీలో తయారైన ఓ పిస్తోల్ ఫొటోను కూడా షేర్ చేశాడు. ఎంపీని దీనినితోనే చంపుతారని అందులో పేర్కొన్నాడు. దీంతో ఆయన ఢిల్లీలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నవంబర్ 7న ఉదయం 2.25 నుంచి 9.49 గంటల మధ్య ఈ మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు.కాగా, గతంలో కూడా పప్పూ యాదవ్‌ను చంపుతామంటూ బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. అక్టోబర్ 28న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు బెరింపు కాల్స్ వచ్చాయని ఎంపీ చెప్పారు. చాలాసార్లు ఇలాగే థ్రెట్ కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అయితే ఆ కాల్స్ చేసిన వ్యక్తిని ఢిల్లీకి చెందిన మహేశ్ పాండేగా పోలీసులు గుర్తించారు. అతడిని ఈ నెల 2న అరెస్టు చేశారు.

# హిమాచల్ సీఎంను ఎగతాళి చేసేందుకు.. మాజీ సీఎం సమోసా పార్టీ

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో ప్రస్తుతం సమోసాలపై రాజకీయం జరుగుతున్నది. సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖ్ పాల్గొన్న సీఐడీ కార్యక్రమంలో ఆయనకోసం ఉంచిన సమోసాలు మాయమయ్యాయి.అవిఆయన భద్రతాసిబ్బందికి చేరాయి. దీంతో సీఎం కేవలం టీతో సరిపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సమోసాల మాయం గందరగోళంపై సీఐడీ అంతర్గత దర్యాప్తు చేపట్టింది.కాగా, ఆ రాష్ట్రంలో ప్రతిపక్షమైన బీజేపీ ఈ సమోసా వివాదంపై మండిపడింది. సీఎం కోసం ఉంచిన సమోసాలు కాపాడలేని వారు ప్రజలను ఎలా కాపాడతారని విమర్శించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ సీఎం జైరాం ఠాకూర్ శుక్రవారం బీజేపీ నేతలు, కార్యకర్తలకు సమోసా పార్టీ ఇచ్చారు. సీఎం సుఖ్‌విందర్ సుఖ్‌ను ఎగతాళి చేసేందుకు ఈ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. బీజేపీ నేతలు సమోసాలను తింటూ వాటిని ఆస్వాదిస్తూ కబుర్లు చెప్పుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఝార్ఖండ్ ఎన్నికల వేళ.. సీఎం పీఏ ఇంట్లో సోదాలు

**రాంచీ:** ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సహాయకుడు సునీల్ శ్రీవాత్సవ ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించింది. రాంచీ, జంషెడ్‌పుర్‌లలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 9 ప్రాంతాల్లో ఈ సోదాలు జరుగుతున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.ఈ నెల 13, 20వ తేదీల్లో రెండు దశల్లో ఝార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమికి.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మధ్య రాజకీయంగా వాడీవేడీ వాతావరణం నెలకొంది. ఈ తరుణంలో సీఎం సన్నిహితుడి ఇంట్లో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది.ఇదిలా ఉంటే.. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొద్దినెలల క్రితం సోరెన్ జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. జైలుకు వెళ్లడానికి ముందు ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఆ బాధ్యతలు స్వీకరించారు. మరోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

# భవిష్యత్‌లో ఏ ఇజం ఉండదు.. టూరిజం ఒక్కటే ఉంటుంది : చంద్రబాబు







**విశ్వంభర, విజయవాడ:** భవిష్యత్ అంతా పర్యాటకానిదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. భవిష్యత్‌లో ఏ ఇజం ఉండదు.. టూరిజం ఒక్కటే ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో తొలిసారి పర్యాటకంగా 'సీ ప్లేన్' వినియోగం ఏపీ నుంచి ఆరంభం కానుంది. సీప్లేన్ పర్యాటకాన్ని చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలోని పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు సీఎం చంద్రబాబు, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్రప్రభుత్వ అధికారులు ఇందులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. తక్కువ సమయంలోనే అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి రామ్మోహన్ నాయుడు అని కేంద్ర మంత్రివర్గంలో అత్యంత యువకుడాయన అని కొనియాడారు."సీప్లేన్ ప్రయాణం.. వినూత్న అవకాశమిది. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని, వాటిని ఘాడిలో పెట్టడంతో పాటు అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి గల అవకాశాలను అందిపుచ్చుకుంటున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా పర్యాటకంగానూ, ఆలయాల సందర్శనకు గానూ ముందెన్నడూ లేని విధంగా తొలిసారి సీ ప్లేన్‌ను ప్రారంభించడం గర్వంగా ఉందని అన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి జరగాలి. సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది. సాంకేతికత చాలా వేగంగా పెరుగుతోంది. దానిని పూర్తిగా వినియోగించుకోవాలి. ఐటీ అంటే ఆనాడు ఎగతాళి చేశారు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ చూసినా మనవాళ్లే ఉన్నారు. అనునిత్యం కొత్త ఆలోచనలు చేయాలి. రాబోయే రోజుల్లో విమానాశ్రయాలే కాకుండా సీప్లేన్ ద్వారా రవాణా సౌకర్యం లభిస్తుంది" "రాష్ట్రంలో విధ్వంసమైన వ్యవస్థను బాగుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ఎంత త్వరగా అనుకున్న ప్రగతిని సాధించాలనేదే ఆలోచిస్తున్నాం. గాడితప్పిన పరిపాలనను సరిచేయడమే నా లక్ష్యం. ఏపీలోని రోడ్లను చూసి అవహేళన చేశారు. పోగొట్టిన బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకున్నాం. ప్రజలు గెలవాలి.. ఎన్డీయేకు ఓటేయాలని నేను, పవన్, నరేంద్ర మోదీ కోరాం. ఏపీ ప్రజలు గెలిచారు.. మన రాష్ట్రాన్ని నిలబెట్టారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రజలు ఆక్సిజన్ ఇచ్చారు." అని చంద్రబాబు పేర్కొన్నారు.

### శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న చంద్రబాబు

**శ్రీశైలం:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని ముఖ్యమంత్రి చంద్రబాబు , కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు దర్శించుకున్నారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైలంలోని పాతాళ గంగలో సీ ప్లేన్ డెమో లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ, ఎఫ్ఐసీసీఐ భాగస్వాములుగా ఉన్నారు.శనివారం విజయవాడ పున్నమి ఘాట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు " సీ ప్లేన్" ప్రారంభించిన తర్వాత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి అందులో ప్రయాణించి శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైలం పాతాళగంగలో సురక్షితంగా " సీ ప్లేన్" ల్యాండ్ అయ్యింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. చంద్రబాబు మాట్లాడుతూ సీ ప్లేన్ ప్రయాణం కొంత అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో పర్యాటక రంగం ఆర్థికంగా ప్రధాన పాత్ర పోషించనుందని తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, చరితా రెడ్డి తదితరులు ముఖ్యమంత్రికి ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పాతాళగంగ నుంచి చంద్రబాబు రోప్ వే లో శ్రీశైలం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### సిప్లైన్ ట్రయల్ రన్ విజయవంతం కలెక్టర్ రాజకుమారి గణియా

శ్రీశైలం మల్లన్నను దర్శించుకోవడానికి రానున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నిర్ధారణ కావడంతో సీ ప్లెయిన్ ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. శ్రీశైలం పాతాళ గంగ బోటింగ్ పాయింట్లు సీ ప్లేన్ సేఫ్‌గా నీటిపై ల్యాండ్ అయిందని కలెక్టర్ తెలిపారు. భద్రత ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్‌తో పాటు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, ఏఎస్ఎల్ బృంద అధికారులు పాల్గొన్నారు.

## సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం: కేంద్ర మంత్రి రామ్మోహన్




**విజయవాడ:** సీ ప్లేన్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మరో 3-4 నెల్లలో ఏపీలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం ఉంటుందని చెప్పారు. ఏపీలో 4 రూట్లలో నడిపేందుకు ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజీ వద్ద పున్నమిఘాట్‌కు సీ ప్లేన్ చేరుకుంది. కాసేపట్లో బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సీఎం చంద్రబాబు ఇందులో ప్రయాణం చేయనున్నారు. దీంతో పున్నమి ఘాట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 14 మంది కూర్చునేలా సీ ప్లేన్ సీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రయాణించి సీఎం శ్రీశైలానికి చేరుకోనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొంటున్నారు.

## డ్రగ్స్.. గత ప్రభుత్వ అవినీతి నుంచి సంక్రమించిన వారసత్వ సమస్య: పవన్ కల్యాణ్



**అమరావతి:** ఏపీలో మాదకద్రవ్యాలు పెనుముప్పుగా మారాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వ అవినీతి నుంచి ఎన్డీయే కూటమికి సంక్రమించిన వారసత్వ సమస్య ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. డ్రగ్స్ మాఫియా, గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొంత కాలం క్రితం విశాఖ ఓడరేవులో కొకైన్ స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. దేశంలోని ఇతరచోట్ల పట్టుబడిన డ్రగ్స్‌కు రాష్ట్రంతో సంబంధాలున్నాయని చెప్పారు. విజయవాడలోని ఒక వ్యాపార సంస్థతో సంబంధాలు బయటకొచ్చాయని తెలిపారు. నేరస్థుల కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమని పవన్ కల్యాణ్ అన్నారు.

## ప్రేమ వివాహం.. సెల్‌టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్



**క్రోసూరు:** పల్నాడు జిల్లా క్రోసూరు మండల కేంద్రంలో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్ చల్ చేశాడు. పోలీసులు అతడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. క్రోసూరు గ్రామానికి చెందిన షేక్‌మస్తాన్ వలి (22), సిరిపురం గ్రామానికి చెందిన యువతితో పెద్దలకు తెలియకుండా ప్రేమ పెళ్లి చేసుకున్నాడు.అదే గ్రామంలో యువతితో కలిసి సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు అతడిని బెదిరించడంతోపాటు ఆమెను తీసుకెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని అతడిని సముదాయించారు. డీఎస్పీ హామీ ఇస్తేగాని కిందకి దిగనని యువకుడు చెబుతున్నాడు.

## చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు



**కర్నూలు:** రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు పీటీవారెంట్‌పైకర్నూలుకు తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై గతంలో తెదేపానేత గట్టు తిలక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదైంది.వైసీపీ అధికారంలోఉన్న ఐదేళ్ల కాలంలో బోరగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతని వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. 2021లో కర్లపూడి బాబుప్రకాష్‌ను రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో ఇటీవల పోలీసులు అతడినిఅరెస్టు చేశారు. నల్లపాడు ఠాణాకు తరలించారు. బోరుగడ్డ అనిల్.. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు.

## విశాఖ కేజీహెచ్ కొండపై గంజాయి సాగు కలకలం.. అదుపులో యువకులు



విశాఖ: ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు చేయడం కలకలం రేపుతోంది. కేజీహెచ్ కొండపై బాలికల వసతిగృహం వెనుక ఉన్న కొండపై పలువురు స్మగ్లర్లు గంజాయి పండిస్తున్నారు. ఏడాదిన్నరకాలంగా స్మగ్లర్లు కొండపై గంజాయి పండిస్తున్నారు. నేవీ పరిధిలో ఉన్న ప్రాంతంలో గంజాయి సాగు చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి సంబంధించి పలువురు యువకులను విశాఖ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీ స్థాయిలో గంజాయిని సాగు చేస్తున్నారని, దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీని వెనక ఎవరున్నారనే దానిపైవిచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఒక ముఠా గా ఏర్పడి గంజాయి సాగు చేస్తున్నారా.. లేదా ఆకతాయితనంగా చేస్తున్నారా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.


# తిరుమలలో వైభవంగా పుష్పయాగం

## టన్నుల కొలది వివిధ రకాల పుష్పాలు శ్రీవారికి సమర్పణ



**తిరుమల :** కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీకమాసం శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం నిర్వహించిన పుష్పయాగం తిరుమలలో అత్యంత వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 14 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి వేదమంతోచ్ఛరణల మధ్య పుష్పార్చన నిర్వహించారు.శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారంలో గల కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం వేడుకగా జరిపారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం 1 గంట నుంచి పుష్పయాగ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది.స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రా భరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు. పుష్పయాగం సందర్భంగా టీటీడీ పలు ఆర్జిత సేవలను రద్దు చేసింది. నిన్నటి నుంచి సిఫార్సు లేఖలను అనుమతించ లేదు. టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ అధికారులు, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## శ్రీశైలం ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధికి మంత్రులతో కమిటీ



**అమరావతి :** తిరుమల, తిరుపతి దేవస్థానం మాదిరిగా శ్రీశైలం ఆలయం అభివృద్ధికి మంత్రులతో కమిటీని వేస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కమిటీలో మంత్రులు పవన్ కల్యాణ్, ఆనం రాంనారాయణరెడ్డి, దుర్గేశ్, జనార్దన్ రెడ్డి, జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారని వివరించారు.విజయవాడ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం అదే ప్లేన్‌లో శ్రీశైలం వరకు వచ్చి శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం చంద్రబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మంత్రులతో కమిటీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సలహాలు తీసుకుని శ్రీశైలం ప్రాంతం దైవక్షేత్రంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ఇచ్చే నివేదిక ఆధారంగా ముందుకు వెళ్తామని వివరించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణ పరిస్థితులు ఉంటే పరిశ్రమలు, పర్యాటక రంగం, ఆధ్యాత్మిక కేంద్రాలు అభివృద్ధి చెందుతాయని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు . దీని వల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని వెల్లడించారు.శ్రీశైలం ప్రాంతంలో నల్లమల టైగర్ సఫారి చేయగలిగితే పర్యాటక రంగానికి ఊతమొస్తుందని అన్నారు. తిరుపతి మాదిరిగా సున్నిపేటను నివాస ప్రాంతంగా మార్చి వసతులు కల్పించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తామనిస్పష్టం చేశారు.రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే పరిశ్రమలు, పర్యాటక రంగం, ఆధ్యాత్మిక కేంద్రాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.సోషల్ మీడియాలో తప్పులు పోస్టింగులు పెట్టే ఏ పార్టీ లో ఉన్నవారినైనా ఊరుకోబోమని హెచ్చరించారు. చివరికి వైసీపీలో ఉన్న ఆడబిడ్డలు, తల్లులపై కూడా పెట్టే పోస్టింగులపై సహించబోమని అన్నారు. పోలీసు అధికారులు లాలుచి పడి చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే అదే వారికి చివరిరోజు అవుతుందని హెచ్చరించారు." అభివృద్ధి, సంక్షేమం తెలు గుదేశం పార్టీకి రెండు కళ్లు. అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుంది. అలా చేస్తే ఆదాయం పెరుగుతుంది. తద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వ విధనాల కారణంగా రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉంది. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన భరోసా, మాపై పెట్టకున్న నమ్మకంతో ఇప్పుడిప్పుడే వెంటిలేటర్ పైనుంచి బయపడ్డాం. ఈ రోజు కేంద్రంలో మనం అధికారంలో లేకపోయిఉంటే.. వాళ్లు కూడా సహకరించకపోతే శ్వాస తీసుకోలేని పరిస్థితి మనది. ఈ పరిస్థితికి ఎవరు కారణం. రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నాయి. రిజర్వాయర్లు నిండుకుండల్లా ఉన్నాయి. నదుల అనుసంధానం చేసి గోదావరి, పెన్నా, వంశధార వరకు కలపాలి. ఇదే విషయాన్ని చాలా సార్లు చెప్పాను. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని భావిస్తున్నాం. పోలవరానికి గోదావరి నీటిని తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా ఆలోచనలు చేస్తున్నాం. ఇది జరిగితే గేమ్‌ఛేంజర్ అవుతుంది. తొందర్లోనే శుభవార్త చెబుతాను. రాయలసీమ రతనాల సీమ అవుతుంది" అని అన్నారు.

## రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న 'పుష్ప' చిత్రం విలన్



మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం బహుభాషా నటుడు, పుష్ప చిత్రం విలన్ డాలీ ధనుంజయ శనివారం మంత్రాలయానికి చేరుకున్నారు. శ్రీ మఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అధికారులు స్వాగతం పలికారు. ఆయన తొలుత గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట రాఘవేంద్ర స్వామి మఠం పీఆర్వో వ్యాసరాజాచార్, కర్ణాటక కానిస్టేబుల్ శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## 300 బిలియన్ డాలర్లు దాటిన ఎలాన్ మస్క్ సంపద..!



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయానికి ఎలాన్ మస్క్ ఎంతో కృషి చేశారు. ఈ క్రమంలోనే ఆయన సంపద భారీగా పెరిగింది. 300 బిలియన్ డాలర్లు (రూ.25లక్షల కోట్లు)ను దాటేసినట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ పేర్కొంది. ఈనేపథ్యంలో మస్క్ సంపద ఈ మార్క్‌కు చేరుకోవడం మూడేళ్ల తర్వాత ఇదే మొదటిసారని తెలిపింది. మంగళవారం మస్క్‌కు చెందిన టెస్లా (Tesla) స్టాక్ 28 శాతం పెరిగినట్లు వెల్లడించింది. దీంతో ఆయన సంపద 50 బిలియన్లు పెరిగి 313.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు పేర్కొంది.
బ్లూమ్‌బర్గ్ ప్రకారం.. 2022, జనవరిలో 340.4 బిలియన్ డాలర్లతో 300 బిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన ఏకైక వ్యక్తిగా మస్క్ నిలిచారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిని చేరుకున్నారు. అమెజాన్ వ్యవస్థాపకులు జెఫ్ బెజోస్ 230 బిలియన్ డాలర్లతో, మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ 209 బిలియన్ డాలర్లతో ఆ తరువాతి స్థానాల్లో ఉన్నారు. ఇక, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లిక్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆయనకు పెద్ద మొత్తంలో విరాళాలు సైతం అందజేశారు. ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించడంతో ఎలాన్ మస్క్‌కు ఆయన కార్యవర్గంలో కీలక బాధ్యతలు ఇచ్చే అవకాశాలున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. ఇదే విషయాన్ని గతంలో ట్రంప్ సైతం పేర్కొన్నారు.

## పోటీ నిరోధించేలా జొమాటో, స్విగ్గీ ఒప్పందాలు!

### సీసీఐ దర్యాప్తులో వెల్లడి




**ముంబయి :** ఆన్‌లైన్‌లో ఆర్డరు తీసుకుని, ఆహారాన్ని డెలివరీ చేసే జొమాటో, స్విగ్గీ కంపెనీలు పోటీతత్వ చట్టాలను ఉల్లంఘించినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తులో తేలింది. కొన్ని రెస్టారెంట్‌లకు అనుకూలంగా ఈ సంస్థలు వ్యవహరిస్తున్నాయని, తమకు పోటీ ఎదురు కాకుండా చూసుకునేందుకు ఇలా చేస్తున్నాయని నిర్ధారించింది. తక్కువ కమీషన్ మాత్రమే ఇచ్చేలా కొందరు భాగస్వాములతో జొమాటో 'ప్రత్యేక కాంట్రాక్టులు' కుదుర్చుకుంటోంది. తమ ప్లాట్‌ఫామ్‌పై ప్రత్యేకంగా నమోదైతే, వ్యాపార వృద్ధికి భరోసా ఉంటుందని స్విగ్గీ హామీలు ఇస్తున్నట్లు సీసీఐ పత్రాలు స్పష్టం చేశాయి. హల్దీరామ్ భుజివాలాలో, పాంటోమత్‌కు చెందిన భారత్ వాల్యూ ఫండ్ (బీవీఎఫ్) రూ.235 కోట్ల పెట్టుబడులు పెట్టడం ద్వారా మైనార్టీ వాటాను చేజిక్కించుకుంది. వ్యూహాత్మకంగా వృద్ధి సాధించేందుకు ఈ పెట్టుబడి తోడ్పడుతుందని హల్దీరామ్ మేనేజింగ్ డైరెక్టర్ మనీశ్ అగర్వాల్ పేర్కొన్నారు.

## ఆ వాట్సప్ గ్రూప్‌లు నమ్మొద్దు..

### కస్టమర్లకు హెచ్‌ఎస్‌బీసీ బ్యాంగ్ హెచ్చరిక



**ముంబయి :** హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ తన కస్టమర్లను అప్రమత్తం చేసింది. బ్యాంక్ పేరిట వస్తున్న నకిలీ కాల్స్, సందేశాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈమేరకు కస్టమర్లకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మొబైల్ నంబర్లు, వాట్సప్ ఛానళ్ల గురించి తెలియజేసింది.
హెచ్‌ఎస్‌బీసీ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఐఓ (చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) అయిన వేణుగోపాల్ మంఘాట్‌తో సంబంధం ఉన్నట్లు కొందరు తప్పుడు ధ్రువీకరణతో కస్టమర్లకు వల వేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ప్రైవేట్ బ్యాంక్ తెలిపింది. '85HSBC Global academy' పేరిట ఆ కేటుగాళ్లు వాట్సప్ గ్రూప్ నడుపుతున్నారని, ఇది సంస్థకు సంబంధించినది కాదని స్పష్టంచేసింది. '8008723938' ఫోన్ నంబర్‌తో వినియోగదారులను కేటుగాళ్లు కాంటాక్ట్ అవుతున్నారని, ఈ నంబర్ నుంచి వచ్చే కాల్స్‌ను నమ్మొద్దంటూ మెయిల్ ద్వారా కస్టమర్లకు సూచించింది. కేవలం వాట్సప్‌లోనే కాకుండా ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డిన్, యూట్యూబ్ వేదికగా మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.
బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ కాకుండా.. సంస్థ పేరిట వచ్చే ఇతర ప్లాట్‌ఫామ్‌లను ఆశ్రయించొద్దని తెలిపింది. పైన తెలిపిన నంబర్లతో వచ్చే కాల్స్‌ని ఫేక్‌గా గుర్తించాలని, అలాంటి వాట్సప్ గ్రూప్‌లలో జాయిన్ అవ్వొద్దంటూ కస్టమర్లను అలర్ట్ చేసింది. ఇలాంటి వారి వలలో పడొద్దని తెలుపుతూ.. హెచ్‌ఎస్‌బీసీ అధికారిక వెబ్‌సైట్, సోషల్‌మీడియా హ్యాండిల్స్ లింక్‌లను మెయిల్‌లో పంచుకుంది.

## రెండేళ్లలో ఓలా ఎలక్ట్రిక్ నుంచి 20 ఉత్పత్తులు

**ముంబయి :** ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్లకు సంబంధించి సేవలను అందించడంలో కస్టమర్ల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వేళ ఓలా ఎలక్ట్రిక్ కొత్త ఉత్పత్తులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. ఓవైపు కొత్త సర్వీస్ సెంటర్ల సామర్థ్యాన్ని పెంచుకుంటూనే.. మరోవైపు మరిన్ని కొత్త ఉత్పత్తులను తీసుకురావడంపై దృష్టిపెట్టింది. ఇందులోభాగంగా రానున్న రెండేళ్లలో ద్విచక్ర, త్రిచక్ర వాహన విభాగాల్లో 20 కొత్త ఉత్పత్తులను లాంచ్ చేయాలనుకుంటున్నట్లు కంపెనీ తాజాగా ప్రకటించింది. ఇకపై ప్రతి త్రైమాసికంలో ఓ కొత్త ప్రొడక్ట్‌ని మార్కెట్లోకి లాంచ్ చేయాలనుకుంటున్నట్లు ఓలా ఓ ప్రకటనలో తెలిపింది. ఓలా స్కూటర్ల సేవలకు సంబంధించి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని ఆ మధ్య స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా లేవనెత్తడంతో ఆయనకూ, కంపెనీ సీఈఓ భవీశ్ అగర్వాల్‌కు మధ్య సోషల్‌మీడియా వేదికగా ఓ చిన్నపాటి యుద్ధమే నడిచింది. దీంతో ఓలా ఎలక్ట్రిక్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ వివాదం తర్వాత ఓలా ఎలక్ట్రిక్ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఈనేపథ్యంలోనే తన సర్వీస్ సెంటర్ల విస్తృతిని పెంచే చర్యలు చేపట్టడంతో పాటు కొత్త ఉత్పత్తుల గురించి కూడా తాజాగా ఈ ప్రకటన చేయడం గమనార్హం.

## వరుసగా ఐదో వారం ఫారెక్స్ రిజర్వ్ నిల్వల పతనం..

### 682 బిలియన్ డాలర్లకు పరిమితం..!



**ముంబయి :** వరుసగా ఐదో వారం భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అయ్యాయి. నవంబర్ ఒకటో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 2.7 బిలియన్ డాలర్లు తగ్గి 682.1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. శుక్రవారం ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ రూ.84.38లకు పడిపోయింది. ఫలితంగా రూపాయి మరింత బలహీన పడకుండా ఆర్బీఐ అడ్డుకున్నది. అంతకుముందు అక్టోబర్ 25తో ముగిసిన వారానికి కూడా ఫారెక్స్ నిల్వలు 3.4 బిలియన్ డాలర్లు పతనమై 634.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.
ఫారెక్స్ రిజర్వు నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్సీఏఎస్) 3.9 బిలియన్ డాలర్లు క్షీణించి 589.84 బిలియన్ డాలర్లకు పడిపోయింది. గోల్డ్ రిజర్వ్ నిల్వలు 1.2 బిలియన్ డాలర్లు పెరిగి 69.75 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ మరో పది లక్షల డాలర్లు తగ్గి 18.21 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)లో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు నాలుగు మిలియన్ డాలర్ల నుంచి 4.3 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ తర్వాత స్థానంలో భారత్ నిలిచింది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచింది.

# ప్రతి జిల్లాలో హెచ్‌సీఏ అకాడమీ

- అపెక్స్‌లో త్వరలో తుది నిర్ణయం తీసుకుంటాం
- ఉమ్మడి జిల్లాల్లో పనులు ప్రారంభిస్తాం
- ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో వెల్లడించిన హెచ్‌సీఏ చీఫ్ జగన్‌మోహన్ రావు
- ఈ టోర్నీ విజేతగా ఖమ్మం, రన్నరప్‌గా ఆదిలాబాద్

విశ్వంభర, సంగారెడ్డి : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్23 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో ఆదిలాబాద్‌పై నెగ్గి ఖమ్మం విజేతగా నిలిచింది. శనివారం సంగారెడ్డిలోని ఎంఏ క్రికెట్ గ్రౌండ్లో జరిగిన ఫైనల్‌ను వీక్షించేందుకు ముఖ్య అతిథిగా హెచ్‌సీఏ అధ్యక్షుడు అరశనపల్లి జగన్ మోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఉమ్మడి ఎనిమిది జిల్లాల్లో హెచ్‌సీఏ అకాడమీలను నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ విషయమై అపెక్స్‌లో త్వరలోనే తుది నిర్ణయం తీసుకొని పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాల్లో క్రికెట్‌ను అభివృద్ధి చేసేందుకు తమ కార్యవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని జగన్‌మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సెక్రెటరీ ఆగంరావు, వరంగల్ జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్, మెదక్ జిల్లా సెక్రెటరీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ఖమ్మం, రన్నరప్‌గా నిలిచిన ఆదిలాబాద్ జట్లకు జగన్‌మోహన్ రావు ట్రోఫీలను ప్రదానం చేసి, క్రికెటర్లను అభినందించారు. ఇక, ఈ టోర్నీ ఈనెల 4వ తేదీన ప్రారంభమైంది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఉమ్మడి 8 జిల్లాల జట్లు ఇందులో పాల్గొన్నాయి.



స్కోర్స్ : ఖమ్మం : 336/6.. 50 ఓవర్లు , ఆదిలాబాద్ 262
ఖమ్మం : టీవీఎస్ నారాయణ తేజ 144(123)
ఆదిలాబాద్ : వి సుభాష్ చంద్ర బోస్ 111(109)

## ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నా.. 50 ఏండ్లు వచ్చాకే వీడ్కోలు



**లండన్ :** ప్రపంచ క్రికెట్‌లో వయసు పెరిగినా కొద్దీ రాటుదేలిన పేసర్ ఎవరంటే.. ఠక్కున గుర్తుకొచ్చే పేరు జేమ్స్ అండర్సన్ . 'స్వింగ్ కింగ్'గా పేరొందిన అండర్సన్ దిగ్గజ పేసర్‌గా ఎదిగాడు. ఇంగ్లండ్ జట్టుకు సుదీర్ఘ కాలం ఆడిన ఈ వెటరన్ పేసర్ ఈ ఏడాదే అంతర్జాతీయ కెరీర్ ముగించాడు. 42 ఏండ్ల వయసులో ఆటకు అల్విదా పలికిన జిమ్మీ తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ మెగా వేలంలో పేరు నమోదు చేసుకొని మళ్లీ వార్తల్లో నిలిచాడు. రిటైర్మెంట్ అనంతరం కూడా క్రికెట్ ఆడాలనే తపనతోనే వేలానికి వస్తున్నట్టు అండర్సన్ చెబుతున్నాడు. ఐపీఎల్ వేలంలో పేరు రిజిస్టర్ చేసుకున్న అండర్సన్ స్కై స్పోర్ట్స్ క్రికెట్ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. ఇంకెంతకాలం క్రికెట్ ఆడుతారు? అనే ప్రశ్నకు ఈ దిగ్గజ పేసర్ ఆసక్తికర సమాధానం చెప్పాడు. నేను మళ్లీ క్రికెట్ ఆడాలనుకున్నా. అందుకే వేలంలోకి వస్తున్నా. అయితే.. నన్ను ఏ జట్టు అయినా కొంటుందా? లేదా? అనేది తర్వాత విషయం. కానీ, నేను ఫామ్‌లోనే ఉన్నానని నా మనసు చెబుతోంది. నేను ఫిట్‌గానే ఉన్నాను.వీలైనన్ని రోజులు క్రికెట్ ఆడుతాను. ఒకవేళ నేను అనుకున్నట్టే ఈ ప్రయాణం సాగితే 50 ఏండ్లు వచ్చే వరకూ ఆడుతా. ఎందుకంటే నేను ఇప్పటికీ ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నాను. అయితే.. ఇంగ్లండ్ యువఆటగాళ్లపై దృష్టి పెడుతోంది. ఇది చాలా మంచి విషయం అని అండర్సన్ తెలిపాడు. ఐపీఎల్ 18 సీజన్ వేలంలో అండర్సన్ ప్రత్యేక ఆకర్షణ కానున్నాడు. రూ.1.25 కోట్ల కనీస ధరకు పేరు నమోదు చేసుకున్న ఈ వెటరన్ పేసర్‌ను ఎవరు కొంటారో చూడాలి.

**గాయాలను తట్టుకొని**

అంతర్జాతీయ క్రికెట్‌లో అండర్సన్‌ది 22 ఏండ్ల జర్నీ.. అంత ఈజీ కాదు. అలాంటిది ఓ పేసర్ గాయాలను తట్టుకొని, ఫిట్‌నెస్ కాపాడుకొని 401మ్యాచ్‌లు ఆడేశాడంటే అది నిజంగా అద్భుతమే. అందుకనే 41 ఏండ్ల వయసులోనూ అండర్సన్ బౌలింగ్ చేస్తుంటే.. 'వయసు మర్చిపోయాడా ఏంటీ?' అని అతడితో కెరీర్ మొదలెట్టిన వాళ్లు అసూయ పడేవారు. చెప్పాలంటే.. అండర్సన్ తన తరం, తర్వాతి తరం కుర్రాళ్లతోనూ కలిసి ఆడాడు. సుదీర్ఘ కెరీర్‌లో మూడు ఫార్మాట్లలో 401 మ్యాచ్‌లు ఆడిన అండర్సన్ 991 వికెట్లు పడగొట్టాడు. అయితే వీటిలో అత్యధికం టెస్టుల్లో వచ్చినవే. రెడ్ బాల్ క్రికెట్‌లో 704, వన్డేల్లో 269, టీ20ల్లో 18 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లార్డ్స్ టెస్టు అనంతరం ఇక సెలవంటూ ఆట నుంచి వైదొలిగిన జిమ్మీ కొత్త అవతారం ఎత్తాడు. ఇంగ్లండ్ జట్టుకు ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నాడు.

## ఆ సమయంలో వారిద్దరే అండగా నిలిచారు



**ముంబయి :** మొన్నటి వరకు అవకాశాలు ఇస్తే.. సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడంటూ విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టులో నుంచి తీసేయాలనే డిమాండ్లూ వచ్చాయి. కానీ, మేనేజ్‌మెంట్ మాత్రం ఆ బ్యాటర్‌పై నమ్మకం ఉంచింది. ఛాన్స్‌లు ఇస్తూనే వెళ్లింది. వాటిని సద్వినియోగం చేసుకున్న అతడు.. విమర్శలకు బ్యాట్‌తోనే సరైన సమాధానం ఇచ్చాడు. అతడే భారత ఆటగాడు సంజు శాంసన్ . దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో సెంచరీతో అదరగొట్టాడు. అంతకుముందు బంగ్లాదేశ్‌పైనా శతకం చేసిన అతడు.. వరుసగా రెండు మ్యాచుల్లో ఈ ఫీట్ సాధించిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. అయితే, తన కెరీర్‌లో విఫలమైన సందర్భాలు చాలా ఉన్నాయని.. అలాంటి సమయంలో ఇద్దరు అండగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు.
''నిజాయతీగా చెప్పాలంటే చాలాసార్లు నా కెరీర్‌లో విఫలమయ్యా. సక్సెస్ కంటే ఫెయిల్యూర్లే ఎక్కువ. నాపై సోషల్ మీడియాలోనూ ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడారు. ఐపీఎల్‌లో భారీ స్కోర్లు చేసినా.. అంతర్జాతీయ స్థాయిలో మాత్రం సాధ్యం కాలేదు. అప్పుడు విమర్శలు మరింత ఎక్కువగా వచ్చాయి. ఐపీఎల్‌లో బాగానే ఆడతావు? అంతర్జాతీయ మ్యాచులకొచ్చేసరికి ఏమవుతుంది? అని అడుగుతుంటారు. అలాంటి దశలో ఉన్నప్పుడు మనపై మనకు నమ్మకం సన్నగిల్లుతుంది. కానీ, నాకున్న అనుభవం, నా సామర్థ్యంపై ఎప్పుడూ నమ్మకంతోనే ఉన్నా. స్పిన్, పేస్‌ను సమర్థంగా ఎదుర్కోగలను. జట్టు విజయాల్లో భాగస్వామ్యం ఉండాలని బలంగా కోరుకుంటా.
మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు బయట నుంచి మద్దతు చాలా అవసరం. అదే జట్టులో నుంచి వస్తే మాత్రం అద్భుతంగా ఉంటుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నాకు చాలా సపోర్ట్‌గా నిలిచారు. చాలా టిప్స్ ఇచ్చారు. వాటిని మైదానంలో అమలు చేయగలిగా. ఇప్పుడు కోచ్‌గా వచ్చిన వీవీఎస్ లక్ష్మణ్ నుంచి సూచనలు తీసుకుంటున్నా. విఫలమవుతూ ఉన్నప్పుడు కమ్యూనికేషన్ చాలా కీలకం. అప్పుడే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై చర్చించా. కెప్టెన్ మనమీద నమ్మకం ఉంచి అవకాశాలు ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఉంది'' అని సంజు వెల్లడించాడు.

## మహిళలు పొదుపు చేసే వారి నుంచి పెట్టుబడిదారులుగా మారాలి

**ముంబయి :** సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. పెట్టుబడి పాఠాలు, సూచనలు, సలహాలు అందిస్తుంటారు ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా . తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మహిళల ఆర్థిక సామర్థ్యం గురించి ప్రస్తావించారు. మహిళలు చాలాకాలంగా కుటుంబాలకు ఆర్థిక సారథులుగా ఉంటున్నప్పటికీ సొంత పెట్టుబడులపై బాధ్యత తీసుకోవడానికి వెనకాడుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి మారాలన్నారు. మహిళలు పొదుపు చేసేవారి నుంచి పెట్టుబడిదారులుగా మారాలన్నారు.''మహిళలు పొదుపు చేయడంలో ముందుంటారు. అమ్మలు, అమ్మమ్మలు దశాబ్దాలుగా కుటుంబ ఆర్థిక బాధ్యత నిర్వహిస్తూ ఇంటికి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా వ్యవహరించేవారు. ఇక ఇది మారాలి. డబ్బు నిర్వహణ కోసం పురుషులకు ఔట్‌సోర్సింగ్‌లా పనిచేయడం ఆపండి. పొదుపు చేసే వారి నుంచి పెట్టుబడిదారులుగా మారండి. గుర్తుంచుకోండి. ఇది కష్టమైన విషయమేమీ కాదు'' అని రాధికా గుప్తా సూచించారు.
''సవాళ్లంటే బయటినుంచే వస్తాయని మనలో చాలామంది అనుకుంటారు. కానీ, మనం అంతర్గతంగా ఎదుర్కొనేదే అతి పెద్ద సవాల్. ఐదేళ్ల క్రితం నాదీ అదే పరిస్థితి. నాలో విశ్వాసాన్ని కోల్పోయాను. ఇప్పటికీ దాన్ని తిరిగి తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నా. మీపై నమ్మకం ఉంచండి, మాట్లాడండి, మీ ఆలోచనల్ని ఇతరుల ముందు ఉంచండి'' అంటూ మహిళలకు సూచనలు చేశారు రాధికా గుప్తా. మహిళలు సహజంగానే మల్టీటాస్కింగ్ చేయగలరన్నారు. కోడలిగా, తల్లిగా, భార్యగా వారి పాత్రలను సమర్థంగా నిర్వహిస్తారని కొనియాడారు. ఈ మల్టీటాస్కింగ్ సామర్థ్యం అనేది ఆఫీసుల్లోనూ వారికి ఉపయోగపడుతుందని చెప్పారు. రాధికా గుప్తా నాయకత్వంలో ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. 202324 ఆర్థిక సంవత్సరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఆర్థికంగా బలమైన కంపెనీగా రాణిస్తోంది.

## ఆ బంతిని దాచుకోవాలనుకున్నా.. ఇప్పటికీ కనిపిస్తే ఒట్టు



**సిడ్నీ :** అమూల్యంగా భావించే వస్తువులను భద్రంగా దాచుకుంటాం. అదే క్రికెటర్లు అనుకోండి.. తమ కెరీర్‌లో ముఖ్యమైన సందర్భాలకు సాక్ష్యమైన వాటిని పదిలంగా చూసుకుంటారు. బ్యాటర్లు అయితే.. సెంచరీ కొట్టిన బ్యాట్‌ను అపురూపంగా చూసుకుంటారు. ఇక బౌలర్లు అనుకోండి బంతిని తమ మైలురాయికి గుర్తుగా ఇంట్లోని బహుమతుల పక్కన పెట్టేస్తారు.అయితే.. కొన్నిసార్లు వాళ్లు అనుకున్నది జరగకపోవచ్చు. దాంతో, అరే ఆ జ్ఞాపికను కోల్పోయామే అనే బాధ జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్ కూడా అలాంటి పరిస్థితిలో ఉన్నాడు. అవును.. తాను ప్రేమగా దాచుకోవాలనుకున్న 300వ వికెట్ తీసిన బంతి తనకు దొరకలేదని లియాన్ వాపోతున్నాడు. అసలు ఎందుకలా జరిగిందో వివరించాడిలా..
'దక్షిణాఫ్రికా పర్యటనలో నేను కగిసో రబడ వికెట్ తీసి 300 టెస్టు వికెట్ సాధించాను. అయితే.. సాండ్ పేపర్ వివాదం కారణంగా ఆ బంతిని నా చేతికి రాలేదు. ఆ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన నేను చివరకు ఖాళీ చేతులనే చూపించాల్సి వచ్చింది' అని లియన్ వాపోయాడు. అసలు ఏం జరిగిందటే.. ఆసీస్ జట్టు 2018లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది.కేప్‌టౌన్‌లో జరిగిన మూడో టెస్టులో డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరూన్ బ్యాంక్రాఫ్ట్‌లు సాండ్ పేపర్‌తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించారు. వాళ్లు అలా చేయడం వీడియోలో రికార్డు కావడంతో ఐసీసీ గుర్రుమంది. దాంతో, క్రికెట్ ఆస్ట్రేలియా ఈ ముగ్గురిపై చర్యలు తీసుకుంది. వార్నర్, స్మిత్‌లపై ఏడాది పాటు నిషేధం విధించింది. ఇక బ్యాన్‌క్రాఫ్ట్ మాత్రం 9 నెలలు ఆటకు దూరమయ్యాడు. సాండ్ పేపర్ వివాదం గురించి తెలియగానే మ్యాచ్ ఆఫీషియల్స్ ఆ రోజు ఉపయోగించిన బంతిని స్వాధీనం చేసుకున్నారు. దాంతో, లియాన్‌కు ఆ బంతి ఇక మళ్లీ కనిపించలేదు.

## ఎక్స్‌ట్రా బౌన్స్‌తో భారత బ్యాటర్లకు పరీక్షే



**ముంబయి :** స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను కోల్పోయిన భారత్ మరో కీలక పోరుకు సన్నద్ధమవుతోంది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ బరిలోకి దిగనుంది. హ్యాట్రిక్ కొట్టే అవకాశం టీమ్‌ఇండియా ముంగిట ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జట్టు పరిస్థితిని చూస్తే మాత్రం కష్టమేనన్న అభిప్రాయం క్రికెట్ విశ్లేషకుల్లో ఉంది. మరోవైపు ఆసీస్ మాత్రం స్వదేశంలో తమకు ఎదురులేదని నిరూపించుకోవాలన్న పట్టుదలతో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్లు ఉన్నప్పటికీ.. వారిద్దరూ ఫామ్‌లో లేకపోవడంతో భారత్‌కు కష్టాలు తప్పవని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ ఛాపెల్ వ్యాఖ్యానించాడు. అదనపు బౌన్స్ వచ్చే పిచ్‌లు ఇక్కడ ఉంటాయని.. షాట్లు కొట్టేందుకు ప్రయత్నిస్తే ఔటయ్యే ప్రమాదం ఉందని సూచించాడు.
''గత సిరీస్‌ను గమనిస్తే భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో సమస్యలు ఉన్నట్లు అనిపించింది. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, పంత్ మినహా మిగతా వారు పెద్దగా రాణించలేదు. రోహిత్, విరాట్ పూర్తిగా నిరాశపరిచారు. వారి వయసు గురించి కూడా అభిమానులు మాట్లాడుకొనే పరిస్థితి వస్తుందనుకుంటున్నా. భారత్‌తో టెస్టు సిరీస్ కోసం ఇప్పటికే మంచి పిచ్‌లు సిద్ధం చేశారు. అదనంగా బౌన్స్ వస్తుంది. ఒకవేళ బంతి పైనే ఉన్నప్పుడు షాట్లు కొడదామని భావిస్తే ఔటయ్యే ప్రమాదం లేకపోలేదు. అందుకోసం అత్యంత జాగ్రత్తగా ఆడాల్సిన అవసరం ఉంది. ఇది రెండు జట్లకూ వర్తించే అంశమే'' అని ఇయాన్ ఛాపెల్ తెలిపాడు.

## రోహిత్ ఆస్ట్రేలియాకు వెళ్తాడు..

### తొలి టెస్టులో ఆడటంపై అనుమానమే!



**దిల్లీ :** భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో ఆడటంపై అనిశ్చితి కొనసాగుతోంది. వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో ఉండకపోవచ్చని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. తన భార్య రెండో బిడ్డకు జన్మనివ్వనున్న నేపథ్యంలో కుటుంబంతో ఉండేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, తాజాగా మరొక వార్త క్రికెట్ వర్గాల్లో సర్క్యులేట్ అవుతోంది. రోహిత్ శర్మ ఆస్ట్రేలియా పర్యటనకు భారత జట్టుతో కలిసి వెళ్తాడని సమాచారం. అయితే, తొలి టెస్టు (నవంబర్ 22న ప్రారంభం) ఆడకుండా మళ్లీ భారత్‌కు తిరిగొస్తాడని తెలుస్తోంది. అప్పటి వరకు జట్టుతోపాటు ఉండి.. ఆసీస్ పిచ్ పరిస్థితులపై అవగాహన తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. పెర్త్ వేదికగా జరగబోయే తొలి టెస్టు కోసం ఇప్పటికే అభిమన్యు ఈశ్వరన్ వంటి ఓపెనర్‌ను మేనేజ్‌మెంట్ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ''రోహిత్ భారత జట్టుతోపాటు ఆసీస్‌కు వెళ్తాడు. అయితే, తొలి టెస్టులో ఆడటంపై ఇంకా నిర్ణయం ఖరారు కాలేదు. అప్పటికి ఏం జరుగుతుందో చూడాలి. వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో ఉండనని ఇప్పటికే బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాడు. కివీస్‌తో చివరి టెస్టు అనంతరం కూడా విలేకర్ల సమావేశంలో రోహిత్ తన పర్యటన గురించి మాట్లాడాడు. తాజాగా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, రోహిత్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ తీవ్రంగా చర్చించింది. ఆసీస్ పర్యటనా అందులో చర్చకొచ్చింది'' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రికి భారత జట్టు ఆస్ట్రేలియాకు బయల్దేరే అవకాశం ఉంది.

## ఇక పొట్టి పోరుకు సై..

### విండీస్ స్క్వాడ్‌లో విధ్వంసక క్రికెటర్లు

**వెస్టిండీస్ :** సొంతగడ్డపై చెలరేగి ఆడుతున్న వెస్టిండీస్ పొట్టి సిరీస్‌పై కన్నేసింది. వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్‌ను 12తో ఓడించిన కరీబియన్ జట్టు ఇక తమకు ఎంతో ఇష్టమైన టీ20 సిరీస్‌కు కాచుకొని ఉంది. ఇంగ్లండ్‌తో ఐదు టీ20 సిరీస్ నేపథ్యంలో విండీస్ సెలెక్టర్లు తొలి రెండు మ్యాచ్‌లకు బలమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు.పొట్టి ఫార్మాట్ అంటే చాలు పూనకాలు వచ్చినట్టు ఆడే ఆండ్రూ రస్సెల్, నికోలస్ పూరన్, షిమ్రన్ హెట్‌మైర్‌లకు 15 మందితో కూడిన బృందంలో సెలెక్టర్లు చోటు కల్పించారు. ఊహించినట్టుగానే నిషేధానికి గురైన సీనియర్ పేసర్ అల్జారీ జోసెఫ్‌ను పక్కన పెట్టేశారు.
'ప్రస్తుతం ఎంపిక చేసిన టీ20 జట్టులో ఎందరో అనుభవజ్ఞులు ఉన్నారు. విండీస్ తరఫున టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న జట్టు కూడా ఇది. అయితే.. కష్టమైన విషయం ఏంటంటే 11 మందిని ఎంపిక చేయడం. ప్రతి ఒక్కరు తుది జట్టులో ఉండేందుకు పోటీపడేవాళ్లే. ఇప్పుడు మేము ఎంపిక చేసిన స్క్వాడ్ తమ బ్రాండ్ క్రికెట్ ఆడి.. సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని హెడ్‌కోచ్ డారెన్ సమీ స్క్వాడ్ తెలిపాడు. విండీస్, ఇంగ్లండ్‌ల మధ్య నవంబర్ 9న తొలి టీ0 జరుగనుంది.
తొలి రెండు టీ20లకు వెస్టిండీస్ స్క్వాడ్ : రొవ్‌మన్ పావెల్ (కెప్టెన్), రోస్టన్ చేజ్, షిమ్రన్ హిట్‌మైర్, టెర్రన్సే హిండ్స్, షాయ్ హోప్, అకీల్ హొసేన్, మాథ్యూ ఫోర్డే, షమర్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఎవిన్ లెవిస్, గుడకేశ్ మోతీ, నికోలస్ పూరన్, ఆండ్రే రస్సెల్, షెర్ఫానే రూథర్‌ఫర్డ్, రొమారియో షెపర్డ్.

విశ్వంభర
V3 NEWS

# "ధూం ధాం"కు ప్రేక్షకుల ఎక్స్ లెంట్ రెస్పాన్స్

## సక్సెస్ మీట్‌లో హీరో చేతన్ కృష్ణ



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్‌పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన ఈ సినిమా సకుటుంబంగా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపీ మోహన్ మాట్లాడుతూ.. మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మంచి సినిమా చేశామని ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమాను మీడియా మిత్రులు మరింతగా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని కోరారు. థియేటర్స్ కు వస్తే తప్పకుండా ప్రతి ఒక్కరూ ఎంటర్ టైన్ అవుతారు.

దర్శకుడు సాయికిషోర్ మచ్చా మాట్లాడుతూ.. "ధూం ధాం" సినిమా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అనే పేరు వస్తోంది. ఈ సినిమాకు పనిచేసే అవకాశం మా గోపీ మోహన్ గారి వల్ల వచ్చింది. "ధూం ధాం" సినిమా రిలీజైన ప్రతి సెంటర్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. నాకు కనీసం వంద ఫోన్ కాల్స్ వచ్చి ఉంటాయి. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, బెనర్జీ, సాయి శ్రీనివాస్ వంటి వారి క్యారెక్టర్స్ చూస్తూ.. ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు. మా మూవీని మీడియా ఫ్రెండ్స్ మరింతగా ఆడియెన్స్ కు రీచ్ చేయాలన్నారు.

నటుడు గిరిధర్ మాట్లాడుతూ.. "ధూం ధాం" సినిమాలో నా క్యారెక్టర్‌కు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు. ఇలాంటి మంచి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ సాయికిషోర్‌కు థ్యాంక్స్ చెబుతున్నా. అలాగే మా ప్రొడ్యూసర్ రామ్ కుమార్ గారు మాకు ఎంతో సపోర్ట్ గా నిలిచారు. నా క్యారెక్టర్ బాగుందంటూ ఎంతోమంది ఫోన్ చేసి చెబుతుండటం హ్యాపీగా ఉందన్నారు.

నిర్మాత రామ్ కుమార్ మాట్లాడుతూ పెద్ద సినిమాల పోటీలో "ధూం ధాం" లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. మేము ఇంకా పరుగు స్టార్ట్ చేయలేదు. నిలబడ్డాం అంతే. మా మూవీని ఆడియెన్స్ దాకా రీచ్ చేసిన క్రెడిట్ మీడియా మిత్రులదే. తర్వాత ఓటీటీలో చూద్దాంలే అని అనుకోకుండా "ధూం ధాం" సినిమాను థియేటర్ లో ఎక్స్‌పీరియన్స్ చేయండి. ఎందుకంటే ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమాను 2, 3 వందల మంది ప్రేక్షకుల మధ్య కూర్చొని చూస్తే బాగా ఎంజాయ్ చేస్తారు. అన్నారు.

హీరో చేతన్ కృష్ణ మాట్లాడుతూ మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల దగ్గర నుంచి ఎక్సలెంట్ రెస్పాన్స్ వస్తోంది. మీడియా నుంచి కూడా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. నిన్న (ఫ్రైడే) మార్నింగ్ నుంచి రాత్రి వరకు ప్రతి షోకు థియేటర్స్ లో ఫుట్ ఫాల్స్ పెరిగాయి. సినిమా చాలా బాగుందంటే తప్ప ఆడియెన్స్ బయటకు రాని ఈ ట్రెండ్ లో మా మూవీకి 70, 80 పర్సెంట్ హౌస్ ఫుల్స్ కావడం సంతోషంగా ఉంది. సినిమాలో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఉంటుందని మేము ముందునుంచీ చెబుతూ వస్తున్నాం. ఆ ఎంటర్ టైన్ మెంట్ కే ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూసి తమ రెస్పాన్స్ చెబుతున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. చూడని వాళ్లు థియేటర్స్ లో "ధూం ధాం" చూడమని రిక్వెస్ట్ చేస్తున్నా. అన్నారు.

నటీనటులు చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్, సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, బెనర్జీ, సాయి శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్ నేని, గిరిధర్, భద్రమ్ తదితరులు ఉన్నారు.

### సూర్య 'కంగువా' చిత్రంలో

# పాట పాడిన శ్రద్ధా దాస్



నటిగా శ్రద్ధా దాస్‌కి మంచి పేరు ఉంది. ఇక ఇప్పుడు ఆమె ప్రొఫెషనల్ ప్లేబ్యాక్ సింగర్‌గా మారిపోయారు. ఇప్పుడు ఆమెను గాయనిగా ప్రేక్షకులకు దేవీ శ్రీ ప్రసాద్ పరిచయం చేస్తున్నారు. సూర్య నటించిన పాన్ ఇండియా చిత్రం కంగువాలో శ్రద్ధా దాస్ ఓ పెప్పీ సాంగ్‌ను ఆలపించారు. సూర్య, దిశా పటాని, బాబీ డియోల్ వంటి భారీ తారాగణంతో తెరకెక్కించిన ఈ చిత్రం నవంబర్ 14న రిలీజ్ కాబోతోన్న సంగతి తెలిసిందే.

ఇప్పటికే కంగువా చిత్రంపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. కంగువా నుంచి వచ్చిన యోలో పాట అందరినీ అలరించింది. యూట్యూబ్‌లో ఇప్పటికే మిలియన్ల వ్యూస్ సాధించింది. దేవి శ్రీ ప్రసాద్, శ్రద్ధా దాస్, సాగర్ గాత్రం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాకేందు మౌళి సాహిత్యం అందరినీ ఆకట్టుకుంది.

యోలో పాటలోని శ్రద్ధా దాస్ గాత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన మ్యూజికల్ ఈవెంట్‌లో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్‌తో కలిసి శ్రద్ధాదాస్ పాటలను పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

# " త్రిముఖ" జనవరిలో విడుదలకు సన్నాహాలు

నటుడు యోగేష్ పాన్ ఇండియన్ ఫిల్మ్ "త్రిముఖ"తో తన నటనా రంగ ప్రవేశం చేస్తున్నాడు. ఇందులో నాజర్, సీఐడీ ఆదిత్య శ్రీవాస్తవ్, సన్నీ లియోన్, మొట్టా రాజేంద్రన్, ప్రవీణ్, ఆశు రెడ్డి, ఇతరులు కొన్ని ఉత్తేజకరమైన పాత్రలను పోషిస్తున్నారు. త్రిముఖ షూటింగ్ పూర్తి చేసుకుని జనవరి 2025లో విడుదల చేయాలని భావిస్తున్నారు.

పర్యవసానంగా, నటుడు మరో రెండు చిత్రాలకు "చాణుక్యం", "బెజవాడ బాయ్స్" కూడా సైన్ అప్ చేసాడు. చాణుక్యం సినిమా ఇప్పటికే షూటింగ్ దశలో ఉండగా, బెజవాడ బాయ్స్ సినిమా జనవరి, 2025లో పొంగల్ తర్వాత షూటింగ్ ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

కాబట్టి, నటుడు యోగేష్ ప్రస్తుతం మూడు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు మరియు 2025లో మూడు భారీ విడుదలలను పరిగణనలోకి తీసుకుంటే 2025 అతనికి గొప్ప సంవత్సరం.

చాణుక్య కోసం హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో లాక్ చేయబడింది మరియు ప్రధాన కాస్టింగ్‌లో మోటా రాజేంద్రన్, సుమన్, వినోద్ కుమార్, దన్య బాలకృష్ణ, శ్రవణ్, నాగ మహేష్, ప్రభాకర్ ఇతర నటీనటులు ఉన్నారు. బెజవాడ బాయ్స్‌లో చాలా మంది ప్రముఖ నటులతో భారీ తెలుగు స్టార్ కాస్టింగ్ కూడా ఉంది.



### విక్టరీ వెంకటేష్

# 'సంక్రాంతికి వస్తున్నాం' ఫైనల్ షెడ్యూల్ అరకులో



విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అద్భుతమైన హ్యాట్రిక్ కొలాబరేషన్ తర్వాత మోస్ట్ ఎవైటెడ్ 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ చాలా క్యురియాసిటీని క్రియేట్ చేస్తోంది. ఈ డైనమిక్ కాంబినేషన్ ఇప్పటికే రెండు పెద్ద హిట్‌లను అందించింది. బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో అనిల్ రావిపూడి ది స్పెషల్ రికార్డ్. అప్ కమింగ్ మూవీ ఫుల్ ఫ్లెడ్జ్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇవ్వడంతో పాటు, యూనిక్ ట్రైయాంగిలర్ క్రైమ్ నెరేటివ్ ని అందిస్తుంది. రీసెంట్‌గా రిలీజైన 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ పోస్టర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. శనివారం ఫైనల్ షెడ్యూల్ అరకులో ప్రారంభమైయింది. మేకర్స్ రిలీజ్ చేసి వీడియోలో స్కూల్ స్టూడెంట్స్ హీరో వెంకటేష్ గారికి సాదరంగా స్వాగతం పలకడం, ఆయన ఆప్యాయంగా పలకరించడం అందరినీ ఆకట్టుకుంది.

ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ కాగా, తమ్మిరాజు ఎడిటర్. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాగణం: వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి.

### మూడు మెగా సినిమాలకు

# సై అన్న రెబల్ స్టార్

రెబల్ స్టార్ ప్రభాస్, హోంబలే ఫిల్మ్స్ మ్యాసీవ్ స్కేల్ లో రూపొందే మూడు మెగా సినిమాల కోసం చేతులు కలిపారు. ఈ హిస్టారికల్ కొలాబరేషన్ లో సలార్ పార్ట్ 2 తర్వాత, ఎడిషినల్ గా రెండు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు రానున్నాయి. ఇది ఇప్పటి వరకు ప్రభాస్, ప్రొడక్షన్ హౌస్ మధ్య జరిగిన లార్జెస్ట్ డీల్ సూచిస్తూ, కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

హోంబాలే ఫిల్మ్స్ హైక్యాలిబర్, బిగ్గెస్ట్ స్టార్స్ తో చేసే ప్రాజెక్ట్స్ లైనప్ ని కొనసాగుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక సినిమాలు భారతీయ ప్రేక్షకులకు అద్భుతమైన మూవీస్ అందించాలనే హోంబాలే విజన్ పునరుద్ఘాటిస్తున్నాయి. హోంబలే ఫిల్మ్స్ అద్భుతమైన కంటెంట్ తో, కమర్షియల్ గా సక్సెస్ ఫుల్ చిత్రాలకు పేరుగాంచిన విజనరీ నిర్మాణ సంస్థగా ఎదిగింది. కేజీఎఫ్ చాప్టర్ 1, కేజీఎఫ్ చాప్టర్ 2, కాంతార, సలార్ 1 ప్రపంచవ్యాప్త విజయాలతో హోంబలే అద్భుతమైన లైనప్‌ను నిర్మించింది. ఇందులో ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంతార 2, కేజీఎఫ్ చాప్టర్ 3 అలాగే ప్రభాస్‌తో కొత్త వెంచర్‌లు ఉన్నాయి. ఇండియన్ సినిమాస్‌లో అత్యంత డిమాండ్ ఉన్న సూపర్ స్టార్‌లలో ఒకరైన ప్రభాస్, హోంబలే ల్యాండ్‌మార్క్ చిత్రం సలార్ 2తో పాటు రాజా సాబ్, స్పిరిట్, కల్కి 2, ఫౌజీతో ఎక్స్ ట్రార్డినరీ ప్రాజెక్ట్‌లను తీసుకువస్తున్నారు. హోంబలేతో మల్టీఫిల్మ్స్ డీల్ భారతదేశంలోని ప్రముఖ నిర్మాణ సంస్థతో అతని గొప్ప అనుబంధాన్ని సూచిస్తోంది, హోంబాలే బ్యానర్‌లో నాలుగు చిత్రాలను హెడ్‌లైన్‌గా ఉంచింది. ప్రభాస్ లాంటి సూపర్ స్టార్ నుంచి మూడు బ్యాక్‌టుబ్యాక్ ప్రాజెక్ట్ డేట్స్ ని పొందడం ఒక రేర్ అచీవ్మెంట్, విజన్ తో కూడిన ఈ కొలాబరేషన్ ఇరువురి కాన్ఫిడెన్స్ ని నొక్కి చెబుతుంది. అన్ని పరిశ్రమలను ఏకీకృతం చేసి, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ మార్కెట్‌ల నుంచి మెయిన్ స్ట్రీమ్ బిజినెస్ ని పొందగలిగే బిగ్గెస్ట్ స్టార్ ప్రభాస్.



### 'త్రిబాణధారి బార్బరిక్' నుంచి

# ఉదయ భాను పోస్టర్ రిలీజ్

భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) పాత్రను ఆధారంగా తీసుకుని 'త్రిబాణధారి బార్బరిక్' అనే చిత్రం రాబోతోంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా విజయపాల్ రెడ్డి ఆదిధాల నిర్మించిన ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కించిన ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేయడంతో ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి.

తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్డేట్ వదిలారు. ఉదయ భాను పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి మరింత హైప్ పెంచేశారు. వాకిలి పద్మ అనే పాత్రను ఉదయ భాను పోషించారు. ఇక ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను చూస్తుంటే.. ఆ స్వాగ్, యాటిట్యూడ్, కుర్చీలో కూర్చున్న తీరు అన్నీ కూడా కొత్తగా ఉన్నాయి.



చాలా ఏళ్ల తరువాత ఉదయ భానుకి మంచి పాత్ర పడ్డట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో చిత్రయూనిట్ బిజీగా ఉంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఇకపై ఇలానే సర్ ప్రైజింగ్ అప్డేట్లతో ఆడియెన్స్‌ను చిత్రయూనిట్ అలరించనుంది.

ఈ చిత్రంలో సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, వీటీవీ గణేష్, మొట్టా రాజేంద్ర, ఉధయభాను కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ మూవీకి సినిమాటోగ్రఫర్‌గా కుశేందర్ రమేష్ రెడ్డి, ఎడిటర్‌గా మార్తాండ్ కె వెంకటేష్, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్ పున్న బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలను రామ్ సుంకర పర్యవేక్షిస్తున్నారు.

తారాగణం: సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, VTV గణేష్, మొట్టా రాజేంద్ర, ఉధ్యభాను, రచన, దర్శకత్వం : మోహన్ శ్రీవత్స, నిర్మాత : విజయపాల్ రెడ్డి ఆదిదల, సమర్పణ : మారుతీ టీమ్ ప్రోడక్ట్, సంగీతం : ఇన్ఫ్యూషన్ బ్యాండ్, ఎడిటర్ : మార్తాండ్ కే వెంకటేష్, ఆర్ట్ డైరెక్టర్ : శ్రీనివాస్ పున్నాస్, ఫైట్స్ : రామ్ సుంకర.

### 'ఆహా'లో ట్రెండింగ్ అవుతున్న

# రక్షిత్ అట్లూరి "ఆపరేషన్ రావణ్"

రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటించిన సినిమా "ఆపరేషన్ రావణ్". ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో రూపొందించారు. సంగీర్తన విపిన్ హీరోయిన్ గా నటించింది. ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కు వచ్చింది "ఆపరేషన్ రావణ్" సినిమా. ఈనెల 2వ తేదీ నుంచి ఈ సినిమా ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది.

"ఆపరేషన్ రావణ్" సినిమాకు ఆహా ఓటీటీలో మంచి రెస్పాన్స్ వస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్స్ ఇష్టపడే ఆడియెన్స్ ను ఆకట్టుకుంటున్న ఈ సినిమా ఆహాలో ట్రెండింగ్ అవుతోంది.

"ఆపరేషన్ రావణ్" సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

నటీనటులు: రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్, రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, విద్యా సాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు ఉన్నారు.




### 'కేశవ చంద్ర రమావత్'

# 22న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



రాకింగ్ రాకేష్ కథానాయకుడిగా నటిస్తున్న మూవీ 'కేశవ చంద్ర రమావత్' నవంబర్ 22న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కానుంది. స్టార్ కమెడియన్, డైరెక్టర్ వేణు ఈ సినిమా డేట్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. 'కేశవ చంద్ర రమావత్' (కెసిఆర్), గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీకి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. అన్నన్య కృష్ణన్ కథానాయికగా నటిస్తున్నారు. రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్రం లంబాడీ వర్గానికి చెందిన యువకుడి రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి పొందింది. ఇటీవలే రిలీజ్ అయిన ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా 'కేశవ చంద్ర రమావత్' మేకర్స్ మూవీ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ పోస్టర్ ని 'బలగం'తో సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కమెడియన్, దర్శకుడు వేణు లాంచ్ చేశారు. 'టీం వీరందరికీ ఆల్ ద బెస్ట్. ఇది మరో బలగం అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని చెప్పారు వేణు.

'సినిమాను తెలంగాణ ఆంధ్ర రిలీజ్ చేస్తున్నటువంటి డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాస్ గౌడ్ గారికి (దీప ఆర్ట్స్) జోర్దార్ సుజాత రాకేష్ దంపతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వరల్డ్ వైడ్ గా అమెరికా, ఆస్ట్రేలియాలో కూడా ఈ సినిమాని రిలీజ్ అవుతున్న ఈ చిత్రం అద్భుత ఘనవిజయం సాధిస్తుందని దర్శకుడు అంజి పేర్కొన్నారు.

ఈ చిత్రంలో జోర్దార్ సుజాత, ధనరాజ్, తనికెళ్ల భరణి, తాగుబోతు రమేష్, కృష్ణ భగవాన్, రవి రచ్చ, మై మధు, లోహిత్ కుమార్ ఇతర కీలక పాత్ర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి తెలంగాణ మాస్ట్రో 'చరణ్ అర్జున్' మ్యూజిక్ అందిస్తున్నారు.

నటీనటులు : రాకింగ్ రాకేష్, అన్నన్య కృష్ణన్, తనికెళ్ల భరణి, ధనరాజ్, తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, లోహిత్ కుమార్, బలగం మైమ్ మధు, రచ్చ రవి, కృష్ణ భగవాన్, అంజి, సాయి చరణ్ కిష్టప్ప, జబర్దస్త్ ప్రవీణ్, జబర్దస్త్ నవీన్, జబర్దస్ రాజ్ రాజ్, జబర్దస్త్ జబర్దస్త్ , కీర్తి లత, బలగం తాత, జబర్దస్త్ కర్తానందం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com